

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 208

బుధవారం 19-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



శ్రీలంక రచయితకు బుకర్ ప్రైజ్

శ్రీలంక రచయిత షెహాన్ కరుణతిలకను ప్రఖ్యాత బుకర్ ప్రైజ్-2022 వరించింది. 'ది సెవెన్ మూన్స్ ఆఫ్ మాలి అల్మీడియా' రచనకు గాను ఈ పురస్కారం దక్కింది. లండన్‌లో జరిగిన కార్యక్రమంలో బుకర్ ప్రైజ్‌తో పాటు 50 వేల పౌండ్లను ఆయన అందుకున్నారు.

- 6లో


A quality product from
PAN BAHAR
అందరూ చేరే
పండగ వేళ
బాహుబలి
రాగానే
మోగింది ఈల
Bahubali
PAN MASALA
ఇది బాహుబలి సత్తా
NO TOBACCO NICOTINE
CHEWING OF PAN MASALA IS INJURIOUS TO HEALTH. NOT FOR MINORS


'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 208

బుధవారం 19-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బిన్నీ చేతికి బీసీసీఐ పగ్గాలు

కార్యదర్శిగా జైషా.. కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక -IVలో



కొనసాగుతున్న లాభాలు

సెన్సెక్స్ లాభం 550 పాయింట్లు.. 175 పాయింట్లు పెరిగిన నిఫ్టీ - 11లో



కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్

ఉత్తరాఖండ్ రాష్ట్రం కేదార్‌నాథ్‌లో హెలికాప్టర్ కొండను ఢీకొని కూలిపోవడంతో ఆరుగురు యాత్రికులు, పైలట్ మరణించారు.

వివరాలు 6లో



రబీ పంటల ఎంఎస్పీ పెంపు

రబీకి సంబంధించి గోధుమ, ఎర్ర కందులు, శనగలు సహా 6 పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

వివరాలు 6లో



ఇంత భారీ కౌంటరా?

బిల్కిస్ బానో కేసులో దాఖలు చేసిన భారీ అఫిడవిట్‌లో వివరాలు లేవంటూ గుజరాత్ సర్కార్‌పై 'సుప్రీం' అసంతృప్తి వెలిబుచ్చింది.

వివరాలు 6లో



తప్పులు చేశాం.. క్షమించండి

తాను తీసుకున్న నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను మరింత ఇబ్బందుల్లోకి నెట్టడంతో బ్రిటన్ ప్రధాని లిజ్‌ట్రస్ క్షమాపణ కోరారు.

వివరాలు 6లో

ముసుగు తీసిన పార్ట్‌నర్స్

విజయవాడలో ఓ రాజకీయ వీధి నాటకం | హోటల్‌లో పవన్‌ను 'పరామర్శించిన' చంద్రబాబు

- గంటన్నరసేపు దత్తపుత్రుడితో మంతనాలు
- అంతకుముందు జనసేన సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలను బూతులు తిట్టి చెప్పు చూపించిన జనసేనాని
- వ్యూహం మారుస్తున్నానంటూ టీడీపీతో పొత్తుపై పరోక్ష సంకేతాలు
- చంద్రబాబుతో భేటీ అనంతరం ఉమ్మడిగా మీడియాతో సంభాషణ
- 'ప్రజాస్వామ్యం' కోసం ప్రస్తుతానికి కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు బిల్డప్.. కమ్యూనిస్టులు, బీజేపీ కూడా కలిసి రావాలని పిలుపు
- రాష్ట్రంలోని సమస్త పార్టీలు కలిస్తే కానీ జగన్ సర్కారును ఎదుర్కోలేమన్న పిరికితనానికి 'ప్రజాస్వామ్య రక్షణ' ముసుగు
- విశాఖలో నిజానికి మంత్రులపై దాడి చేసిందే జనసేన కార్యకర్తలు
- పవన్‌పై దాడి జరిగిందన్నట్లుగా చంద్రబాబు వక్రీకరణ
- వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తున్నట్లుగానే బయటపడ్డ దత్తపుత్ర బండారం



విజయవాడలోని హోటల్ లాబీలో నవ్వులు చిందిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, ఆ పార్టీ నేత నాదెండ్ల మనోహర్

పవన్.. బండ బూతులు!

- నా కొడకల్లారా.. రండి అంటూ జనసేన అధినేత దుర్భాషలు
- వైఎస్సార్‌సీపీ నేతలపై తిట్ల దండకం
- అది తనకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని వ్యాఖ్య
- ఇక యుద్ధానికి సిద్ధమంటూ సవాల్
- ప్యాకేజీ స్టార్ అంటే చెప్పుతో కొడతానంటూ ఉద్రేకం.. కాపులు అధికారం సాధించేందుకు ఏం చేశారు?
- రంగాను కాపాడుకునేందుకు ఊరికి పది మందైనా రాలేదని వ్యాఖ్య

2లో

సాక్షి, అమరావతి: అందరూ ఊహించిందే జరిగింది! మొత్తానికి ఇద్దరు భాగస్వాములూ ముసుగులు తీసేశారు. ఇన్నాళ్లూ తాము వేర్వేరు పక్షాలుగా ఉన్నట్లు ప్రజలను భ్రమింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్న టీడీపీ, జనసేన ఒక్కటై పోయాయి. ఓ పథకం ప్రకారం తామిద్దరూ కలిసిపోవటానికి తగ్గ పరిస్థితులు సృష్టించుకుని మరీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏకమయ్యారు. మంగళవారం విజయవాడలోని నోవాటెల్ సాక్షిగా ఓ వీధి నాటకాన్ని రక్తి కట్టించారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ పని చేస్తున్నారంటూ ఆది నుంచి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలు చెబుతున్న మాటలు నూటికి నూరు పాళ్లు నిజమేనన్నది స్పష్టమైంది. 2014లో జనసేనను స్థాపించిన పవన్ కళ్యాణ్.. చంద్రబాబు సూచనల మేరకే ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీకి మద్దతు ఇచ్చానని అప్పట్లో స్వయంగా చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలితే మళ్లీ చంద్రబాబే గెలుస్తారనే లక్ష్యంతో వామపక్షాలు, బీఎస్పీతో కలిసి 2019 ఎన్నికల్లో

మిగతా 2వ పేజీలో ▶



ముమ్మాటికీ ప్యాకేజీ స్టార్‌వే

■ పవన్ నువ్వు ముమ్మాటికీ ప్యాకేజీ స్టార్‌వే. బాబును సీఎం చేయడమే నీ లక్ష్యం. ముద్రగడ కుటుంబాన్ని బాబు తిట్టిస్తే నీ నోరు ఎందుకు లేవలేదు. 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ముందా? నా కొడకా అని మాట్లాడితే నాలుక చీరేస్తాం. -మాజీ మంత్రి పేర్ని నాని



రాజకీయాల్లో పవన్ ఒక విలన్

■ చంద్రబాబుతో కలిసి పవన్ కుట్రలు పన్నుతున్నారు. రాజకీయాల్లో పవన్ ఒక విలన్. విశాఖ గర్జన నుంచి ప్రజల్ని డైవర్ట్ చేయడమే వారి లక్ష్యం. పీకే అంటే ప్యాకేజీల కళ్యాణ్, పెళ్లిళ్ల కళ్యాణ్. మళ్లీ భార్య వదిలేసిపోయిందా? అందుకేనా ఫ్రస్టేషన్? - మంత్రి అమర్‌నాథ్



పొలిటికల్ జోకర్ పవన్

■ పవన్ కళ్యాణ్ ఒక పొలిటికల్ జోకర్. ఎప్పుడు ఏం మాట్లాడుతాడో.. ఆయనకైనా తెలుసో, లేదో? ప్యాకేజీల పవన్, చంద్రబాబుల వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. - మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఆ చెప్పు నీదా.. నీ యజమానిదా?

■ అధికారం కోసం చంద్రబాబు, పవన్ గడ్డి అయినా తింటారు. చంద్రబాబు చెప్పినట్లు ఆడే తోలుబొమ్మ పవన్. నువ్వు చూపించిన చెప్పు అయినా నీదేనా లేక నీ యజమాని చంద్రబాబుదా? - మంత్రి జోగి రమేష్



కలిసి కాపురానికి ఇంత సీన్ ఎందుకు?

■ చంద్రబాబు, పవన్‌లది రహస్య ప్రేమ. ఇద్దరూ కలిసి కాపురం చేయడానికి ఇంత సీన్ సృష్టించాలా? ఒక్కరోజైనా కాపుల సంక్షేమం గురించి మాట్లాడావా పవన్? నీ పక్కన ఒక్క కాపు నాయకుడినైనా కూర్చోపెట్టావా? -మాజీ మంత్రి కన్నబాబు

- వివరాలు 2,8లో

న్యూస్‌రీల్

కర్నూలు జిల్లాలో జోడో యాత్ర



కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మంగళవారం ఏపీలోని కర్నూలు జిల్లాలో ప్రారంభమైంది. ఆయన 22 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. 2024లో అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారు.

వివరాలు 5లో ▸

హంసవాహనంపై పైడితల్లి విహారం



పైడితల్లి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విజయనగరంలో తెప్పోత్సవం కనులపండువగా సాగింది. పూజల అనంతరం అమ్మవారు హంసవాహనంపై విహరించారు.

వివరాలు 7లో ▸


22 తర్వాత తుపాను!



పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 22 తర్వాత తుపాను ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావం ఏపీపై అధికంగా ఉంటుందని.. భారీనుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని నిపుణులు చెబుతున్నారు.

వివరాలు 3లో ▸

బీజేపీ నుంచి దేశాన్ని రక్షిస్తాం



సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా డి.రాజా ఎన్నికయ్యారు. బీజేపీ నుంచి దేశాన్ని రక్షిస్తామని ఆయన చెప్పారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉధృతంగా పోరాటాలు చేస్తామన్నారు.

వివరాలు 5లో ▸

ఇదండీ సంగతి



సైనికులందరూ భారత్ సరిహద్దుల్లో డ్యూటీ వేయమని ఒకటే గొడవ చేస్తున్నార్సార్!!

సంపూర్ణంగా సర్వే

భూముల సమగ్ర సర్వే ఫలాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందాలి

అంతా సంతృప్తి చెందాలి.. నాణ్యత తప్పనిసరి: సీఎం జగన్

- భూ వివాదాలు, తగాదాలు లేని గ్రామాలే లక్ష్యం
- సర్వేతో రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన
- రికార్డులు, డేటా స్వచ్ఛీకరణ
- 100 ఏళ్ల తర్వాత సర్వే.. వేల సంఖ్యలో నియామకాలు.. అత్యాధునిక పరికరాల కోసం రూ.కోట్లు వెచ్చించాం
- ఎవరూ వేలెత్తి చూపకుండా సర్వే జరగాలి
- దోషాలు, తప్పులతో ఒక్క హక్కు పత్రం కూడా రైతులకు వెళ్లకూడదు
- సచివాలయ పరిధిలో సర్వే పూర్తి కాగానే అక్కడే రిజిస్ట్రేషన్ కార్యాలయం
- ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందనే సర్వేపై దుష్ప్రచారాలు
- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్షపై సీఎం సమీక్ష

3లో



మీసం మెలేసి.. చెప్పులు విసిరి



రాజమహేంద్రవరంలో నిరసన తెలుపుతున్న ప్రజలను రెచ్చగొడుతున్న అమరావతి యాత్రికులు

- రాజమహేంద్రవరంలో టీడీపీ, జనసేన శ్రేణుల బీభత్సం
- అమరావతి యాత్రను ఆపేదెవరూ అంటూ పాటల ద్వారా అడుగడుగునా కవ్వింపు
- శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలపై దాడి.. ఇద్దరికి గాయాలు
- ప్రతిఘటించిన స్థానికులు
- ఆజాద్ చౌక్ వద్ద ఉద్రిక్తత

5లో

వైద్య శాఖలో పోస్టులకు నేటి నుంచి ఇంటర్వ్యూలు

■ డీఎంఈ, ఏపీ వైద్య విధాన పరిషత్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ బుధవారం నుంచి వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనుంది. శాశ్వత, కాంట్రాక్టు ప్రాతిపదికన 400కు పైగా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల పోస్టులను భర్తీ చేయనుంది.

3లో



క్లుప్తంగా

ముసుగు ఎప్పుడో తొలగించారు

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల



సాక్షి, అమరావతి: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలయిక అత్యంత ప్రమాదకరమైన కాలుష్యం లాంటిదని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. వారిద్దరూ కలిసిపోతారని తమ పార్టీ ఎప్పటినుంచో చెబుతోందని, ముసుగు ఎప్పుడో తొలగించారని.. ఇప్పుడు లైవ్‌లో ఓపెన్ అయ్యారని ఆయన పేర్కొన్నారు. విజయవాడ పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద మంగళవారం గోపుష్టి కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వారి కలయిక మీద మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. 'వైజాగ్ లో అసలు ఏం జరిగింది? 3 గంటలపాటు ఎవరు రోడ్లపై ఊరేగారు? ఎవరు ఎవరిపై దాడి చేశారు? ఇక్కడకు వచ్చి ఎవరు చెప్పులు చూపిస్తూ మాట్లాడారో కూడా జనం చూశారు. వారి అసలు స్వరూపం అదే. ఇప్పుడు బయట పెట్టారని, ఇలాంటి వాళ్లా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేది?' అని సజ్జల ప్రశ్నించారు.

పవన్ శాడిస్టులా మాట్లాడుతున్నాడు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సాక్షి, నరసరావుపేట: పవన్‌కల్యాణ్ ఎప్పుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదని, ఓ శాడిస్టులా ప్రవర్తిస్తున్నాడని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్ధతి లేకుండా దుర్మార్గంగా వ్యవహరించే పవన్ మంగళవారం మాట్లాడిన మాటలు చూస్తే ఆయన రాజకీయాలకు అనర్హుడని తెలుస్తోందన్నారు. గౌరవ మంత్రులు, టీటీడీ చైర్మన్‌పై దాడులు చేసిన వారిని వదిలేయాలని కోరుతున్నావా.. అని నిలదీశారు. ఇలాంటి వాడి వెంట మా పిల్లలు వెళుతున్నారని తల్లిదండ్రులు బాధపడుతున్నారని చెప్పారు.

పవన్‌కల్యాణ్‌కు మతిభ్రమించింది

మంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: పవన్‌కల్యాణ్ ప్రస్ట్రేషన్‌తో మతిభ్రమించి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. రెచ్చగొట్టే ఉపన్యాసాలతో యువతను ఉన్మాదంవైపు పురిగొల్పుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశ రాజకీయాల్లో పవన్‌కల్యాణ్ పర్వర్టెడ్ క్యాండెట్‌గా మిగిలిపోతాడని ఆయన పేర్కొన్నారు.

ఇదీ.. అమరావతి రాజధాని అసలు కథ

ఈ ఫొటోలు చూశారా? అమరావతికి అన్యాయమంటూ చంద్రబాబు చెప్పినప్పుడు గానీ, ఆయన అనుకూల మీడియా గానీ ఇలాంటి ఫొటోలు ఎప్పుడూ ప్రచురించవు. ఇప్పటిదాకా అక్కడ నిర్మించిన హైకోర్టు భవనమో, సచివాలయ, అసెంబ్లీ భవనాలనో మాత్రమే చూపిస్తాయి. కానీ ఇక్కడి ప్లాను గానీ, కట్టడాలు గానీ ఎంత దారుణమో తొలి చినుకుకే చిల్లులు పడ్డ అసెంబ్లీ భవనం, పైకప్పు నుంచి నీళ్లు కారే సచివాలయ ఛాంబర్లు చెప్పేశాయి. ఇక అమరావతి ఏ స్థాయిలో ఉంటుందో వర్షం పడ్డ ప్రతిసారీ కళ్లకు కడుతూనే ఉంటుంది. తాజాగా మూడు రోజుల కిందటి వరకూ వర్షాలు పడ్డాయి. అప్పట్లో అక్కడికి వెళ్లే పరిస్థితే లేదు. మూడు రోజుల తరవాత మంగళవారం అక్కడి పరిస్థితికి అద్దం పట్టే చిత్రాలివిగో...

– సాక్షి, విజయవాడ



ఇది చెరువు కాదు. పొలమూ కాదు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి వెళ్లే 100 అడుగుల రోడ్డు.. వర్షం పడ్డ మూడు రోజుల తరవాత కూడా నడుంలోతు నీళ్లలో మునిగే స్థితిలో ఉందీ రోడ్డు. వాహనాల సంగతి సరే. కనీసం నడిచి కూడా వెళ్లలేని పరిస్థితి.





ఇది రాజధాని కోర్ ఏరియాలోని నీరుకొండ గ్రామం. రోడ్డుకు అటూ ఇటూ ఉన్నవి ప్రస్తుతానికి పొలాలు. వివిధ నిర్మాణాలు రావాల్సిన స్థలాలవి. కానీ అవి చెరువుల్ని మించిపోయాయి. ఆ రోడ్డుపై వెళ్లటమే దుస్సాధ్యంగా మారిందిప్పుడు.



నీరు కొండ గ్రామంలో అటూ ఇటూ ఉన్నవారు మెయిన్ రోడ్డుకు చేరుకునే ప్రాంతం మొత్తం చెరువును మించిపోయింది. దాంతో రోడ్డుమీదకు రావటానికి ఇలా పాట్లు పడక తప్పటం లేదు.

నువ్వు ముమ్మాటికీ ప్యాకేజీ స్టార్‌వే

- ముద్రగడ కుటుంబాన్ని బాబు అసభ్యంగా తిట్టిస్తే నీ నోరు ఎందుకు లేవలేదు?
- కాపులంతా వైఎస్ జగన్‌తోనే ఉన్నారు
- చంద్రబాబును సీఎంను చేయడమే నీ లక్ష్యం
- 175 శాసనసభ స్థానాల్లో పోటీ చేసే దమ్ముందా?
- నా కొడకా.. ఇంకోసారి ఇలా మాట్లాడితే నాలుక చీరేస్తాం
- పవన్ కల్యాణ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని హెచ్చరిక



సాక్షి, అమరావతి: ముమ్మాటికీ పవన్ కల్యాణ్ ప్యాకేజీ స్టారేనని.. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే ఆయన లక్ష్యమని మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. 175 శాసనసభ స్థానాల్లో జనసేన బరిలో దిగే దమ్ముందా అని నిలదీశారు. చంద్రబాబుతో అంటకాగను.. ఆయన కాళ్లు పిసకను.. బూట్లు నాకను అని పవన్ చెప్పాలన్నారు. అలా చేస్తే ప్యాకేజీ స్టార్ అనే మాటను ఉపసంహరించుకుంటామని.. ఆయనకు క్షమాపణలు కూడా చెబుతానని తెలిపారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. బూతు డైలాగ్‌లతో నోరు పారేసుకుంటే పవన్ నోటి తీట తీరుతుందేమోగానీ సీఎం వైఎస్ జగన్ ఈక కూడా పీకలేరని స్పష్టం చేశారు. 'సన్నాసిన్నర సన్నాసి.. శుంఠన్నర శుంఠ.. నీ భాష మార్చుకో.. ఇంకోసారి ఇలాగే మాట్లాడితే నా కొడకా.. నీ నాలుక చీరేస్తాం' అంటూ పవన్‌కు పేర్ని నాని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంకా ఏమన్నారంటే...

కాపులను గంపగుత్తగా అమ్మేయడమే పవన్ లక్ష్యం

జగన్ పట్ల కాపులు ప్రేమతో ఉన్నారని పవన్ రగిలిపోతున్నాడు. అందుకే జగన్, కాపుల మధ్య విభేదాలు సృష్టించి.. కాపులను గంపగుత్తగా చంద్రబాబుకు అమ్మేయడానికి పవన్ ప్రయత్నిస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ గూండాలను ఇంట్లో నుంచి చొక్కా లాక్కుని వచ్చి కొడతానని పవన్ అంటున్నాడు. అయితే వైఎస్సార్‌సీపీలో గూండాలు లేరు. జనసేనలోనే ఉన్న గూండాలు, రౌడీలను పవన్ కొట్టాలి. అవంతి శ్రీనివాస్ నిన్ను సోదరా అని సంబోధిస్తే.. 'నువ్వు ఆయనను ఏరా నా కొడకా.. ఏం సోదరరా? నీకు, నాకు చుట్టరికం ఏమిట్రా? అని బూతులు తిడతావా? ఇదే నీ సంస్కారం.. సన్నాసిన్నర సన్నాసి. సోదరా అంటేనే నీకు అంత కడుపు రగిలితే.. కాపు ఎమ్మెల్యేలందరినీ నా కొడకల్లారా అంటే మేమెంత ఫీల్ కావాలి? మాకెంత ఫ్రస్ట్రేషన్ రావాలి? రామ్ మనోహర్ లోహియా, కొంపల్లె సుందరం, పూలే పుస్తకాల్లో బూతులు చదివావా? వాటినీ మేము చదవాలా.. శుంఠన్నర శుంఠ? ఈ సన్నాసిన్నర సన్నాసి బాధ, దుగ్ధ ఏమిటంటే.. సీఎం వైఎస్ జగన్ కాపులకు చాలా ప్రాధాన్యం ఇస్తున్నారు. మంత్రుల్లో ఐదుగురు కాపులున్నారు. విధాన నిర్ణయాల్లో వారికి చాలా ప్రాధాన్యత ఉంది. ఒక్క కాపు నేత కూడా టీడీపీవైపు రావడం లేదన్న దుగ్ధ, బాధ పవన్‌కు ఉన్నాయి. రంగా ఉన్నప్పుడు ఈ శుంఠ ఎక్కడున్నాడు? నీ ప్రభుత్వంలో ముద్రగడ కుటుంబాన్ని ముతక మాటల్లో దూషిస్తే ఆ రోజు నీ నోటికి పక్షవాతం వచ్చిందా పవన్? నీ పెళ్లిళ్ల గురించి ఎవరికి అవసరం? ఎప్పుడైతే.. కావాలంటే మీరు కూడా మూడు పెళ్లిళ్లు చేసుకోండి అని నువ్వు అన్నావో అప్పుడే మేము మాట్లాడాల్సి వచ్చింది. మా పార్టీ నేతలు ఒక పెళ్లి చేసుకుని 30 మందితో తిరుగుతారని అంటావా? అంటే ఆ స్టెప్నీలను నీవు పంపావా? నీదేమైనా సప్లై కంపెనీనా? నువ్వు కార్లు కొనుక్కుంటే ఎవరెందుకు కామెంట్లు చేస్తారు? నా కింద పని చేసే వారికి జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేవు.. కారుకు ఈఎంఐ కూడా కట్టలేకపోతున్నానని నీవే కదా అన్నావ్!

ఎవర్రా నీ కొడుకులు?

ఎవర్రా నీ కొడుకులు? నేను నిఖార్సయిన కాపును. మేము జగన్ నేతృత్వంలో పని చేస్తుంటే.. ఊడిగం చేస్తున్నామంటావా? మరి నీ పక్కన నాదెండ్ల మనోహర్ ఏం చేస్తున్నాడు? కాళ్లు ఒత్తుతున్నాడా.. పిసుకుతున్నాడా? నీకు ఒక కాలుకే చెప్పు ఉందేమో? మాకు రెండు చెప్పులున్నాయి. టీవీ చానళ్ల ముందు చెప్పు తీసి సినిమా డైలాగ్‌లు చెప్పి నా కొడకల్లారా అని అంటే నీ నోటి దూల తీరుతుందేమో! నీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు వైఎస్సార్‌సీపీ భయపడదు.

జనసేనను చంద్రబాబుకు అప్పగించడమే పవన్ లక్ష్యం..

పార్టీ పేరుతో ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థను నడుపుతున్న పవన్ దత్తపుత్రుడు కాక మరేమిటి? చివరకు జనసేనను చంద్రబాబుకు అప్పగించడమే పవన్ లక్ష్యం. రేపటి నుంచి రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం మారబోతోందని చెప్పిన పవన్.. టీడీపీతో పొత్తు గురించి చెప్పకనే చెప్పాడు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. అందుకే ముసుగు తీసి చంద్రబాబుతో చెట్టపట్టాలు వేసుకోవడానికి సిద్ధమయ్యాడు. పార్టీ పెట్టి.. ఒక్కచోట కూడా అభ్యర్థిని పెట్టకుండా వేరే వారికి ఓటేయమంటే ఏమంటారు? ప్యాకేజీ ఉందని అంటారా? లేదంటారా? 2014లో జనసేన ఎందుకు పోటీ చేయలేదు? 2019లో వామపక్షాలు, మాయావతితో కలిసి పోటీ చేసి, చివరి క్షణం వరకు టీడీపీకి అనుకూలంగా అభ్యర్థులను మారుస్తూ వచ్చిన తంతును ప్యాకేజీ అనకుండా ఏమంటారు.. పవన్? చంద్రబాబు గెలవాలని.. అందుకు బీజేపీ కూడా కలిసి రావాలని పవన్ అంటున్నాడు. అది వారికి నచ్చకపోతే, వారి తీరు తనకు నచ్చడం లేదని చెబుతున్నాడు.

పవన్.. బండ బూతులు!

నా కొడకల్లారా.. రండి అంటూ దుర్భాషలు

- వైఎస్సార్ సీపీ నేతలపై జనసేనాని తిట్ల దండకం
- అది తనకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని వ్యాఖ్య
- ఇక యుద్ధానికి సిద్ధమంటూ సవాల్
- ప్యాకేజీ స్టార్ అంటే చెప్పుతో కొడతానంటూ ఉద్రేకం



సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈసారి స్వయంగా తిట్ల దండకం ఎత్తుకున్నారు. వైఎస్సార్ సీపీ నేతలనుద్దేశించి తీవ్ర స్థాయిలో దుర్భాషలాడుతూ ఉద్రేకంతో ఊగిపోయారు. పదేపదే 'నా కొడకల్లారా..!' అంటూ దాదాపు గంటపాటు బండ బూతులు వల్లించారు. భారత రాజ్యాంగం తనకు కల్పించిన హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛని ఈ విధంగా ప్రకటిస్తున్నానని, ఇవాళ్టి నుంచి యుద్ధానికి సిద్ధమని ప్రకటించారు. మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయం దీనికి వేదికగా మారింది. 'కొడకల్లారా.. నా భాష తెలుసురా మీకు? మాట్లాడితే మూడు పెళ్లిళ్లు చేసుకున్నావ్ అంటారా? మీరూ చేసుకోండ్రా.. ఎవడు కాదన్నారు? విడాకులు ఇచ్చే మూడు పెళ్లిళ్లు చేసుకున్నా సన్నాసుల్లారా.. ఒకర్ని పెళ్లి చేసుకొని 30 స్టెప్నీలతో తిరిగే మీకేంట్రా నేను చెప్పేది... వెధవల్లారా.. చొక్కా పట్టుకొని ఇళ్లలోంచి లాక్కొచ్చి కొడతాం రా...' అంటూ మంగళవారం కార్యకర్తల సమావేశంలో పవన్‌కల్యాణ్ రెచ్చిపోయారు. నన్ను ప్యాకేజీ స్టార్ అనే సన్నాసి నా కొడుకులు ఎవరు? అంటూ ఊగిపోయారు. వైసీపీ నాయకులు ఒక్కొక్కరినీ దవడ వాచిపోయేలా కొడతా కొడకల్లారా (కాలి చెప్పు తీసి చూపిస్తూ).. తమాషాగా ఉందా కొడకల్లారా..? ఇంకోసారి ప్యాకేజీ గీకేజీ అంటే చెప్పు తీసుకొని పళ్లు రాలగొడతా కొడకల్లారా. మెడ పిసికి కింద నొక్కేస్తాం కొడకల్లారా..' అంటూ పచ్చిబూతులు మాట్లాడారు. ఈ సమయంలో కార్యకర్తల కేరింతలతో పవన్ కళ్యాణ్ ముసిముసి నవ్వులు నవ్వుతూ ఉండిపోయారు.

అధికారం ఒకట్రెండు కులాలకే కుదరదు..

జనసేనకు బలం ఉంది కానీ పోలింగ్ బూత్‌ల వద్ద యుద్ధం చేయడానికైనా నిలబడే వారు కావాలని పవన్ వ్యాఖ్యానించారు. బలిజ, కాపు, తెలగ, ఒంటరి సమూహం ఇంత సంఖ్యా బలం ఉన్నా అధికారం దక్కలేదంటున్నారని, అందుకోసం ఏం చేశారని వారంతా ఆలోచించుకోవాలన్నారు. రంగాను స్టేట్ (ప్రభుత్వం) చంపేస్తదని అన్నప్పుడు గ్రామానికి ఓ పది మంది ఆయన పక్కన ఎందుకు లేరని ప్రశ్నించారు. ఆయన మరణానికి మీరు బాధ్యత తీసుకోండి అంటూ ఆయా కులాల వారిని ఉద్దేశించి అన్నారు. ఇక నుంచి అధికారాన్ని ఒకట్రెండు కులాలు దగ్గర పెట్టుకుంటే కుదరదని, అందరికీ రావాలని వ్యాఖ్యానించారు. కాపులను చరిత్రలో గొప్పగా చిత్రీకరించిన పలు పుస్తకాల గురించి ప్రస్తావిస్తూ.. కాపులకు పెద్దన్న పాత్ర వహించమని ఊరికే చెప్పలేదన్నారు.

మీరు గట్టిగా నిలబడాలి మరి..

స్టీల్ ప్లాంట్ పోతుంటే విశాఖ వాసులకు కోపం ఎందుకు రావడం లేదు? భయమా? అని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. మీరు (కార్మికులనుద్దేశించి) బయటకు రావాలి. మీరు నిలబడతామంటే ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా చూసే బాధ్యత మేం తీసుకుంటామన్నారు. భవిష్యత్తులోనూ తాను కచ్చితంగా సినిమాలు చేస్తానని చెప్పారు. పోలీసులు రేపొద్దున తమ ప్రభుత్వం కిందే పని చేయాల్సి వస్తుందని గుర్తు పెట్టుకోవాలన్నారు. వచ్చే తెలంగాణ ఎన్నికల్లో 7 – 14 వరకు అసెంబ్లీ స్థానాల్లో, రెండుకు పైగా ఎంపీ సీట్లలో జనసేన పోటీ చేసే అంశాన్ని అక్కడి నేతలు చర్చించి చెబుతారన్నారు. అక్కడ కొండగట్టు నుంచి యాత్ర మొదలుపెట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో పవన్ ఒక విలన్

- చంద్రబాబుతో కలిసి కుట్రలు, కుతంత్రాలు
- విశాఖ గర్జన నుంచి డైవర్ట్ చేయడమే వారి లక్ష్యం
- ఇవాళ ఇద్దరూ ముసుగు తొలగించారు
- మూడో భార్య వదిలిపోయిందా? అందుకేనా ఈ ఫ్రస్ట్రేషన్?
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫైర్



సాక్షి, అమరావతి: జనసేన పార్టీ నేత పవన్ ఏపీ రాష్ట్ర రాజకీయాల్లో ఒక విలన్ అని, చంద్రబాబుతో కలిసి కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. విశాఖ గర్జన నుంచి ప్రజలను డైవర్ట్ చేయడమే వారి ఇరువురి ఏకైక లక్ష్యం అని ధ్వజమెత్తారు. అందుకే ఇద్దరూ కలసి ఈ రకమైన అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పవన్, బాబు కలిస్తే కలవొచ్చని, తమపై విమర్శలెందుకని సూటిగా ప్రశ్నించారు. మంత్రి అమర్‌నాథ్ ఇంకా ఏమన్నారంటే..

పీకే అంటే ప్యాకేజీల పవన్ కల్యాణ్

పీకే అంటే ప్యాకేజీల పవన్ కల్యాణ్.. పెళ్లిళ్ల పవన్ కల్యాణ్. నీవు ముమ్మాటికి ప్యాకేజీ నాయకుడివే. ఆ మాట అంటే చెప్పుతో కొడతావా? మరి నిన్ను ప్రజలంతా కలిసి అలాగే కొట్టాలా? రేపటి నుంచి రాష్ట్ర రాజకీయాల్లో కొత్తదనాన్ని చూస్తారని పవన్ అన్నారు. కానీ రేపటివరకు ఆగలేకపోయారు. పెళ్లి, శోభనం ఒకరోజే అన్నట్లుగా వ్యవహరించారు. ఇద్దరూ కలిసిపోవడం, వారి మాటలు చూస్తే.. రాజకీయ ప్రయోజనాల కోసం అన్నట్లుగా కాకుండా రాష్ట్రంలో అప్రజాస్వామిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నట్లు మాట్లాడుతున్నారు. అసలు విశాఖలో ఏం జరిగింది? మంత్రులను ఎవరు కొట్టారు? వారిపై ఎవరు దాడిచేశారు? జనసేన కార్యకర్తలు కదా? మా పార్టీ కార్యకర్తలు జనసేనపై దాడిచేయలేదు కదా? అంటే దెబ్బతిన్న వారిని పట్టించుకోకుండా, దాడిచేసిన వారిని చంద్రబాబు పరామర్శిస్తున్నారు. పవన్ ఏదో గ్యాంగ్‌రేప్‌కు గురయినట్టు పవన్‌ను పరామర్శించడం ఏమిటి? అసలు ఆయనకు బుద్ధి ఉందా? ఏమన్నా అంటే 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెబుతారు.

చెప్పుతో కొట్టడం అంటే ఏంటో తెలుసా?

ప్యాకేజీ నాయకుడివి అంటే చెప్పుతో కొడతావా పవన్? చెప్పులతో కొట్టడం అంటే ఏమిటో తెలుసా? నిన్ను గాజువాక, భీమవరంలో చిత్తుగా ఓడించారే.. అది చెప్పుతో కొట్టడం అంటే. నీ పార్టీ నుంచి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే అధికార పార్టీతో కలిసి వెళ్తున్నారు. అదీ చెప్పుతో కొట్టడం అంటే. జనసేన కార్యకర్తలు మంత్రులపై దాడి చేసిన రోజు మా వెంట దాదాపు రెండులక్షల మంది ఉన్నారు. మేము వారిని తీసుకురాలేమా? కానీ ఒకరిని ఒకరం గౌరవించుకోవాలి. అది మా పద్ధతి. మూడు పెళ్లిళ్లు చేసుకోమంటున్నావు. నీ భార్యలకు భరణం ఇచ్చానని చెబుతున్నావు. అంటే పెళ్లి చేసుకోవడం.. ఏడాది, రెండేళ్లు గడిపి ఆ తర్వాత పరిహారం ఇచ్చి వదిలేయడం.. అదేనా నీ పద్ధతి. నీ మూడో భార్య నిన్ను వదిలిపోయిందా? అందుకేనా ఈ ఫ్రస్ట్రేషన్. మాకు సందేహం కలుగుతుంది. ఇప్పటి వరకు నీ భాషలో చంద్రబాబు నీకు స్టెప్నీనో.. లేక నీవు ఆయనకు స్టెప్నీవో. నిన్నటివరకు వేరుగా ఉన్నట్లు వ్యవహారం. ముసుగు దొంగలైన మీరిద్దరూ ఈరోజు మధ్యాహ్నం ఒక్కటయ్యారు.

రాష్ట్ర రాజకీయాల్లో పవన్ జీరో..

సినిమాల్లో పవన్ హీరో.. రాజకీయాల్లో జీరో. చిరంజీవి అనే వ్యక్తి ఆయనకు జీవితం ఇవ్వకపోతే పవన్ ఎక్కడ ఉండేవారు. గతంలో నాగబాబు కూడా పవన్‌ను తప్పుబట్టారు. ఈవాళ చేతికి కట్టుకట్టుకుని నిలబడ్డారు. పెళ్లి అనేది ఒక సర్దుబాటు జీవితం. సొంత ఇంట్లో భార్యనే సక్రమంగా ఏలుకోని వ్యక్తి రాష్ట్రాన్ని ఏం ఏలతారు. ఆయన ఎప్పుడు, ఏ పార్టీతో కలిసి ఉంటాడనేది ఎవరికీ తెలియదు. ఈ ఎనిమిదేళ్లలో ఎనిమిది పార్టీలతో పొత్తుపెట్టుకున్నారు. బీజేపీ వాళ్లు రోడ్ మ్యాప్ ఇవ్వడం లేదని అంటున్నారు. ఆయనకు కావాల్సింది చంద్రబాబును కలిసే రోడ్ మ్యాప్.

ముసుగు తీసిన పార్టనర్స్

▶ మొదటి పేజీ తరువాయి

పవన్ కళ్యాణ్ పోటీ చేశారు. ఇక ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూడటం ద్వారా చంద్రబాబును అధికారంలోకి తేవడానికి అన్ని పార్టీలూ కలసి రావాలని పవన్ కళ్యాణ్ జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మార్చి 14న నిర్వహించిన సభలో పిలుపునిచ్చారు. ఎట్టకేలకు మంగళవారం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ముసుగులు తీసి ఒక్కటయ్యారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాసి.. పరిరక్షణ పేరుతో ఒక్కటై

ఇక ప్లాన్‌లో రెండో అంకానికి విజయవాడ వేదికగా భాగస్వాములిద్దరూ తెర తీశారు. విశాఖ నుంచి విజయవాడకు వచ్చీ రాగానే పవన్ కళ్యాణ్ సోమవారం రోజు మీడియాతో మాట్లాడుతూ తాను ఇక ఢిల్లీ వెళ్లనని, అక్కడికి వెళ్లి ఎవరినీ దేబిరించాల్సిన పని లేదని, స్థానిక పార్టీలతోనే కలసి పోరాడుతానని స్పష్టం చేసేశారు. పక్కా ప్లాన్ ప్రకారం 'విశాఖ గర్జన' నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు యత్నించారు. మంత్రులపై జనసేన కార్యకర్తలు దాడులు చేయడానికి, శాంతి భద్రతలకు విఘాతం కలగడానికి కారణమైన పవన్ కళ్యాణ్ ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టే దుస్సాహసానికి ఒడిగట్టారు. సంఘ విద్రోహక శక్తులు శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ప్రభుత్వం ఎదుర్కోవాలని.. అలాంటిది సర్కారే వాటికి విఘాతం కల్పిస్తోందంటూ నోరు పారేసుకున్నారు. తాజాగా జనసేన కేంద్ర కార్యాలయంలో కార్యకర్తలనుద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ అంటే తనకు వ్యతిరేకత లేదంటూనే.. అలాగని వారికి తాను ఊడిగం చేయలేనన్నారు. బీజేపీని రోడ్‌మ్యాప్ అడిగితే ఇప్పటికీ ఇవ్వలేదు కాబట్టి వ్యూహాలు మార్చుకుంటున్నానని స్పష్టం చేశారు. అలా బీజేపీతో తెగదెంపులు చేసుకుంటున్నానని పరోక్షంగా చెప్పారు. తాను వ్యూహం మారుస్తున్నానంటూ టీడీపీతో పొత్తుపై పరోక్ష సంకేతాలు ఇచ్చారు. పనిలో పనిగా వైఎస్సార్‌సీపీ నేతలకు చెప్పులు చూపిస్తూ... 'నా కొడకల్లారా..!' అంటూ సినిమా డైలాగులతో రెచ్చిపోయారు. ఆ తర్వాత నోవాటెల్ హోటల్‌కు చేరుకున్నారు. ముందస్తు వ్యూహంలో భాగంగా హైదరాబాద్ నుంచి విజయవాడ చేరుకున్న చంద్రబాబు నేరుగా



పవన్ బస చేసిన నోవాటెల్ హోటల్‌కు చేరుకొని పరామర్శించారు. పవన్‌పై దాడి జరిగిందన్నట్టుగా బాబు వక్రీకరించారు. దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌తో ఏకాంతంగా గంటన్నరపాటు చర్చించారు. ఆ తర్వాత ఇద్దరు ఉమ్మడిగా మీడియాతో మాట్లాడారు. విశాఖలో చోటుచేసుకున్న పరిణామాలపై పవన్ కళ్యాణ్‌కు సంఘీభావం తెలిపేందుకు వచ్చానని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని పార్టీలూ కలసి రావాలని ఇద్దరూ పిలుపునిచ్చి.. తాము ఒక్కటైపోయామని చెప్పకనే చెప్పారు. 'ప్రజాస్వామ్యం' కోసం ప్రస్తుతానికి కలిసి పని చేయాలనుకుంటున్నట్లు బిల్డప్ ఇవ్వడం గమనార్హం. కమ్యూనిస్టులు, బీజేపీ కూడా కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలోని సమస్త పార్టీలు కలిస్తే కానీ సీఎం జగన్ సర్కారును ఎదుర్కోలేమన్న పిరికితనానికి 'ప్రజాస్వామ్య' రక్షణ ముసుగు వేయడం గమనార్హం. తద్వారా అధికార పార్టీ చాలాకాలంగా ఆరోపిస్తున్నట్లుగానే దత్తపుత్రుడి బండారం బయటపడింది.

బీజేపీతో పొత్తుపై తీవ్ర వ్యాఖ్యలు..

అంతకు ముందు పార్టీ కార్యాలయంలో పవన్ మాట్లాడుతూ బీజేపీ, మోదీ అంటే తనకు గౌరవం అంటూనే.. అలాగని వారికి ఊడిగం చేయడానికి సిద్ధంగా లేనని బాబుతో భేటీకి ముందు వ్యాఖ్యానించారు. బీజేపీని రోడ్‌మ్యాప్ కోరటంపై ఉండవల్లి అరుణ్‌కుమార్ లాంటి నేతలు విస్మయం వ్యక్తం చేశారన్నారు. ఇంతమంది అభిమానులుండగా బీజేపీని రోడ్ మ్యాప్ అడగడం ఏమిటని పెద్దలు తిడితే ఆశీర్వచనంగా భావించానని చెప్పారు. 'బీజేపీ, మోదీ అంటే నాకు అపార గౌరవం ఉంది. నా స్థాయిని చంపుకోను. బీజేపీ సంబంధించిన వరకు పొత్తు కుదిరినా ఎక్కడో బలంగా పనిచేయలేకపోయాం. అది బీజేపీ రాష్ట్ర నాయకులకు కూడా తెలుసు. మీతో కలిసి వెళ్దామనుకున్నప్పుడు రోడ్ మ్యాప్ ఇవ్వకపోతే నాకు కాలం గడిచిపోతుంది. రౌడీలు రాజ్యాలు ఏలుతుంటే నా ప్రజలను రక్షించుకోవడానికి వ్యూహాలు కూడా మార్చుకోవాల్సి వస్తుంది. తప్పడం లేదు. అంతమాత్రాన ప్రధానికి, బీజేపీకి వ్యతిరేకం కాదు' అంటూ చెప్పుకొచ్చారు. చంద్రబాబుతో సమావేశానికి కొద్దిసేపటి ముందు పవన్ కార్యకర్తల సమావేశంలో ఈ వాఖ్యలు చేయడం ద్వారా అవసరమైతే చంద్రబాబు కోసం పొత్తు విచ్ఛిన్నానికి సైతం సిద్ధమేనన్న సంకేతాలనిచ్చారు. మరోవైపు రాష్ట్రంలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తూ తెలంగాణలోనూ తాము వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని పవన్ తొలిసారిగా వెల్లడించడం గమనార్హం.

పక్కా స్కెచ్‌తో విశాఖకు...

వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖలో ఈ నెల 15న 'విశాఖ గర్జన' బహిరంగ సభను నిర్వహించనున్నట్లు స్థానిక జేఏసీ ప్రకటించాక పక్కా స్కెచ్ ప్రకారం అదే రోజు అక్కడకు వెళ్లి 16న పోర్టు స్టేడియంలో జనవాణి కార్యక్రమం, 17న తిరుగు ప్రయాణమయ్యేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేసుకున్నారు. 16న జరిగే జనవాణి కోసం ఆయన ఈ నెల 13న పోర్టు స్టేడియానికి దరఖాస్తు చేసుకోవటాన్ని బట్టి చూస్తే ఇదంతా పక్కా ప్లాన్ అని తేలిగ్గానే అర్థమవుతుంది.

'గర్జన' నుంచి దృష్టి మరల్చడానికే..

'విశాఖ గర్జన' కార్యక్రమం కుండపోత వర్షంలోనూ కదలని జనంతో గ్రాండ్ సక్సెస్ కావటంతో చంద్రబాబు ఆదేశాల మేరకు దాన్నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పవన్ కళ్యాణ్ సిద్ధమయ్యారు. అందులో భాగంగానే సభ ముగించుకుని తిరిగి వస్తున్న పలువురు మంత్రుల వాహనాలపై మద్దతుదారులెవరూ లేని సమయంలో అక్కడే ఉన్న జనసేన మూకలు ఎయిర్‌పోర్టు రోడ్‌లో దాడులకు దిగాయి. దీనిపై అన్ని వర్గాల్లోనూ నిరసన వ్యక్తం కావటంతోపాటు పోలీసులు ఈ దాడులకు కారకులైన కొందరిపై కేసులు పెట్టడంతో ఘటనతో తనకెలాంటి సంబంధమూ లేదని పవన్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. బయటకు మాత్రం.. ఆ కార్యకర్తలను విడిచిపెట్టనిదే విశాఖ వదిలి వెళ్లనంటూ ప్రకటనలు చేశారు. అంతలోనే చంద్రబాబు ఆయనకు రెండు సార్లు ఫోన్లు చేశారు. దాడులకు పాల్పడ్డ రౌడీ మూకలకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించగా పవన్ మాత్రం విశాఖలో జనవాణి నిర్వహించకుండా మర్నాడే విజయవాడకు వచ్చేశారు. అక్కడితో ఆయన పథకంలో ఒక అంకం దిగ్విజయంగా ముగిసింది.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీలన్నీ కలిసి రావాలి: చంద్రబాబు, పవన్

విశాఖలో చోటు చేసుకున్న పరిణామాలపై పవన్‌కళ్యాణ్‌కు సంఘీభావం తెలిపేందుకే తాను వచ్చానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు. మంగళవారం విజయవాడ హోటల్‌లో గంటకుపైగా భేటీ అనంతరం వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. మూడున్నర ఏళ్లుగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యమన్నదే లేదని, రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలకు స్వేచ్ఛే లేదని విమర్శించారు. రాజకీయ పార్టీలకే స్వేచ్ఛ లేకపోతే ఇక ప్రజా సమస్యలపై ఎవరు పోరాడతారని చంద్రబాబు ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు కలిసి ఒక్కటవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు ముందుగా రాష్ట్రంలో ప్రజాస్వామ పరిరక్షణ ముఖ్యమని, ఆ తర్వాత ఎవరెలా పోటీ చేస్తారో అప్పటి పరిస్థితిని బట్టి ఉంటుందని చంద్రబాబు చెప్పారు. విశాఖ ఘటనపై అన్ని పార్టీలు తనకు సంఘీభావం తెలిపాయని, జగ్గారెడ్డి, మల్లన్న లాంటి తెలంగాణ నేతలూ ఫోన్ చేసి మద్దతు తెలిపారని పవన్ పేర్కొన్నారు. తనకు మద్దతు పలికేందుకు వచ్చిన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు. జనసేన-టీడీపీనే కాకుండా మిత్రపక్షమైన బీజేపీని కూడా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం లెఫ్ట్‌తో సహా అన్ని పార్టీలనూ కలుపుకెళ్తామని చెప్పారు. రెండు పార్టీలు కలిసి ఎలా పనిచేయబోతున్నాయంటూ విలేకరులు పదే పదే ప్రశ్నించడంతో.. ఇప్పుడు ఎన్నికలు, పొత్తుల అంశం ప్రధానం కాదని, ప్రజాస్వామ్య పరిరక్షణ ముందు జరగాలన్నారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన యువ ఐపీఎస్‌లు

వారికి అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి



సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన యువ ఐపీఎస్ అధికారులు

సాక్షి, అమరావతి: శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ అధికారులు ధీరజ్ కునుబిల్లి, జగదీశ్ అడహళ్లి, సునీల్ షెరాన్, రాహుల్ మీనా మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేస్తూ ఆధునికమైన, ప్రభావవంతమైన పోలీస్ వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత మీపై ఉందంటూ సీఎం జగన్ వారికి మార్గనిర్దేశం చేశారు. అందరికీ అభినందనలు తెలిపారు.

ఇద్దరు ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రను రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. మహిళా, శిశు సంక్షేమ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఏఆర్ అనూరాధను ప్రింటింగ్, స్టేషనరీ అండ్ స్టోర్స్ పర్చేజ్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సంపూర్ణంగా సర్వే యజ్ఞం

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్షపై సీఎం సమీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూముల రీ సర్వే మహాయజ్ఞం ఫలాలు ప్రజలకు పూర్తి స్థాయిలో సంతృప్తికరంగా అందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగానికి నిర్దేశించారు. సర్వేలో నాణ్యత చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. ఒక గ్రామంలో రీ సర్వే చేసిన తర్వాత తమదైన ముద్రతో అన్ని రకాలుగా ఈ ప్రక్రియను ముగించాలన్నారు. భూ వివాదాలు, తగాదాలు లేని గ్రామాలు సాక్షాత్కారం కావడమే రీసర్వే లక్ష్యమన్నారు. సర్వే ఎక్కడా అసంపూర్తిగా మిగిలిపోయిందన్న మాటే రాకూడదన్నారు. ప్రజలను పూర్తి స్థాయిలో సంతృప్తి పరిచేలా, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపేలా రీసర్వే ఉండాలని స్పష్టం చేశారు. అప్పుడే ఈ బృహత్తర కార్యక్రమానికి సార్థకత లభిస్తుందన్నారు. సర్వేతో రెవెన్యూ వ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రక్షాళన కావడంతోపాటు రికార్డులు, డేటా స్వచ్ఛీకరణ జరుగుతుందని తెలిపారు. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకంపై మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షించిన సీఎం జగన్ సర్వే ప్రక్రియకు సంబంధించి కీలక సూచనలు చేశారు. ఆ వివరాలివీ..



వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

ప్రణాళికాబద్ధంగా..

రీసర్వేలో నాణ్యత చాలా ముఖ్యం. ఈ మహాయజ్ఞం ఫలాలు ప్రజలకు సంపూర్ణంగా అందాలి. ఎక్కడా కూడా సర్వే అసంపూర్తిగా మిగిలిపోయిందన్న మాట రాకూడదు. మొబైల్ ట్రిబ్యునళ్లు, సరిహద్దులు, సబ్‌డివిజన్లు.. ఇవన్నీ చాలా క్రమ పద్ధతిలో ముందుకు సాగాలి. సర్వే చేస్తున్నప్పుడు ఉత్పన్నమైన సమస్యలను అత్యంత ప్రణాళికాబద్ధంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలి. ఈ సర్వే ద్వారా రెవెన్యూ వ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రక్షాళన అవుతుంది. రికార్డులు, డేటా స్వచ్ఛీకరణ జరుగుతుంది. ఈ అంశాలను అధికారులు దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలి.

వేలెత్తి చూపలేని విధంగా..

రీ సర్వే ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని కొంతమంది పనిగట్టుకుని ఈ కార్యక్రమంపై దుష్ప్రచారం చేస్తున్నారు. అపోహలు సృష్టించేలా వ్యవరిస్తున్నారు. తద్వారా ఈ గొప్ప ప్రయత్నాన్ని నీరుగార్చి విశ్వసనీయతను దెబ్బతీసే యత్నాలు చేస్తున్నారు. 100 ఏళ్ల తర్వాత భూముల రీ సర్వే చేస్తున్నాం. దీనికోసం కొన్ని వేల మందిని నియమించి రూ.కోట్లు వెచ్చించి అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేశాం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎవరూ వేలెత్తి చూపలేని విధంగా సర్వే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలి. దోషాలు, తప్పులతో ఒక్క హక్కు పత్రం కూడా రైతులకు వెళ్లకూడదు. సర్వే పూర్తైన ప్రతి గ్రామంలో 5 శాతం రికార్డులను ఆర్డీవోలు, ఒక శాతాన్ని జేసీలు వెరిఫికేషన్ చేయాలి. అది పూర్తైన తరువాతే హక్కు పత్రాలను జారీ చేయాలి. గ్రామ సచివాలయంలో సర్వే పూర్తి కాగానే అక్కడ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు కావాలి. పై అధికారులు గ్రామాలను సందర్శించడం వల్ల అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తారు. సిబ్బందిలో జవాబుదారీతనం పెరుగుతుంది.

అర్బన్‌లో జనవరి నుంచి..

పట్టణ ప్రాంతాల్లో సర్వే ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి జగన్ సూచించారు. 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 15,02,392 ఎకరాల్లో చేపట్టే సర్వేలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సర్వే పూర్తైన తర్వాత ఇక్కడ కూడా పత్రాల వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. వచ్చే జనవరిలో సర్వే ప్రక్రియ ప్రారంభించి మే నెల నుంచి హక్కు పత్రాల పంపిణీ ప్రారంభమయ్యేలా ముందుకు సాగుతామని అధికారులు తెలిపారు. 2023 ఆగస్టు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.

కచ్చితమైన విధానాలతో..

భూ యజమానులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సర్వే జరుగుతోందని సమీక్షలో ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. పక్కా మార్గదర్శకాలతో తప్పులు, పొరపాట్లు లేని విధంగా హక్కు పత్రాలు జారీ చేస్తామన్నారు. సర్వే ప్రక్రియలో ఏ దశలో అభ్యంతరాలు వ్యక్తమైనా పరిష్కరించే వ్యవస్థలను బలోపేతం చేస్తామని చెప్పారు. సమగ్ర సర్వే ద్వారా భూ యజమానుల హక్కులను తరతరాలు కాపాడటంతోపాటు ఆక్రమణలు, కబ్జాలు, రికార్డుల్లో అవకతవకలు లాంటి వాటికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందన్నారు. కేవలం 5 సెంటీమీటర్ల వ్యత్యాసంతో కచ్చితమైన పద్ధతుల్లో సర్వే జరుగుతుందన్నారు. ఇప్పటివరకూ 6,037 గ్రామాల్లో డ్రోన్లు ఎగరవేశామని, ఇందులో 1,545 గ్రామాల్లో రెవిన్యూ రికార్డులు కూడా ఖరారయ్యాయని తెలిపారు. ప్రతి నెలా 13,335 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని లక్ష్యంగా చేసుకుని సర్వే చేస్తున్నామని వివరించారు. డ్రోన్లు ఎగరవేయడానికి అనువుగాలేని ప్రాంతాల్లో విమానాలు, హెలికాప్టర్ల ద్వారా సర్వే చేయడానికి అన్ని రకాలుగా సిద్ధమయ్యామన్నారు. నవంబర్ మొదటి వారంలో తొలివిడత గ్రామాల్లో హక్కు పత్రాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. సమీక్షలో విద్యుత్, అటవీ, పర్యావరణ, భూగర్భ గనుల శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లాం, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, రెవెన్యూ శాఖ (సర్వే సెటిల్మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్) కమిషనర్ సిద్దార్థ జైన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సీసీఎల్ఏ కార్యదర్శి ఇంతియాజ్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22 తర్వాత తుపాను!

- నిర్ధారించిన భారత వాతావరణ విభాగం
- రాష్ట్రంపై అధిక ప్రభావం
- భారీ నుంచి అతి భారీ వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: ఈ నెల 22వ తేదీ తర్వాత పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం స్పష్టతనిచ్చింది. ఐఎండీ తాజా నివేదిక ప్రకారం ఉత్తర అండమాన్ సముద్రంలో మంగళవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో గురువారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో తూర్పు మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ, వాయువ్య దిశగా పయనిస్తూ ఈనెల 22 వ తేదీ ఉదయానికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. అనంతరం ఈ వాయుగుండం మరింత బలపడుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనుందని ఐఎండీ తెలిపింది. అయితే ఇది మరింతగా బలపడి అతి తీవ్ర/సూపర్ సైక్లోన్‌గా మారే అవకాశాలపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి ఈ తుపాను ఉత్తర కోస్తాంధ్ర-దక్షిణ ఒడిశాల మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

రాష్ట్రంపై అధిక ప్రభావం

తుపాను ప్రభావం మన రాష్ట్రంపై అధికంగా ఉండనుంది.ఫలితంగా ఈనెల 22వ తేదీ నుంచి రాష్ట్రంలో భారీనుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. అదే సమయంలో తీరం వెంబడి గంటకు 100 కిలోమీటర్లకు పైగా వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయి. మరోవైపు రానున్న రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ మంగళవారం రాత్రి నివేదికలో తెలిపింది.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- ఇన్‌ఫ్లో 2.60 లక్షల క్యూసెక్కులు
- 10 గేట్ల ద్వారా 2.79 లక్షల క్యూసెక్కులు విడుదల
- సాగర్‌కు 3.12 లక్షల క్యూసెక్కులు



క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్/సత్రశాల (రెంటచింతల): శ్రీశైలం డ్యాంకు కృష్ణమ్మ వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 2,60,129 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర తెరిచి 2,79,370 క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 4 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 884.70 అడుగుల్లో 213.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం నుంచి వస్తున్న నీటితో కలిపి నాగార్జున సాగర్‌కు 3,12,409 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఇక్కడ 18 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి 2,66,310 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాలువ, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, ఎస్ఎల్‌బీసీ, వరద కాలువలు కలిపి 46,099 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయంలో 588.90 అడుగుల్లో 308.76 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టుకు 3,17,844 క్యూసెక్కులు వస్తోంది. ఇక్కడి నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు.

నర్సింగ్ విద్యార్థులకు.. జర్మనీలో అవకాశాలు కల్పించండి

- అక్కడికి తగ్గట్లుగా భాషా శిక్షణ, కరిక్యులమ్ అందుబాటులోకి తీసుకురావాలి
- జర్మనీలో భారత రాయబారిని కోరిన సీఎం జగన్
- క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసిన నార్వే, జర్మనీ దేశాల్లోని భారత రాయబారులు
- ఏపీలో పెట్టుబడులు, అవకాశాలపైనా చర్చ

సాక్షి, అమరావతి: ఇక్కడి నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో విస్తృతంగా అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జర్మనీలోని భారత రాయబారి పర్వతనేని హరీష్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. వారు కోర్సు చదివే సమయంలో అక్కడికి తగ్గట్లుగా భాషా శిక్షణ, కరిక్యులమ్ అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. దీనిపై హరీష్ సానుకూలంగా స్పందించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని మంగళవారం నార్వే, జర్మనీ దేశాల్లోని భారత రాయబారులు డాక్టర్ బి. బాలభాస్కర్, పర్వతనేని హరీష్ కలిశారు. ఎగుమతులను ప్రోత్సహించడంలో భాగంగా జర్మనీ, నార్వే దేశాల్లో అవకాశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించిన ఏపీ ప్రభుత్వం.. ఇదే అంశంపై ఏపీఐఐసీ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆ వివరాలను వారిరువురూ ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే..

- రాష్ట్రం నుంచి ఎగుమతికి అవకాశమున్న ఉత్పత్తులు, సులభతర వాణిజ్యం కోసం అమలు చేస్తున్న ప్రణాళికలను రాయబారులకు సీఎం జగన్ వివరించారు.
- వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉద్యాన ఉత్పత్తులు, మత్స్య సంపద, చేనేత, టెక్స్‌టైల్, టూరిజం రంగాలలో అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు.
- దేశంలోనే ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో నిర్మిస్తున్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, ఎంఎస్ఎంఈలతో ఒప్పందాలు, పాలసీలు, టెక్నాలజీ అప్‌గ్రెడేషన్, డీకార్బనైజేషన్ వంటి కీలక అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది.
- నాణ్యతతో కూడిన ఉత్పత్తులకు ప్రాధాన్యత నిస్తూ అధిక మొత్తంలో ఆయా దేశాలకు ఎగుమతులను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జగన్ వారికి వివరించారు.
- నాణ్యమైన, రుచికరమైన కాఫీ ఉత్పత్తులకు అంతర్జాతీయ బ్రాండింగ్, ప్రొడక్టివిటీ పెంచేలా తగిన సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరగా.. తప్పనిసరిగా తమ సహకారం ఉంటుందని ఇరుదేశాల రాయబారులు హామీఇచ్చారు.
- ఇక ఏపీలో పెట్టుబడులు, అవకాశాలపై ముఖ్యమంత్రి వారికి వివరించారు.

ఈ సమావేశంలో సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రణాళికా శాఖ కార్యదర్శి జి. విజయ్‌కుమార్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి. సృజన పాల్గొన్నారు.

వైద్యశాఖలో పోస్టుల భర్తీకి నేటి నుంచి ఇంటర్వ్యూలు

నియామకం కానున్న అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు



సాక్షి, అమరావతి: వైద్యశాఖలోని డీఎంఈ, ఏపీ వైద్య విధాన పరిషత్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్(సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి బుధవారం నుంచి వాక్-ఇన్ ఇంటర్వ్యూ ప్రారంభం కానుంది. శాశ్వత, కాంట్రాక్టు ప్రాతిపదికన 400కు పైగా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల పోస్టుల భర్తీకి మూడు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహించాలని వైద్య శాఖ నిర్ణయించింది. తొలి రోజు డీఎంఈలో కార్డియాలజీ, కార్డియోథొరాసిక్, వాస్కులర్ సర్జన్, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఎండోక్రినాలజీ, మెడికల్ గ్యాస్ట్రో-ఎంటరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో-ఎంటరాలజీ, మెడికల్ అంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, నియోనాటాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీకి సంబంధించిన పోస్టులకు ఇంటర్వ్యూ చేస్తారు. అదే విధంగా ఏపీవీవీపీలో అనస్తీషియా, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్, రేడియాలజీ పోస్టులకు ఇంటర్వ్యూ ఉంటుంది. కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించే పోస్టుల్లో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే స్పెషలిస్ట్ డాక్టర్‌కు నెలకు రూ.1.30 లక్షలు, గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో పనిచేసే స్పెషలిస్ట్ డాక్టర్ కు రూ.1.60 లక్షలు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్‌కు రూ.1.60 లక్షల చొప్పున వేతనాలు నిర్ణయించారు. ఇంటర్వ్యూల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఏపీవీవీపీ కమిషనర్, ఇన్‌చార్జి డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, ఇతర ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న అభ్యర్థులు వారి తరఫున కుటుంబ సభ్యులు ఇంటర్వ్యూకు హాజరైనా అనుమతిస్తామన్నారు.

పలు స్పెషాలిటీల్లో ఖాళీలు ఇలా

(డీఎంఈలో)	
రేడియాలజీ- 17	ఎమర్జెన్సీ మెడిసిన్- 16
ఫోరెన్సిక్ మెడిసిన్ 13	పాథాలజీ- 13
కార్డియాలజీ 12	యూరాలజీ 09
న్యూరో సర్జరీ 08	పీడియాట్రిక్ సర్జరీ 04
(ఏపీవీవీపీలో)	
జనరల్ మెడిసిన్ 34	రేడియాలజీ 24
జనరల్ సర్జరీ 13	పీడియాట్రిక్స్ 09

కేసుతో సంబంధం లేని వ్యక్తి పిటిషన్ ఎలా వేస్తారు?

జనసేన వ్యాజ్యాలపై హైకోర్టు



సాక్షి, అమరావతి: విశాఖపట్నం విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులపై దాడి చేసినందుకు విమానాశ్రయ పోలీసులు నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని కోరుతూ కేసుతో సంబంధం లేని మూడో వ్యక్తి ఎలా పిటిషన్ వేస్తారని హైకోర్టు సందేహం వ్యక్తంచేసింది. ఈ వ్యాజ్యాలను అనుమతిస్తే ఇటువంటివి పెద్ద సంఖ్యలో దాఖలయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. కేసులు ఎదుర్కొంటున్న వారు మాత్రమే ఇలాంటి పిటిషన్ దాఖలుకు ఆస్కారం ఉంటుందని తెలిపింది. విచారణార్హతపై స్పష్టత వచ్చిన తరువాతే మధ్యంతర ఉత్తర్వుల జారీని పరిశీలిస్తామంది. అప్పటివరకు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదంది. ఈ మొత్తం వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విశాఖపట్నంలో జనవాణి నిర్వహణకు పోలీసులకు దరఖాస్తు చేసుకోవచ్చని, అనుమతిని నిరాకరిస్తే హైకోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టంచేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనసేన కార్యకర్తల అరెస్టు, విశాఖ నగరం, ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పార్టీ ర్యాలీలు, ఆందోళనలు చేపట్టకుండా విశాఖ ఏసీపీ జారీ చేసిన నోటీసును రద్దు చేయాలని కోరుతూ ఆ పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంత్రులపై దాడి జరిగిన సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు తన విధులకు ఆటంకం కలిగించారంటూ పెందుర్తి సీఐ నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసును కూడా కొట్టేయాలని ఆయన మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై జస్టిస్ రాయ్ మంగళవారం విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ, జనవాణిని అడ్డుకునేందుకే పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. అధికార పార్టీ మంత్రులు, నేతలే జనసేన కార్యకర్తలను రెచ్చగొట్టారని, వారిపై పోలీసులు కేసులు నమోదు చేయలేదన్నారు. థర్డ్ పార్టీ సైతం ఎఫ్ఐఆర్‌ల రద్దు కోరవచ్చునని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది (హోం) వేలూరు మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేసుతో సంబంధం లేని వ్యక్తులు ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. అందువల్ల ఈ వ్యాజ్యాలకు విచారణార్హతే లేదన్నారు. ఇందుకు సంబంధించి తీర్పులను ఆయన కోర్టు ముందుంచారు. విమానాశ్రయం లోపల జరిగే ఘటనలపై సాధారణ పోలీసులు కూడా కేసు నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

ప్యాకేజీ స్టార్ అని వంద సార్లు అంటా

మంత్రి అంబటి రాంబాబు ధ్వజం



సాక్షి, నరసరావుపేట: పవన్ కల్యాణ్ ఒక సైకో.. ఆయన అసలు రూపం నేడు బయటపడిందని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. పవన్‌ని ప్యాకేజీ స్టార్ అని ఒకసారి కాదు వందసార్లు అంటానని చెప్పారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన మాటలతో ఆయన అసలు సిసలైన రూపం బయటపడిందన్నారు. ప్యాకేజీ అంటే చెప్పుతో కొడతానంటున్న పవన్ కల్యాణ్.. చంద్రబాబు వద్ద ప్యాకేజీ తీసుకుని రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓ పార్టీ నడిపే వ్యక్తి ఇలా మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. కాపు ఎమ్మెల్యేలను హెచ్చరిస్తున్న పవన్‌కు కాపుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. 'టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కాపులపై దాడులు జరిగితే ఎక్కడ ఉన్నావు? అని ప్రశ్నించారు. కుక్కతోక పట్టుకొని గోదారి ఈదకండి అని జనసైనికులకు విజ్ఞప్తి చేశారు. ఆయన చూపిస్తున్న చెప్పే ఆయన పార్టీ సింబల్ అయ్యే అవకాశం ఉందన్నారు.



సత్యం అనే దారికి సంబంధించి మనుషులు కేవలం రెండే తప్పులు చేయగలరు. ఒకటి – పూర్తిగా ప్రయాణించకపోవడం; రెండు – ప్రయాణం మొదలు పెట్టకపోవడం.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, అక్టోబర్, 19

ఆధిపత్యమే పరమార్థమా?!

ఎప్పుడూ వార్తల్లో ఉండే పశ్చిమ బెంగాల్ ప్రశాంతంగా ఉంది. ఢిల్లీలో కూడా మొన్న గాంధీ జయంతి రోజున తలెత్తిన సమస్య మినహా పెద్దగా వివాదం ఛాయలు లేవు. తెలంగాణ సరేసరి. ఇంతలోనే కేరళలో రాజుకుంది. అక్కడ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కూ, రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య ఘర్షణ బయల్దేరింది. గత నెలలో కన్నూరు యూనివర్సిటీలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకంపైనా, అంతక్రితం అవినీతిని అరికట్టడానికి ఉద్దేశించిన లోకాయుక్త అధికారాల కుదింపు వ్యవహారంపైనా ఆరిఫ్ కన్నెర్రజేశారు. తాజాగా కేరళ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎంపిక అంశంలో గొడవ మొదలైంది. ఈ వ్యవహారంలో తమ బాధ్యతను మరిచారంటూ 15 మంది సెనేట్ సభ్యుల్ని గవర్నర్‌గా తనకున్న అధికారాలనుపయోగించి తొలగించారు. అంతేకాదు... మంత్రుల్ని పదవీచ్యుతుల్ని చేసే అధికారం కూడా తనకున్నదంటూ హెచ్చరించారు. వైస్ చాన్సలర్ల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వానిదే పైచేయిగా ఉండేలా ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ బిల్లు గత నెల అసెంబ్లీలో ఆమోదం పొందింది. దానిపై ఇంతవరకూ గవర్నర్ సంతకం చేయలేదు.

నిర్ణయాలు తీసుకోవటంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాల మాట నెగ్గాలా, నియామకం ద్వారా పదవిలోకొచ్చిన గవర్నర్‌ది ఆఖరిమాట కావాలా అన్నదే ఈ వివాదాలన్నిటి సారాంశం. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పాలకపక్షం ఉన్నప్పుడు పెద్దగా గొడవులుండవు. అలాగని విపక్ష ఏలుబడి ఉన్నచోట్ల నిత్యం సమస్యలుంటాయన్నది కూడా నిజం కాదు. రాష్ట్రపతిగా ఇటీవల పదవీ విరమణ చేసిన రాంనాథ్ కోవింద్ బిహార్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అప్పటికి బీజేపీ వ్యతిరేక కూటమిలో ఉన్న నితీష్ కుమార్‌తో ఆయనకెన్నడూ తగవు రాలేదు. రాజకీయపరంగా చూస్తే అంతవరకూ కోవింద్ బీజేపీలో చురుకైన నాయకుడు. రెండుసార్లు ఎంపీగా పనిచేశారు. బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆరిఫ్ కూడా సీనియర్ నేత. చిరకాలం కాంగ్రెస్‌లో ఉన్నారు. షాబానో కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును వమ్ము చేస్తూ రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన బిల్లు ముస్లిం మహిళల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని ఆరోపిస్తూ ఆయన 1986లో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. బోఫోర్స్ శతఘ్నుల కొనుగోళ్లలో కుంభకోణం చోటుచేసుకున్నదంటూ వీపీ సింగ్‌తో కలిసి రాజీవ్ సర్కారుపై పోరాడారు. అనంతరకాలంలో వీపీ సింగ్ నేతృత్వంలోని జనతాదళ్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ఉన్నారు. ఈ నేపథ్యం చూస్తే ఆరిఫ్ వివాదాల్లో చిక్కుకోవటం కొంత వింతగానే ఉంటుంది. గవర్నర్‌గా ఉన్నవారూ, రాష్ట్రాన్ని పాలించేవారూ అరమరికల్లేకుండా చర్చించుకుంటే సమస్యలు ఉత్పన్నం కావు. కానీ సమస్యలపై రచ్చకెక్కడం, మీడియా సమావేశాల్లో విమర్శించుకోవటం అలవాటైంది. ట్విటర్ వేదికగా పరస్పరం ఆరోపణలు చేసుకునే ధోరణి కూడా బయల్దేరింది. మంత్రుల్ని తొలగించే అధికారం కూడా తనకున్నదంటూ ట్విటర్ ద్వారానే ఆరిఫ్ హెచ్చరించారు. 'సీఎంకూ, ఆయన మంత్రులకూ గవర్నర్‌కు సలహాలిచ్చే అధికారం ఉంది. కానీ అందుకు భిన్నంగా గవర్నర్‌ను కించపరుస్తూ కొందరు మంత్రులు మాట్లాడుతున్నారు. అలాంటి వారిని తొలగించటంతో సహా చర్యలు తీసుకునే అధికారం నాకుంది' అన్నది ఆ ట్వీట్ సారాంశం. కేరళ వర్సిటీ వైస్ చాన్సలర్ ఎంపిక ప్రక్రియలో వివాదం రాజేయటం ఆరెస్సెస్ ఎజెండా అమలు కోసమేనని కేరళ విద్యామంత్రి ఆర్.బిందు అనడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు.

మన విశ్వవిద్యాలయాల ప్రమాణాలు నానాటికీ దిగజారుతున్నాయనీ, వాటి ర్యాంకులు జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా అడుగంటుతున్నాయనీ ఏటా తెలుస్తూనే ఉంది. వాటిని మళ్లీ చక్కదిద్దటానికి పాలనాపరంగా ఏం చేయాలన్న విషయంలో ఎవరూ పెద్దగా ఆలోచిస్తున్న దాఖలా లేదు. తగినంతమంది అధ్యాపకులు లేకపోవటం, వారిలో చాలామంది కాంట్రాక్టు ప్రాతిపదికనే వచ్చినవారు కావటం, ప్రభుత్వాలు సకాలంలో నిధులు అందించకపోవటం ప్రమాణాలు పడిపోవటానికి ప్రధాన కారణాలని విద్యార్థి సంఘాల నాయకులూ, అధ్యాపకులూ ఆరోపిస్తున్నారు. ఇలాంటి అంశాల్లో గవర్నర్ అభ్యంతరం లేవనెత్తితే అర్థం చేసుకోవచ్చు. ఉన్నత విద్య ప్రమాణాలను కాపాడటానికి ఆయన ప్రయత్నిస్తున్నారని అందరూ జేజేలు పలుకుతారు. కానీ వైస్ చాన్సలర్ నియామకం, సెనేట్ సభ్యుల ఎంపిక, తొలగింపు తదితర అంశాల్లో పట్టుదలకు పోవటం వల్ల ప్రయోజనమేమిటో అర్థం కాదు. ఈ విషయంలో తనకున్న అభిప్రాయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లటం, ఫలానావిధంగా చేయటమే ఉత్తమమని సలహా ఇవ్వటం మంచిదే. కానీ అందు కోసం రచ్చకెక్కటం వల్ల ఉన్నత విద్యకు ఒరిగేదేమిటి? గవర్నర్ల వ్యవస్థ విషయంలో సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో కీలక సూచనలు చేసింది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలు చేసే నిర్ణయాలకు ఉన్నంతలో విలువనీయటం సరైందని అభిప్రాయపడింది. సర్కారియా కమిషన్ నివేదిక కూడా విస్తృతమైన సిఫార్సులు చేసింది. రాజకీయాలకు సంబంధంలేనివారు, తటస్థులుగా ముద్రపడిన వారు గవర్నర్లయితే మంచిదని తెలిపింది. కానీ ఆ కోవలోకొస్తారని భావించినవారు సైతం వివాదాల్లో ఇరుక్కున్న ఉదంతాలు లేకపోలేదు. నిర్ణయ ప్రక్రియలో పరిధులు అతిక్రమించి విపరీత పోకడలకు పోవటం, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయటం వంటివి చోటుచేసుకుంటే గవర్నర్లు ప్రశ్నించటంలో తప్పులేదు. కానీ ఎంతసేపూ ఆధిపత్యం కోరుకోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. కేరళ గవర్నరైనా, మరొకరైనా దీన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం
శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: బ.నవమి ఉ.11.47 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: పుష్యమి ఉ.6.58 వరకు తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.9.03 నుండి 10.46 వరకు
దుర్ముహూర్తం: ప.11.20 నుండి 12.09 వరకు
అమృతఘడియలు: లేవు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

ఏనాడైనా మంచిని చూస్తున్నారా?

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద నగరమైన విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధాని కాకుండా ఎన్ని కుట్రలు జరుగుతున్నాయి! విశాఖలో కబ్జాలు పెరుగుతున్నాయి; విలువైన భూములను బెదిరించి లాక్కుంటున్నారు... నిత్యం ఇలాంటి కథనాలను 'ఈనాడు' తదితర టీడీపీ మీడియా సంస్థలు వండి వారుస్తున్నాయి. మరి అమరావతిలోని గ్రామాలలో జరిగిన భాగోతాల మాటేమిటి? కబ్జాలు జరుగుతున్నాయి కాబట్టి అమరావతి రాజధానిగా పనికి రాదని అప్పట్లో 'ఈనాడు' ఎందుకు రాయలేదు? విశాఖలో ఎవరైనా తమకు గిట్టనివారు భూములు కొంటే అదంతా దోపిడీ అని రాస్తారా? ఒకవేళ నేరాలు జరిగితే, మొత్తం ప్రజలంతా నేరపూరితం అవుతారా? ఉత్తరాంధ్ర, విశాఖపట్నం ప్రజలు అంత అమాయకులా?

అమరావతి రాజధాని ప్రకటన తర్వాత సుమారు 1,100 ఎకరాల అసైన్డ్ భూమిని బడా కామందులు, రాజకీయనేతలు కొట్టేశారు కదా? ప్రభుత్వం కూడా వీరికి సహకరించి, ప్యాకేజీ రూల్స్‌ను అసైన్డ్ భూములు కొన్న వారికి కూడా వర్తింపజేసింది కదా! అవన్నీ పేదలకు మేలు చేసే విషయాలని 'ఈనాడు' పత్రిక భావించిందా? పేదలంతా తమకు భూములు అక్కర్లేదు.. రాజధాని వస్తే చాలని పెద్దవాళ్లకు రాసిచ్చేశారా? ఇన్‌సైడ్ ట్రేడింగ్ పేరిట సుమారు 4,500 ఎకరాల భూములను టీడీపీ పెద్దలు, వారి సంబంధీకులు చౌకగా ఎలా కొనగలిగారు? అమరావతి భూముల ద్వారా కోట్లు సంపాదించారని స్వయంగా ఆనాటి సీఎం చంద్రబాబునాయుడే చెప్పేవారు కదా? అదంతా వైట్ మనీనా, బ్లాక్ మనీనా? ఆ విషయాలను 'ఈనాడు' ఎందుకు దాచి పెట్టింది?

హైదరాబాద్ నగరంలో వేల ఎకరాల భూదందా జరిగింది. ఇప్పటికీ పలు ఆరోపణలు వస్తుంటాయి. ఎన్నడైనా హైదరాబాద్ రాజధానిగా వద్దు అని 'ఈనాడు' రాసిందా? జగన్నాటకం పేరుతో 'ఈనాడు' రాసిన కథనం విషపూరిత వార్తలకు పరాకాష్ఠ అని చెప్పాలి. విశాఖలో గర్జన సభను చెడగొట్టాలన్న లక్ష్యంతో టీడీపీ మీడియా సంస్థలు పలు కథనాలు ప్రచారం చేశాయి, చేస్తున్నాయి. రాజధాని అయితే విశాఖకు ఏదో ప్రమాదం వస్తుందన్న భావన కల్పించడమే వీరి లక్ష్యం. అమరావతి రాజధాని అన్నప్పుడు ఏపీ సీఎం జగన్ చేసిన కొన్ని వ్యాఖ్యలలో తమకు కావల్సినమేరకు తీసుకుని ఆయన అభిప్రాయాలు మార్చుకున్నారన్నది 'ఈనాడు' రోదన. ఒకవేళ అభిప్రాయాలు మార్చుకుంటే తప్పేమిటి? అమరావతిలో లక్షల కోట్లు వ్యయం చేయలేం కనుక, విశాఖ అయితే ప్రపంచవ్యాప్తంగా వెంటనే గుర్తింపు వస్తుందని జగన్ భావించారు కనుక ఆయన ఈ ప్రతిపాదన చేశారని ఎందుకు అనుకోగూడదు!

చంద్రబాబు నాయుడు తన నలభై ఐదేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నివందల సార్లు అభిప్రాయాలు మార్చుకుని ఉంటారు? ఎన్టీఆర్ అవసరం టీడీపీకి లేదనీ, అసలు ఎన్టీఆర్‌కు నైతిక విలువలే లేవనీ ఆయన అన్నారా, లేదా? ఎన్టీఆర్ మరణం తర్వాత మళ్లీ మొత్తం యూటర్న్ తీసుకున్న చంద్రబాబు అప్పుడు ఏమని మాట్లాడారు? మరి ఏనాడైనా ఆ విషయాలను 'ఈనాడు' ప్రస్తావించిందా? 1996 లోక్‌సభ ఎన్నికల సమయంలో టీడీపీ గెలిస్తేనే 2 రూపాయల కిలో బియ్యం స్కీమ్ కొనసాగుతుందనీ, కాంగ్రెస్ గెలిస్తే రేట్లు పెరుగుతాయనీ చంద్రబాబు ప్రచారం చేశారా, లేదా? తాను మరింత పటిష్ఠంగా మద్యనిషేధం అమలు చేస్తానని చెప్పి, హెల్త్ పర్మిట్లు కూడా ఎత్తివేశారా, లేదా? ఎన్నికలు అయిన కొద్ది కాలానికే ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ఒక పెద్ద తంతు నిర్వహించి బియ్యం రేట్లు పెంచడం, మద్య నిషేధాన్ని ఎత్తివేయడం ఎందుకు చేశారు? విద్యుత్ సంస్కరణలకు తానే ఆద్యుడిననీ, రైతులకు ఉచిత విద్యుత్



ఇస్తే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవల్సిందేననీ చెప్పారా, లేదా? ఇటీవలి కాలంలో విద్యుత్ సంస్కరణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చంద్రబాబు ఎందుకు మాట్లాడుతున్నారు? రైతుల మోటార్లకు మీటర్లు పెడితేనే ఏదో ప్రమాదం జరిగిపోతుందని చంద్రబాబు చెబుతుంటే, గతంలో మీరు ఇందుకు భిన్నంగా వ్యవహరించారు కదా అని 'ఈనాడు' ఏనాడైనా ప్రశ్నించిందా?

2014 ఎన్నికలకు ముందు రైతుల రుణాలు, డ్వాక్రా మహిళల రుణాలు లక్ష కోట్లు మాఫీ చేస్తానని చంద్రబాబు చెప్పినప్పుడు... అవునవును ఆయన కాబట్టే చేయగలరని 'ఈనాడు' ప్రచారం చేసిందా, లేదా? అధికారంలోకి వచ్చాక రైతులు ఆశపోతులుగా ఉండకూడదని ఆయన అన్నప్పుడు అదేమిటని 'ఈనాడు' ఎన్నడైనా రాసిందా? గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ ఉన్నప్పుడు నరహంతక ప్రభుత్వమని చంద్రబాబు విమర్శించారా, లేదా? హైదరాబాద్‌లో అడుగుపెట్టనివ్వనని ప్రకటించారా, లేదా? 2014లో మోదీ చుట్టూ తిరిగి బతిమలాడి మరీ ఎలా పొత్తు పెట్టుకున్నారు? 2019 నాటికి మళ్లీ బీజేపీతో గొడవపడి మోదీ భార్యను సైతం వివాదాలలోకి తెచ్చి మాట్లాడినప్పుడు... ఇదేమిటి చంద్రబాబు అని 'ఈనాడు' అడిగిందా? 2004లో తెలుగుదేశం పార్టీ ఓటమికి గురైన తర్వాత జరిగిన మహానాడులో సమైక్య ఆంధ్రప్రదేశే తమ విధానమని తీర్మానం చేశారా, లేదా? 2008 నాటికి ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా ఒకటికి రెండుసార్లు కేంద్రానికి లేఖలు పంపించారా, లేదా? 2009లో టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టు కోవడానికి తమ వైఖరి మార్చుకోలేదా? 2009లో అసెంబ్లీలో ప్రత్యేక తెలంగాణ తీర్మానం పెట్టాలని డిమాండ్ చేశారా, లేదా? తీరా కేంద్రం తెలంగాణ ఇస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఆంధ్ర, రాయలసీమ టీడీపీ ఎమ్మెల్యేలతో రాజీనామా డ్రామాలు ఆడించడంలో చంద్రబాబు క్రియాశీలకంగా లేరా? కొన్ని వందలసార్లు చంద్రబాబు తన అభిప్రాయాలను మార్చుకున్నారు. అలా మార్చుకోవడం ఒక ఎత్తు అయితే, పరస్పర విరుద్ధంగా మాట్లాడి రాజకీయ ప్రయోజనం పొందడం మరో ఎత్తు.

రాజధాని విషయానికి వస్తే, కేంద్ర ప్రభుత్వం నియమించిన శివ రామకృష్ణన్ కమిటీ చేసిన సిఫారసులు ఏమిటి? చంద్రబాబు చేసిందేమిటి? మూడు పంటలు పండే భూములను రాజధానిగా ఎంపిక చేయవద్దనీ, అన్ని ప్రభుత్వ ఆఫీసులూ ఒకే చోట పెట్టవద్దనీ ఆ కమిటీ చెబితే... నవ నగరాల పేరుతో సమస్తం అమరావతి గ్రామాలలో వేల కోట్లు వ్యయం చేయడానికి చంద్రబాబు పూనుకున్నప్పుడు, మీరు చేస్తున్నదేమిటని 'ఈనాడు' ఎన్నడైనా ప్రశ్నించిందా? రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోకుండా చంద్రబాబు ప్రజల కోసమే పని చేశారని 'ఈనాడు' చెబితే జనం చెవిలో పూలు పెట్టుకుని నమ్మాలన్న మాట! ఒక విధంగా చూస్తే చంద్రబాబు నాయుడు కన్నా ఈ మీడియానే అతి ప్రమాదకరంగా మారిందని అర్థం అవుతుంది.

ఇక బీజేపీ నేతల సంగతి చూద్దాం. టీడీపీతో అధికారం పంచుకుంటున్న రోజుల్లోనే రాయలసీమ డిక్లరేషన్ పేరుతో కర్నూలులో హైకోర్టు పెట్టాలనీ, సచివాలయం, సీఎం ఆఫీస్, గవర్నర్ ఆఫీస్ పెట్టాలనీ బీజేపీ డిమాండ్ చేసిందా, లేదా? ఇప్పుడు అన్నీ ఒకే చోట ఉండాలని తెలుగుదేశం పార్టీని తోకలా ఎందుకు సమర్థిస్తోంది? ప్రత్యేక హోదా ఇస్తామని స్వయంగా నరేంద్ర మోదీ చెబితే అంతా నిజమని నమ్మారు కదా? తీరా ప్రధాని అయిన తర్వాత ప్యాకేజీ మాత్రమే ఇస్తామని అనడం అభిప్రాయం మార్చుకోవడమా, కాదా? ఈ విషయంలో చంద్రబాబు మాటల మార్పు గురించి మాట్లాడుకోవడం అనవసరం. పవన్ కల్యాణ్‌కు ఎటూ దేనిపైనా ఒక క్లారిటీ ఉండదు కనుక ఆయన ఎప్పుడు ఏమి మాట్లాడతారో ఆయనకే తెలియదు. కానీ సిద్ధాంతం కలిగి ఉన్నామని చెప్పే వామపక్షాలు, ముఖ్యంగా సీపీఐ అచ్చంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, బడా భూస్వాములకు కొమ్ము కాస్తూ, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని కూడా సమర్థించలేని దుఃస్థితిలో పడిపోయింది కదా?

మరోవైపు వైసీపీ అధినేత జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను హామీ ఇచ్చిన విధంగా మానిఫెస్టోలోని 95 శాతం వాగ్దానాలను నెరవేర్చితే 'ఈనాడు' ఎన్నడైనా మెచ్చుకుందా? అమలుకాని కొద్దిపాటి హామీలను మాత్రమే గుర్తు చేస్తూ ప్రజలలో వ్యతిరేకత పెంచాలని ఎందుకు చూస్తోంది? కొన్ని ప్రొఫెషనల్ కమిటీలను నియమించి విశాఖపట్నం రాజధాని అయితే వచ్చే ప్రయోజనాలను గమనించి, దానిని కార్యనిర్వాహక రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా, శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టు పెట్టి న్యాయ రాజధానిగా చేయాలని నిర్ణయం తీసుకుంటే ఎన్ని గొడవలు చేస్తున్నారు! ఎన్ని అవాంతరాలు సృష్టిస్తున్నారు! చివరికి ఆయా వ్యవస్థలను కూడా ప్రభావితం చేసి తమకు అనుకూలంగా ఎలా మార్చుకుంటున్నారు! వీటన్నింటినీ తట్టుకుని జగన్ నిలబడడమే అతి పెద్ద విజయం అని చెప్పాలి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అభినందనలు



సెహన్ కరుణతిలక నవల బుకర్ ప్రైజ్ గెలుచుకుంది. ఆంగ్ల భాషకూ, దక్షిణాసియాలో నాణ్యమైన ప్రచురణలకూ గొప్ప రోజు ఇది.

– ప్యాట్రిక్ ఫ్రెంచ్, రచయిత

ఆడితే బాగుండు



వచ్చే ఏడాది ఆసియా కప్ కోసం పాకిస్తాన్ టూర్ చేయకూడదని బీసీసీఐ నిర్ణయించడం నిరుత్సాహం కలిగించింది. క్రీడాకారులు, సిబ్బంది ఇరువైపులా స్థాపించిన సానుకూల వాతావరణం, సద్భావనలను కొట్టేసినట్టు అయింది. పాక్‌లో ఇండియా ఆటగాళ్ల పట్ల, ఇండియాలో పాక్ ఆటగాళ్ల పట్ల ఎంతో ప్రేమ ఉంది. సముచిత నిర్ణయం కాదు.

– ఆతిఫ్ నవాజ్, క్రికెట్ కామెంటేటర్

కరువు తీరేలా...



ప్రపంచవ్యాప్తంగా ఉన్న దక్షిణాసియా రచయితలకు పెద్ద గెలుపు. ముందు డైసీ రాక్‌వెల్ అనువదించిన గీతాంజలిశ్రీ హిందీ నవల 'టూంబ్ ఆఫ్ శాండ్'కు బుకర్ ఇంటర్నేషనల్ పురస్కారం వచ్చింది. ఇప్పుడు శ్రీలంకకు చెందిన సెహన్ కరుణతిలక 'ద సెవెన్ మూన్స్ ఆఫ్ మాలీ అల్మీదా' బుకర్ గెలుచుకుంది. చాలా రోజులైంది కదా వచ్చి!

– సనా గోయల్, జర్నలిస్ట్

ఉత్త షో



ఒక పాశ్చాత్య మహిళ అఫ్గానిస్తాన్‌కు ప్రయాణించింది– కేవలం అది సురక్షితమేననీ, తాలిబన్లు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నారనీ చెప్పడానికి! కానీ ఆమె వీడియోలో కనబడుతున్న మహిళలు మాత్రం తప్పనిసరి అయిన బురఖా ధరించాలి, మగ తోడు లేకుండా బయటికి వెళ్లకూడదు, పని చేయకూడదు, చదువుకోకూడదు. ఎంత దారుణం!

– షబ్నమ్ నసీమీ, అఫ్గాన్ మాజీ ఉన్నతాధికారి

ఎందుకు ధరించడం?



మగవాళ్ల వర్క్ అవుట్ దుస్తులు: సునాయాసంగా కదిలేలా షార్ట్స్ ఉంటాయి. టీ–షర్టులేమో చెమటను లాగేస్తాయి. ఆడవాళ్ల వర్క్ అవుట్ దుస్తులు: అసలే లెగ్గింగ్స్ బిగుతుగా ఉంటాయా, మనం వాటిని ఇంకా బిగుతువి చేసేశాం. వ్యాయామానికి అవి పనికేరావు.

– లావణ్యా మోహన్, ఆర్థికాంశాల వ్యాఖ్యాత

చూసి నేర్చుకోండి



ఉత్తరాది జనాలు 'కాంతార' మీద ఉత్సాహం చూపిస్తున్నారు. భిన్న భాషలో తీసిన, భిన్నమైన సంస్కృతిని చూపిన, ఏ బాలీవుడ్ సెలబ్రిటీ లేని సినిమా ఇది. మరోవైపు బాలీవుడ్ మాత్రం 400–500 కోట్లు ఖర్చు చేస్తూ కూడా నాణ్యంగా లేని సినిమాలు తీస్తూ, ఫెయిల్ అయితే ప్రేక్షకులను నిందిస్తోంది.

– రాహుల్ రాజ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

మీరేం చేస్తున్నట్టు?



గుజరాత్ ప్రభుత్వం సీఎన్‌జీ, పైప్డ్ కుకింగ్ గ్యాస్ ధరల మీద 10 శాతం వ్యాట్‌ను తగ్గించింది. అలాగే ఉజ్వల లబ్ధిదారులకు రెండు ఉచిత సిలిండర్లను కూడా ప్రకటించింది. కానీ మోదీ ప్రకారం, ఓట్ల కోసం ఉచితాలు ఇచ్చే సంస్కృతి మంచిది కాదు. ఆ మాట కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే వర్తిస్తుందా?

– కత్యూష, వ్యాఖ్యాత

విన్నారా? 'మెదడే' ప్రమాదకరమట!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"మావోయిస్టు కుట్ర కేసు పేరిట వికలాంగుడైన ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాను, ఆయనతో పాటు నిందితులైన ఇతరులను జైలు నుంచి విడుదల చేస్తూ, వారిపై మోపిన కుట్ర కేసును కొట్టివేస్తూ బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు కాకుండా సుప్రీంకోర్టు నిల్పివేసిన పద్ధతి చాలా అసాధారణం. పరస్పర విరుద్ధంగా వెలువడిన ఈ రెండు కోర్టుల తీర్పులు కీలకమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సాయిబాబా ప్రభృతులపైన మోపిన కేసును బొంబాయి హైకోర్టు– కేసు సామర్థ్యాన్ని బట్టి కాక, సాంకేతిక కారణాలపైన కొట్టివేసి ఉండ వచ్చు. కానీ ఆ తీర్పుకు వ్యతిరేకంగా వచ్చిన అప్పీలును అనుమతించేప్పుడు సుప్రీంకోర్టు కొంత సంయమనం పాటించి ఉండాల్సింది. కానీ మహారాష్ట్ర ప్రభుత్వం బొంబాయి హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా తన అప్పీలును తక్షణమే పరిశీలించాలన్న కోర్కెను తీర్చడానికే సుప్రీం కోర్టు అసాధారణమైన ఉత్సాహాన్ని కనబరిచింది. ఫలితంగా సుప్రీం కోర్టు... ధర్మాసనం ఏర్పాటు చేసింది. కానీ, సాయిబాబా ప్రభృతులను విడుదల చేయడానికి గల కారణాలను ఎంతో వివరంగా పేర్కొన్న బొంబాయి హైకోర్టు తీర్పును కేవలం సమర్థించడానికి సుప్రీం బెంచ్ అంత వేగంగా ఉత్సాహం కనబరిచి ఉండగలిగేదా అన్నది అనుమానించాల్సిన విషయం."

– 'ది హిందూ' సంపాదకీయం (17 అక్టోబర్ 2022)

మన పాలకులుగానీ, కొందరు న్యాయమూర్తులుగానీ ఎలా వ్యవహరిస్తున్నారంటే– 'మనిషికి మెదడు ఉండటమే ప్రమాదకరం' అన్న నిర్ణయానికి వచ్చేస్తున్నారు. ఆలోచించే మెదడుంటే ప్రమాదకరమైన తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడతారని కొందరు న్యాయమూర్తులు నిర్ణయించినట్టు కనబడుతోంది. మెదడు ఎందుకు, ఎలా ప్రమాదకరమైనదో బ్రిటిష్ రాణి క్యాబినెట్‌కు ప్రత్యేక న్యాయశాస్త్ర సలహాదారుడిగా వ్యవహరించిన డేవిడ్ పానిక్ కోర్టుల గురించి వ్యంగ్యంగా ఓ కథ చెప్పాడు:

దారిన పోయే ఒక దానయ్య దారిన పోయే వాళ్లంతా కంగారు పడేంతగా, పెద్దగా భయంకరంగా తుమ్ము తుమ్మాడట. దానిపైన కొందరు దగ్గర్లో ఉన్న కోర్టులో ఫిర్యాదు చేస్తే, ఆ కోర్టు వారు ఆ వ్యక్తి రెండు ముక్కుల్లో ఏ వైపు నుంచి తుమ్మాడో తేల్చమన్నారట! అలా ఉంటాయి కొన్ని కోర్టు తీర్పులని చెప్పడానికే డేవిడ్ పానిక్ ఈ స్టోరీ చెప్పాడు. అలాగే కొన్ని సందర్భాల్లో కోర్టు తీర్పుల్ని తప్పుపట్టకూడదని ఎక్కడా శాసనం లేదని చెబుతూ డేవిడ్ పానిక్, జడ్జి జెరోమి ఫ్రాంక్ ఇలా స్పష్టం చేశారు: "న్యాయస్థానం వ్యవహరించే తీరు తెన్నుల్ని గురించిన వాస్తవాలను వెల్లడించడం తగదనీ, పైగా ప్రమాదకరం కాబట్టి న్యాయస్థానాలను గురించి ప్రస్తావించడం తగదనీ కొందరు రాజకీయవేత్తలు, కొందరు న్యాయశాస్త్ర వేత్తలు సలహాలిస్తుంటారు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థల్లో, ప్రభుత్వ శాఖల్లో జరిగే పనుల తీరు గురించిన వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పక పోవడం తెలివి తక్కువ పని. మనిషి రూపొందించి నిర్మించిన వ్యవస్థల పనితీరులో లోటుపాట్లను గమనించలేనంత అమాయకులుగా, చిన్న పిల్లలుగా ప్రజాబాహుళ్యాన్ని భావించడం అప్రజాస్వామికం. మన న్యాయ వ్యవస్థ నడవడికలోని లోపాలను తొలగించుకోవడానికి విధిగా ప్రయత్నించాలి. అందుకనే న్యాయ స్థానంలో కూర్చొనదగిన సుశిక్షితులైన జడ్జీలను మాత్రమే అనుమతించాలి. వారి ప్రవర్తనను స్వేచ్ఛగా విమర్శించే హక్కు ప్రజలకుండాలి. వారి ప్రవర్తన జ్యుడీషియల్ పర్ఫామెన్స్ కమిషన్ విచారణకు సిద్ధమై ఉండాలి."

రెండో మాట



అందుకే స్వతంత్ర భారత న్యాయవ్యవస్థలో ఉద్దండ పిండాలైన ఉన్నత న్యాయశాస్త్ర కోవిదుల్లో, ఉత్తమ న్యాయమూర్తులలో ఒకరైన జస్టిస్ కృష్ణయ్యర్ న్యాయమూర్తి స్థానంలో ఉన్నవాడికి సామాజిక న్యాయంపట్ల అవగాహన, అనురక్తి, ప్రేమానురాగాలు విధిగా ఉండాలనీ... ఈ విషయంలో ఏ కోర్టు బెంచ్‌గానీ, బార్ అసోసియేషన్ గానీ నా ఆదర్శం నుంచి, లక్ష్యం నుంచి నన్ను మరల్చజాలవనీ పదేపదే స్పష్టం చేస్తూ వచ్చారు.

ఈ సత్యానికి ప్రతిబింబంగానే ఫ్రెంచి తాత్త్వికులలో, వామపక్ష ప్రతినిధుల్లో ఒకరైన థోరే ఒక సందర్భంలో మాట్లాడుతూ– వ్యక్తుల్ని అన్యాయంగా, అక్రమంగా జైళ్లలో నిర్బంధించగల ప్రభుత్వం ఉన్న చోట న్యాయంగా వ్యవహరించే వ్యక్తి స్థానం కూడా జైల్లోనే అని వ్యంగ్యంగా పేర్కొన్నాడు. ఆయనను ఫ్రెంచి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో నిర్బంధించే నాటికే ప్రపంచ ప్రసిద్ధ తాత్త్వికుడైన ఎమర్సన్ కూడా జైల్లో మగ్గుతున్నాడు. థోరేను అకస్మాత్తుగా చూసి, 'అదేమిటయ్యా, నువ్వు కూడా జైల్లోనే ఉన్నావా?' అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు ఎమర్సన్. 'అవును, ఎవరినైనా ప్రభుత్వం అక్రమంగా జైల్లోకి నెట్టే కాలంలో న్యాయం పలికే ఏ మనిషి స్థానమైనా జైలే సుమా' అన్నాడు థోరే! అందుకే జస్టిస్ కృష్ణయ్యర్ 'అన్యాయంగా జైళ్లలో నిర్బంధితులైన వారిని ప్రస్తావిస్తూ... ఉద్రేకంగా అక్రమ కేసులలో నిర్బంధితులైన వారికీ, వారి హక్కుల రక్షణకు పూచీ పడుతున్న రాజ్యాంగానికీ మధ్య ఇనుప తెర అనేది లేదనీ, ఉండదనీ గమనిం చా'లని పదేపదే చెప్పేవారు. కానీ, ఇప్పటికొచ్చేసరికి అసలు 'మనిషి (పౌరుడి) మెదడు' మీదనే కత్తి ఎక్కుపెట్టడం జరుగుతోంది. అందుకే మహాకవి శ్రీశ్రీ అదే 'మెదడు' గురించిన విశ్వజనీనమైన సత్యాన్ని ఎలా మానవాళి ముందు ఆవిష్కరించాడో చూడండి:

"మెదడున్నది మనకున్నది
అది కాస్తా పనిచేస్తే
విశ్వరహ:పేటికావిపాటనం
జరగక తప్పదు."

'మెదడు'ను పనిచెయ్యనివ్వాలి గదా? మరి దాని ఉనికినే ప్రమాదకరంగా భావించి ప్రజల 'మెదళ్ల'నే కట్టడి చేయాలన్న తపనకు కొందరు తెరలేపడం ప్రమాదకరం. న్యాయస్థానాల గౌరవం మసకబారకుండా జాగ్రత్తపడటం కోసం జస్టిస్ లోకూర్ లాంటి వారు తమకు తాత్కాలిక పాలక శక్తులు ఎర చూపిన ప్రమోషన్లకు లొంగి పోలేదు. తమ ఉనికి కోసం అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ పాలకులు ప్రవేశపెట్టిన తప్పుడు చట్టాలు యువకుల జీవశక్తిని నులిమివేస్తున్నాయి. ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టులో వీస్తున్న ఆహ్వానించదగిన నిర్ణయాలు, పరిణామాల వాతావరణంలోనైనా అలాంటివి వైదొలగి పోవాలని ప్రజాస్వామ్యవాదులంతా కోరుకుంటారు.

ఈ తప్పుడు కేసుల తతంగం అంతా జరుగుతూన్న సందర్భంగానే – ప్రపంచంలో ఆకలిదప్పులతో కునారిల్లిపోతున్న 121 దేశాలతో కూడిన జాబితాలో భారతదేశం 107వ స్థానంలో నమోదు కావటం మనకు సిగ్గుచేటుగా లేదా? అయినా దేశ పాలకులకు 'చీమ కుట్టి నట్టు'గా కూడా లేదు. ఈ సందర్భంగా కవి కంచాన భుజంగరావు అమృతోత్సవాల సందర్భంగా వినిపిస్తున్న సందేశాన్ని విందాం:

"అర్ధరాత్రి సంకెళ్లు తెగిన జాతికి
సూర్యోదయం ఒక సహజమైన ఆశ
తెల్లవారడం ఒక అనంతమైన భరోసా
కాకపోతే 27,375 ఉదయాలు
ఎదురుచూపులుగా కరిగిపోవడమేమిటన్నదే
ఇప్పుడు తాజా ప్రశ్న.
దొరల బూట్లలో కాలుపెట్టినప్పుడే
అభివృద్ధి నడక ఎక్కడో తప్పటడుగులు వేసింది
ఇప్పుడు కేవలం రెండొందల
మర్రి చెట్లు (మహాకోటీశ్వరులు)
నీడ దేశాన్ని కమ్మేసింది.
పెట్టుబడి ఒక్కటే ఇప్పుడు
వీసా లేకుండా దేశాలు తిరిగేస్తుంది
ఈ గడ్డమీద పెట్టుబడికి ఉన్నంత స్వేచ్ఛ
వేరెవరికైనా ఉందా?

abkprasad2006@yahoo.co.in

మీసం మెలేసి.. చెప్పులు విసిరి..

- రాజమహేంద్రవరంలో టీడీపీ, జనసేన శ్రేణుల బీభత్సం



సాక్షి, రాజమహేంద్రవరం: అమరావతి యాత్ర ముసుగులో టీడీపీ, జనసేన నేతలు రాజమహేంద్రవరంలో బీభత్సం సృష్టించారు. వికేంద్రీకరణకు మద్దతుగా శాంతియుతంగా సభ నిర్వహించి నిరసన వ్యక్తంచేస్తున్న స్థానికులపై ఆ పార్టీల శ్రేణులు విరుచుకుపడ్డారు. మీసం మెలేసి మరీ రెచ్చగొట్టారు. 'యాత్రను ఆపేదెవరు' అంటూ పాటలు పెట్టుకుని మరీ రెచ్చగొట్టే ధోరణి ప్రదర్శించారు. వాటర్ ప్యాకెట్లు, చెప్పులు విసిరి రౌడీయిజానికి తెర తీశారు. రాళ్ల దాడికీ తెగబడ్డారు. మురికినీళ్ల బాటిళ్లు విసిరారు. అప్పటివరకు సహనంగా ఉన్న స్థానికులు ఒక్కసారిగా ప్రతిఘటించడంతో నగరంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే..

అమరావతిని రాజధానిగా కొనసాగించాలని కోరుతూ చేపట్టిన పాదయాత్ర మంగళవారం రాజమహేంద్రవరం నగరంలోకి ప్రవేశించింది. దేవీచౌక్ మీదుగా ఆజాద్ చౌక్ వద్దకు యాత్ర చేరుకుంది. అప్పటికే ఆజాద్ చౌక్ వద్ద యాత్ర వెళ్లే ప్రాంతానికి కొంతదూరంలో వికేంద్రీకరణకు మద్దతుగా స్థానికులు శాంతియుతంగా బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. పాదయాత్ర ఆజాద్ చౌక్ వద్దకు చేరుకోగానే స్థానికులు నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. 'వికేంద్రీకరణ ముద్దు.. ఒకే రాజధాని వద్దు' అని నినదించారు. దీంతో ఒక్కసారిగా రెచ్చిపోయిన అమరావతి పాదయాత్రలోని కొందరు టీడీపీ, జనసేన నేతలు యాత్ర వెంట తెచ్చుకున్న వాటర్ ప్యాకెట్లను స్థానికులపైకి విసిరారు. మీసం మెలేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ప్రత్యేక వాహనాన్ని అక్కడ నిలిపి ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేక పాటలతో హోరెత్తించారు. బాణాసంచా కాలుస్తూ హంగామా సృష్టించారు. దీంతో ఒక్కసారిగా స్థానికులు ప్రతిఘటించి నిరసన వ్యక్తం చేశారు. యాత్ర ముసుగులో వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, చెప్పులు విసురుతున్న వాటిని పట్టుకుని తిరిగి వాళ్లపైకి విసిరారు. టీడీపీ బినామీలు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

ఇద్దరు కార్యకర్తలకు తీవ్రగాయాలు..

మరోవైపు.. అమరావతి రైతుల ముసుగులో టీడీపీ, జనసేన నేతలు జరిపిన రాళ్ల దాడిలో కొండా సాయి, కె. నూకరాజు అనే వ్యక్తులకు తలపై, ఎడమ కంటి వద్ద బలమైన గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ మార్గాని భరత్ వైద్యులకు సూచించారు. రాజమహేంద్రవరం చరిత్రలో ఇది చీకటి రోజుగా ఆయన అభివర్ణించారు. సీసీ పుటేజీల ఆధారంగా దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. అలాగే, దాడిని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశ్‌రావు దాడిని ఖండించారు.

ఇలా సుమారు గంటపాటు ప్రతిఘటన ఎదురైంది. అక్కడే ఉన్న టీడీపీ రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి సైతం దాడిని ప్రోత్సహించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు కలగజేసుకుని పాదయాత్రను ముందుకు కదలనివ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.

అమరావతి యాత్రలో.. ప్రాణం కాపాడిన పోలీస్

- యాత్రలో పాల్గొన్న వ్యక్తికి గుండెపోటు
- వెంటనే సీపీఆర్ చేసి బతికించిన సీఐ త్రినాథ్

సాక్షి, రాజమహేంద్రవరం: అమరావతి యాత్రలో పాల్గొన్న ఓ వ్యక్తి ప్రాణాన్ని పోలీస్ అధికారి నిలబెట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పాదయాత్ర కొనసాగుతుండగా.. ఓ వ్యక్తి గుండెపోటుకు గురై రోడ్డుపై పడిపోయాడు. దీంతో అక్కడున్నవారు వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో అంబులెన్స్ వారి వద్దకు రాలేని పరిస్థితి ఎదురైంది. ఇంతలో అక్కడే విధి నిర్వహణలో ఉన్న సీఐ త్రినాథ్ వేగంగా స్పందించారు. సీపీఆర్ చేయడంతో అతని ప్రాణం లేచి వచ్చింది. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఆపద సమయంలో వేగంగా స్పందించి ప్రాణం నిలబెట్టిన సీఐ త్రినాథ్‌ను అక్కడున్నవారంతా ప్రశంసించారు.



సీపీఆర్ చేస్తున్న సీఐ త్రినాథ్

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుంచి దేశాన్ని రక్షిస్తాం

- వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం
- విజయవాడలో ఐదు రోజుల మహాసభలు విజయవంతం
- సీపీఐ జాతీయ నూతన ప్రధాన కార్యదర్శి రాజా

సాక్షి, అమరావతి: బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తుల నుంచి దేశాన్ని రక్షిస్తాం. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష పోరాటాలు చేస్తాం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తాం' అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆయన జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 18 వరకు ఐదు రోజులపాటు జరిగిన సీపీఐ 23వ జాతీయ మహాసభలు విజయవంతం అయ్యాయని చెప్పారు. పార్టీ జాతీయ కార్యదర్శివర్గం, కార్యవర్గం, జాతీయ సమితి(కమిటీ) ఎన్నికైనట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా 950 మంది ప్రతినిధులు, 19 దేశాల నుంచి 31 మంది సౌహార్ద ప్రతినిధులు పాల్గొని ఉద్యమానికి ఉత్తేజాన్నిచ్చారని తెలిపారు. పోరాటాల గడ్డ విజయవాడలో జరిగిన మహాసభలు పార్టీ మరింత శక్తివంతంగా ఎదిగేందుకు స్ఫూర్తి నింపాయని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉధృతంగా పోరాటాలు చేస్తామని చెప్పారు. 2024లో జరిగే ఎన్నికల్లో బీజేపీ కూటమిని గద్దె దింపడమే లక్ష్యంగా వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని రాజా ధీమా వ్యక్తం చేశారు.

జాతీయ ప్రధాన కార్యదర్శిగా రాజా

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా డి.రాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2018లో కేరళ రాష్ట్రం కొల్లాంలో జరిగిన మహాసభల్లో సురవరం సుధాకర్‌రెడ్డి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అయితే, అనారోగ్య కారణాలతో ఆయన ఏడాదికే స్వచ్ఛందంగా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో అప్పట్లో రాజాకు తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. తాజాగా విజయవాడ మహాసభల్లో రాజా ఎన్నికపై కేరళ, బిహార్ రాష్ట్రాల ప్రతినిధులు అభ్యంతరం తెలిపినట్టు విశ్వసనీయ సమాచారం. మహాసభల్లో అత్యధిక శాతం ప్రతినిధులు రాజా వైపే మొగ్గు చూపడంతో పూర్తికాలం ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది.

కార్యదర్శివర్గంలో నారాయణ

సీపీఐ జాతీయ కార్యదర్శివర్గంలో 11 మందికి చోటు దక్కింది. ప్రధాన కార్యదర్శి రాజా, ఏపీకి చెందిన నారాయణతోపాటు కనమ్ రాజేంద్రన్, అతుల్‌కుమార్ అంజన్, అమర్‌జిత్ కౌర్, డాక్టర్ బీకే కంగో, బినయ్ విశ్వం, పల్లబ్ సేన్‌గుప్తా కార్యదర్శివర్గం సభ్యులుగా ఎన్నికయ్యారు. పాత కార్యదర్శివర్గంలో ఉన్న సమీమ్ ఫైజీ మృతి చెందడం, సురవరం సుధాకర్‌రెడ్డి తప్పుకోవడం, రామేంద్ర కుమార్ వయస్సు రీత్యా కంట్రోల్ కమిషన్‌కు వెళ్లడంతో వారి స్థానంలో కొత్తగా నాగేంద్రనాథ్ ఒఝ్జా, అజీజ్ పాషా, రామ్‌కృష్ణ పండాలను కార్యదర్శివర్గంలోకి తీసుకున్నారు.

జాతీయ సమితిలో రాష్ట్రం నుంచి ఏడుగురికి చోటు

31 మందితో జాతీయ కార్యవర్గం ఎన్నికైంది. కేంద్ర పార్టీ నుంచి 26 మందితోపాటు దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రాధాన్యత కల్పిసూ 95 మంది జాతీయ సమితి (నేషనల్ కమిటీ) సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రజా సంఘాల నుంచి 13 మంది క్యాండిడేట్ మెంబర్లు, ఒకరు శాశ్వత ఆహ్వానితులు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు, 11మందితో కంట్రోల్ కమిషన్(క్రమశిక్షణ కమిటీ)ను నియమించారు. జాతీయ సమితిలో ఈసారి రాష్ట్ర పార్టీ కార్యదర్శి రామకృష్ణతో పాటు మొత్తం ఏడుగురికి చోటు దక్కింది.

సింగిల్ జడ్జి వద్దే పిటిషన్ వేయండి

- ఎక్స్‌టెన్షన్ అధికారుల నియామకం నిలిపివేతపై ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశం

సాక్షి, అమరావతి: మహిళా, శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీ వర్కర్లను పదోన్నతిపై ఎక్స్‌టెన్షన్ అధికారులుగా నియమించే ప్రక్రియను నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీల్ చేసింది. ఈ అప్పీల్‌పై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు విన్న ధర్మాసనం, విశాఖ జోన్‌లో ఎక్స్‌టెన్షన్ అధికారుల నియామకం కొనసాగించేందుకు అనుమతినిచ్చింది. అయితే ఒంగోలు, ఏలూరు, కర్నూలు జోన్లకు సంబంధించి సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. స్టే ఎత్తివేత కోసం సింగిల్ జడ్జి వద్దే పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ మేరకు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.తమకు రాత పరీక్ష మాత్రమే నిర్వహించి, ఇంగ్లిష్ ప్రావీణ్య పరీక్షను నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. రాత పరీక్ష నిర్వహించకుండానే తుది మెరిట్ లిస్ట్ ప్రకటించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని, ఇందులో జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ మన్మథరావు ఎక్స్‌టెన్షన్ అధికారులుగా నియమించే వారికి రాత పరీక్షతో పాటు ఇంగ్లిష్ ప్రావీణ్య పరీక్ష నిర్వహించడం తప్పనిసరని అభిప్రాయపడ్డారు. విశాఖ జోన్ మినహా మిగిలిన మూడు జోన్‌లలో ఎక్స్‌టెన్షన్ అధికారుల నియామకం ప్రక్రియను నిలిపివేస్తూ ఆయన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

రైతుల ముసుగులో రౌడీలు, బ్లేడ్‌బ్యాచ్‌లు

- శాంతియుతంగా నిరసన తెలిపితే దాడులు చేస్తారా?
- రాజమహేంద్రవరం ఎమ్మెల్యే మామ, భర్త ఇదంతా చేయించారు
- టీడీపీ సంఘ విద్రోహశక్తులను పోషిస్తోంది
- వికేంద్రీకరణ సభలో రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

సాక్షి, రాజమహేంద్రవరం: 'రైతుల ముసుగులో రౌడీలు, బ్లేడ్ బ్యాచ్, సంఘ విద్రోహశక్తులు మాపై దౌర్జన్యానికి దిగుతారా? ఇదేనా ప్రజాస్వామ్యమంటే?'.. అని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని ఆజాద్ చౌక్ సెంటర్ వద్ద వికేంద్రీకరణకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై, ప్రజలపై రాళ్లు, వాటర్‌బాటిళ్లు విసురుతారా? ఇంత దారుణమా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజమండ్రి ఎమ్మెల్యే మామ, భర్త పెంచిపోషిస్తున్న బ్లేడ్ బ్యాచ్, రౌడీషీటర్లే దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. వారి జేబులు వెతికితే బ్లేడులు ఉంటాయని.. చొక్కాలు విప్పితే పచ్చబొట్లు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే మామ, భర్త తమపై పథకం ప్రకారమే దాడి చేయించారన్నారు. దాడులకు కారణమైన ఏ ఒక్కరినీ వదలబోమని.. ఉక్కుపాదంతో అణిచివేస్తానంటూ భరత్ హెచ్చరించారు. రైతులంటే తమకు ఎంతో గౌరవమని, గట్టిగా ఉంటే రెండు వందల మంది ఉండొచ్చు. వారు పాదయాత్ర చేసుకుంటే అభ్యంతరం లేదన్నారు. అలాగే, తన బినామీలకు, పెట్టుబడిదారులకు, పెత్తందారులకు తీవ్రనష్టం వస్తుందనే భయంతోనే చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారని ఎంపీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

అది టీడీపీ యాత్రే : ఎంపీ బోస్

రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. ఇది అమరావతి రైతుల యాత్ర కాదని.. టీడీపీ యాత్రన్నారు. రైతుల ముసుగులో టీడీపీ, జనసేన నేతలు దాడులకు దిగారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రసంగిస్తూ.. శాంతియుతంగా నిరసన చేపడుతున్న సభలో టీడీపీకి చెందిన కొందరు రాళ్లు, సీసాలు విసిరి సభను అగౌరవపరచడం అమానుషమన్నారు. టీడీపీకి చెందిన వారు తమపై దాడిచేస్తే వారిపై తాము దాడిచేసినట్లు పచ్చ మీడియా ద్వారా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజలందరూ అన్ని విషయాలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాలో జోడో యాత్ర



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్

ఆలూరు రూరల్: కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మంగళవారం ఏపీలోని కర్నూలు జిల్లాలో ప్రారంభమైంది. 41వ రోజున రాహుల్‌గాంధీ 22 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. ఉదయం 6.30 గంటలకు కర్నూలు జిల్లా హాలహర్వి నుంచి ప్రారంభమైన పాదయాత్ర సాయంత్రం ఆదోని నియోజకవర్గంలోని చాగి గ్రామం వద్ద ముగిసింది. రాహుల్ వెంట పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్, కేవీపీ రామచంద్రరావు, జేడీ శీలం తదితరులు నడిచారు. ఆదోనిలో జైరాం రమేశ్ మీడియాతో మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. 2024లో అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్నారు.

11న ఉర్దూ జాతీయ, ప్రాంతీయ పురస్కారాలు

రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహ్మద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న ప్రోత్సాహం మరువరానిదని, ఈ ఏడాది కూడా ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్య, విభిన్న రంగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలను అందించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహ్మద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశ మొదటి విద్యా మంత్రిగా సేవలు అందించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి రోజైన నవంబర్ 11వ తేదీన (మైనార్టీ సంక్షేమ దినోత్సవం) ఈ పురస్కారాలు అందించనున్నట్టు పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం కింద రూ.1.25 లక్షల నగదు, డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద రూ.లక్ష ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి చెందిన సాహితీవేత్తలు, పండితులు(స్కాలర్), కవులు, పాత్రికేయులు, విమర్శకులు, పరిశోధన, గద్య బోధన, ఉర్దూ సేవకులకు పురస్కారం ఇవ్వనున్నామని పేర్కొన్నారు. దరఖాస్తులను ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ, డోర్ నెంబర్ 76-1-6ఎ/1, మాలవిక విల్లా, హెచ్‌బీ కాలనీ, భవానీపురం, విజయవాడ 520012, కృష్ణాజిల్లా అనే చిరునామాకు అందజేయాలని హిరియల్ అహ్మద్ కోరారు.

ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్

ఆరుగురు కేదార్‌నాథ్ యాత్రికులు, పైలట్ మృతి




రుద్రప్రయాగ: ఉత్తరాఖండ్‌లో హెలికాప్టర్ కూలిన ఘటనలో ఆరుగురు కేదార్‌నాథ్ యాత్రికులు, పైలట్ మృత్యువాత పడ్డారు. మంగళవారం కేదార్‌నాథ్ నుంచి గుప్తకాశీ బయల్దేరిన బెల్ 407 రకం హెలికాప్టర్ రెండు కిలోమీటర్లు వెళ్లగానే రుద్రప్రయాగ్ జిల్లా దేవ్ దర్శిని సమీపంలో కొండను ఢీకొని కుప్పకూలింది. మంటలంటుకుని పైలట్, యాత్రికులు అక్కడికక్కడే చనిపోయారు. మృతుల్లో నలుగురు గుజరాత్‌కు, ఇద్దరు తమిళనాడుకు చెందిన వారు. పైలట్‌ది మహారాష్ట్ర. ప్రమాదకరమైన ఈ ప్రాంతంలో విమానాలు, హెలికాప్టర్లకు ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తుంటామని అధికారులన్నారు. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

శ్వాసతోనే క్యాన్సర్‌ను కనిపెట్టొచ్చు

- శ్వాస ఆధారిత డిటెక్టర్ అభివృద్ధి
- ఐఐటీ-రూర్కీ పరిశోధకుల ఘనత

రూర్కీ: రొమ్ము, ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్‌ను వ్యయప్రయాసలు లేకుండా కేవలం శ్వాస ఆధారంగానే కనుగొనే కొత్త విధానాన్ని ఐఐటీ-రూర్కీ పరిశోధకులు అభివృద్ధిచేశారు. ప్రొఫెసర్ ఇంద్రాణి లాహిరి, ప్రొఫెసర్ పార్థా రాయ్, ప్రొఫెసర్ దిబ్రుపా లాహిరి తదితరులు రూపొందించిన ఈ డిటెక్టర్ రంగుల వేర్వేరు గాఢతలను వివరించే కలరీమెట్రీ సిద్ధాంతం ఆధారంగా పనిచేస్తుంది. 'చిన్న పరిమాణంలో ఉండే ఈ స్క్రీనింగ్ డివైజ్‌ను ఉపయోగించడం చాలా తేలిక. ఈ డివైజ్‌లోకి సంబంధిత వ్యక్తి గట్టిగా గాలి ఊదితే చాలు వెంటనే డివైజ్‌లో ఒక కలర్ కనిపిస్తుంది. ఏ రోగానికి ఏ రంగు అనేది ముందే నిర్దేశితమై ఉంటుందిగనుక వాటిని పోలిచూసి రొమ్ము, ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్‌లలో ఏదైనా వ్యాధి ప్రబలిందా లేదా చెక్ చేయవచ్చు' అని పరిశోధనలో కీలకభూమిక పోషించిన ప్రొఫెసర్ ఇంద్రాణి లాహిరి వివరించారు. 'క్యాన్సర్‌ను తొలినాళ్లలోనే కనుగొంటే చాలా ఉత్తమం. అప్పుడే దాని నుంచి త్వరగా కోలుకునేందుకు అవకాశాలు మెరుగుపడతాయి' అని ఐఐటీ-రూర్కీ తాత్కాలిక డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంఎల్ శర్మ అన్నారు. 'ఈ ఉపకరణంతో కోట్లాదిమంది ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రాణాంతక రోగం ముదిరి వ్యాధి చికిత్సకు లక్షలు పోసే బదులు ముందే వ్యాధిని గుర్తించేందుకు ఇది సాయపడనుంది' అని ఆయన అన్నారు. ఈ పరికరం ప్రస్తుతం పరీక్ష దశలో ఉంది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఉన్న క్యాన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో దీని సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు. డిటెక్టర్‌ను వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు టాటా స్టీల్‌తో సాంకేతిక బదిలీ ఒప్పందాన్ని ఐఐటీ-రూర్కీ చేసుకుంది. హెల్త్ టెక్నాలజీలో విదేశాలపై ఆధారపడకుండా దేశీయ జ్ఞానాన్ని ఒడిసిపట్టేందుకే టెక్నాలజీ, న్యూ మెటీరియల్స్ బిజినెస్ పేరిట టాటా స్టీల్ విడిగా ఒక ప్రత్యేక విభాగాన్ని నిర్వహిస్తోంది. ఆరోగ్య ఉపకరణాల రంగంలో స్వావలంబనకు ఈ సంస్థ కృషిచేస్తోంది. ప్రధాని మోదీ నినదించిన ఆత్మనిర్భరత భారత్ కోసం శ్రమిస్తోంది.



శ్రీలంక రచయితకు ప్రతిష్టాత్మక బుకర్ ప్రైజ్



లండన్: శ్రీలంక రచయిత షెహాన్ కరుణతిలకను ప్రఖ్యాత బుకర్ ప్రైజ్ వరించింది. లండన్‌లో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో 2022 ఏడాదికి ' ది సెవెన్ మూన్స్ ఆఫ్ మాలి అల్మీడియా' రచనకు గాను కరుణతిలకకు బుకర్ సాహిత్య పురస్కారంతోపాటు 50వేల పౌండ్లను బహూకరించారు. లండన్‌లో జరిగిన కార్యక్రమంలో బ్రిటన్ రాజు చార్లెస్ సతీమణి కెమిల్లా ఈ ట్రోఫీని కరుణతిలకకు స్వయంగా అందజేశారు. 1992 తర్వాత ఒక శ్రీలంక జాతీయుడు ఈ బుకర్ ప్రైజ్‌ను సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. 'ది సెవెన్ మూన్స్ ఆఫ్ మాలి ఆల్మీడియా' కాల్పనిక థ్రిల్లర్ పుస్తకంలో.. శ్రీలంక అంతర్యుద్ధం తాలూకు ఘోరాలను, మానవీయ కోణాలను తన కెమెరాలతో బంధిస్తూ యుద్ధంలో మరణించిన ఒక ఫొటో జర్నలిస్ట్ కథను కరుణతిలక అద్భుతంగా ఆవిష్కరించారు. కథాగమనం గొప్పది' అని బుకర్ ప్రైజ్ న్యాయనిర్ణేతల చైర్మన్ మ్యాక్‌గ్రిగార్ వ్యాఖ్యానించారు. పుస్తకంలో.. యుద్ధంలో మరణించిన మాలి అనే జర్నలిస్ట్ ఆ తర్వాత స్వర్గంలో కళ్లు తెరుస్తాడు. అతడిని చంపింది ఎవరు? ఎందుకు చంపారు ? వంటి మిస్టరీలను ఛేదించేందుకు అతనికి కేవలం ఏడు రోజుల సమయం మిగిలి ఉంటుంది. ఈ గడువు గడిచేలోపే కాలానికి ఎదురీదుతూ వాస్తవిక, కాల్పనిక ప్రపంచాల మధ్య తిరుగుతుంటాడు. శ్రీలంక అంతర్యుద్ధం తాలూకు ఘోరాలు, మానవీయ కోణాలు, ప్రజల కష్టాలు, తనవారి ప్రేమానురాగాలు, ఇలా ఎన్నో బంధాల తీవ్రతను మాలి ఆవిష్కరిస్తాడు. కరుణతిలక గతంలో అడ్వర్‌టైజింగ్ కాపీ రైటర్‌గా పనిచేశారు. కొన్ని పాటలు రాశారు. స్క్రీన్‌ప్లే అందించారు. ట్రావెల్‌స్టోరీలు రచించారు.

ఉగ్ర స్థావరాలను పెకిలించాల్సిందే

ప్రపంచ దేశాలకు మోదీ పిలుపు

- సురక్షిత ప్రపంచ దేశాలన్నింటి ఉమ్మడి బాధ్యతన్న ప్రధాని
- ఢిల్లీలో 90వ ఇంటర్‌పోల్ సదస్సు
- పాక్‌తో పాటు మొత్తం 195 దేశాల నుంచి హాజరైన ప్రతినిధులు
- పాతికేళ్ల తర్వాత ఢిల్లీలో జరుగుతున్న సదస్సు



మోదీకి మొక్కను బహూకరిస్తున్న ఇంటర్‌పోల్ అధ్యక్షుడు అహ్మద్ నాజర్ అల్‌రైసీ

న్యూఢిల్లీ: ఉగ్రవాదులు, అవినీతిపరులు, డ్రగ్ స్మగ్లర్లు, వ్యవస్థీకృత నేరగాళ్లకు ఏ దేశమూ ఆశ్రయంగా మారకూడదని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. వారి స్థావరాలు ఎక్కడున్నా సరే, వాటన్నింటినీ నిర్మూలించాల్సిందేనని పాకిస్తాన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. ఇందుకు కలసికట్టుగా కృషి చేయాలంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. సురక్షిత ప్రపంచం అంతర్జాతీయ సమాజపు సమష్టి బాధ్యత అన్న వాస్తవాన్ని అందరూ గుర్తించాలన్నారు. 'స్థానిక సంక్షేమం కోసం అంతర్జాతీయ సహకారం' అన్నదే భారత నినాదమన్నారు. ''సానుకూల శక్తులన్నీ పరస్పరం సహకరించుకుంటే దుష్టశక్తులు, నేరగాళ్ల పీచమణచవచ్చు'' అని అభిప్రాయపడ్డారు. ఇంటర్‌పోల్ 90వ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఢిల్లీలో మోదీ ప్రారంభించారు. 195 దేశాల నుంచి హోం మంత్రులు, పోలీసులు ఉన్నతాధికారులు తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పాకిస్తాన్ తరఫున ఆ దేశ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) డైరెక్టర్ జనరల్ మొహసిన్ బట్ పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇంటర్‌పోల్ అధ్యక్షుడు అహ్మద్ నాజర్ అల్‌రైసీ, సెక్రెటరీ జనరల్ ఉర్గన్ స్టాక్ వేదిక వద్ద మోదీకి స్వాగతం పలికారు. సదస్సును ప్రారంభించిన అనంతరం ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే ఈ దుష్టశక్తుల వేగం పెరిగిందని అభిప్రాయపడ్డారు. ''ఇలాంటి నేరాలు ఎక్కడ జరిగినా వాటిని మొత్తం మానవత్వంపై దాడిగానే చూడాలి. ఎందుకంటే ఇవి భావి తరాలను కూడా ప్రభావితం చేస్తాయి. అంతర్జాతీయ స్థాయి ముప్పులను ఎదుర్కొనేందుకు స్థానిక స్పందనలు సరిపోవు'' అని స్పష్టం చేశారు. అందుకే వీటిని సమర్థంగా తిప్పికొట్టేందుకు ప్రపంచమంతా ఒక్కతాటిపైకి రావడం తక్షణావసరమన్నారు. సదస్సుకు గుర్తుగా 100 రూపాయల నాణాన్ని, పోస్టల్ స్టాంపును మోదీ విడుదల చేశారు. ఇంటర్‌పోల్ సదస్సు పాతికేళ్ల తర్వాత భారత్‌లో జరుగుతోంది.

ఉగ్రవాదం తీరు మారింది...

పొరుగు దేశాల ప్రేరేపిత ఉగ్రవాదంతో భారత్ దశాబ్దాలుగా పోరాడుతోందని మోదీ గుర్తు చేశారు. ''ఉగ్రవాద భూతాన్ని మిగతా ప్రపంచం గుర్తించడానికి చాలాకాలం ముందు నుంచే మేం దానితో పోరాడుతూ వస్తున్నాం. భద్రత, రక్షణ కోసం ఎంతటి మూల్యం చెల్లించాల్సి ఉంటుందో మాకు బాగా తెలుసు. ఈ పోరులో వేలాదిమంది వీరులను కోల్పోయాం'' అంటూ ఆవేదన వెలిబుచ్చారు. ఉగ్రవాదం ఆన్‌లైన్ బాట కూడా పట్టిందన్న వాస్తవాలను గుర్తించాలన్నారు. ''ఇప్పుడు ఎక్కడో మారుమూల నుంచి ఒక్క బటన్ నొక్కడం ద్వారా భారీ పేలుడు సృష్టించవచ్చు. తద్వారా ఈ దుష్టశక్తులు వ్యవస్థలనే తమ ముందు సాగిలపడేలా చేసుకునే పరిస్థితి నెలకొంది'' అంటూ ఆందోళన వెలిబుచ్చారు. వీటిని ఎదుర్కొనడానికి దేశాలు వ్యక్తిగతంగా చేసే ప్రయత్నాలు చాలవని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగా పటిష్ట వ్యూహాల ద్వారా సైబర్ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోగలమన్నారు. ఆ దిశగా తక్షణం విధానాలు రూపొందాలని సూచించారు. పోలీసు, చట్టపరమైన సంస్థలు పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించుకునేందుకు మార్గాలు కనిపెట్టాలని సూచించారు. ''ప్రమాదాలను ముందే గుర్తించి హెచ్చరించే వ్యవస్థలు, రవాణా, కమ్యూనికేషన్ సేవలను కాపాడుకునే యంత్రాంగం, సాంకేతిక, నిఘా సమాచారాల త్వరితగత మార్పిడి తదితరాలను ఆధునీకరించుకోవాలి. అవినీతి, ఆర్థిక నేరాలు చాలా దేశాల్లో పౌరుల సంక్షేమానికి గొడ్డలిపెట్టుగా మారాయి. ఇలా దోచిన సొమ్ము అంతిమంతా ఉగ్రవాదానికి పెట్టుబడిగా మారుతోంది. యువత జీవితాలను డ్రగ్స్ సమూలంగా నాశనం చేస్తోంది'' అని మోదీ అన్నారు.

రెడ్ కార్నర్ నోటీసుల్లో వేగం పెరగాలి

పరారీలో ఉన్న నేరగాళ్లను పట్టుకునేందుకు వీలు కల్పించే రెడ్ కార్నర్ నోటీసుల జారీలో వేగం మరింత పెరగాల్సి ఉందని ఇంటర్‌పోల్‌కు ప్రధాని మోదీ సూచించారు. ప్రస్తుతం భారత్ తరఫున 780 రెడ్‌కార్నర్ నోటీసులున్నాయని గుర్తు చేశారు. వీటిలో 205 పలు నేరాల్లో సీబీఐ జాబితాలో వాంటెడ్‌గా ఉన్న నేరగాళ్లకు సంబంధించినవని ఆయన చెప్పారు. నేరగాళ్ల ఇంటర్‌పోల్ సభ్య దేశాల్లో ఎక్కడున్నా అరెస్టు చేసేందుకు, వెనక్కు రప్పించేందుకు రెడ్ కార్నర్ నోటీసు వీలు కల్పిస్తుంది. భారత్ జారీ చేసిన నోటీసుల్లో అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం, అతని సహాయకుడు ఛోటా షకీల్, ఉగ్రవాదులు మసూద్ అజర్, హఫీజ్ సయీద్‌తో పాటు ఆర్థిక నేరగాళ్లు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితరులున్నారు. రెడ్‌కార్నర్ నోటీస్ అంతర్జాతీయ అరెస్టు వారెంటు కాదని, నేరగాళ్లను అరెస్టు చేసి తీరాలంటూ సభ్య దేశాలను ఇంటర్‌పోల్ ఒత్తిడి చేయలేదని సంస్థ ప్రధాన కార్యదర్శి ఉర్గన్ సోమవారం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మోదీ పిలుపు ప్రాధాన్యం సంతరించుకుంది.

దావూద్‌పై పాక్ మౌనం

అండర్ వరల్డ్ డాన్, భారత్‌లో విధ్వంసం సృష్టించి పరారీలో ఉన్న ఇతర ఉగ్రవాదుల ఉనికిపై పాక్ మరోసారి మౌనం వహించింది. దావూద్, ముంబై పేలుళ్ల సూత్రధారి హఫీజ్ సయీద్ ఎక్కడున్నారన్న మీడియా ప్రశ్నకు ఇంటర్‌పోల్ సదస్సులో పాల్గొంటున్న పాక్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) చీఫ్ మొహసిన్ బట్ బదులివ్వలేదు. ఇలాంటి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆయన సరిగ్గా సదస్సు మొదలయ్యే సమయంలో సమావేశ మందిరంలోకి వచ్చారు. అయినా మోదీ ప్రసంగం పూర్తవగానే మీడియా అంతా బట్‌ను చుట్టుముట్టి ప్రశ్నలు కురిపించింది. వాటికి బదులివ్వకుండానే ఆయన వెళ్లిపోయారు.

మన చరిత్రను మరిచాం: మోదీ

అహ్మదాబాద్: సుదీర్ఘ కాలంపాటు బానిసత్వం కింద మగ్గడం, ఉదాసీనత మనల్ని మన ఘన చరిత్రను మర్చిపోయేలా చేసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గుజరాత్‌లోని లోథాల్‌లో నిర్మిస్తున్న నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ పనుల పురోగతిని మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ మన చరిత్రను తెలుసుకునే ప్రధాన కేంద్రంగా మారనుందని ఈ సందర్భంగా ప్రధాని అన్నారు. 'శతాబ్దాల క్రితం, భారత దేశం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక ప్రాంతాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉంది. ప్రపంచంలోని అన్ని నాగరికతలతోనూ అప్పట్లో మనకు సంబంధాలున్నాయి. సముద్రజలాలపై ఆధిపత్యం వల్లే ఇది సాధ్యమైంది'అని ప్రధాని చెప్పారు. దీర్ఘకాలంపాటు బానిసత్వం కింద మగ్గడంతో మనం ఆ సామర్థ్యాన్ని కోల్పోయాం. క్రమంగా గత చరిత్ర పట్ల ఉదాసీనత పెరిగిపోయింది. సముద్రవాణిజ్యానికి ఒకప్పటి ప్రముఖ కేంద్రాలుగా ఉన్న లోథాల్, ధోలవీరా వంటి వాటిని మనం మర్చిపోయాం. అప్పటి చిహ్నాలను పరిరక్షించుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు.'అని చెప్పారు. మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్‌లో మన గత ఘన చరిత్రను సామాన్యుడు కూడా అర్థం చేసుకునేలా ఆధునిక సాంకేతికను జోడిస్తున్నామన్నారు.

'బలవంతపు హిందీ'కి వ్యతిరేకంగా

తమిళనాడులో తీర్మానం

చెన్నై: ఐఐటీ వంటి విద్యాసంస్థల్లో బోధన మాధ్యమంగా హిందీని వాడాలన్న పార్లమెంటరీ కమిటీ సిఫార్సును వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. కమిటీ సిఫార్సులు ద్విభాషా విధానానికి వ్యతిరేకంగా ఉన్నాయని ముఖ్యమంత్రి స్టాలిన్ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ఆందోళన వెలిబుచ్చారు. ఇవి తమిళం మాట్లాడే వారి ప్రయోజనాలకు విఘాతంగా మారతాయని ఆయన అన్నారు. 'నాడు అన్నాదురై చేసిన ద్విభాషా విధాన తీర్మానాలు, నాటి ప్రధాని నెహ్రూ ఇచ్చిన వాగ్దానాలకు ఈ సిఫార్సులు తూట్లు పొడుస్తున్నాయి' అంటూ దుయ్యబట్టారు. సీఎం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తీర్మానానికి పూర్తి మద్దతు పలుకుతున్నట్టు ప్రతిపక్ష అన్నాడీఎంకే సైతం ప్రకటించింది.

క్లుప్తంగా...

ఉగ్రవాదుల గ్రెనేడ్ దాడి.. ఇద్దరు యూపీ కార్మికులు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో స్థానికేతరులే లక్ష్యంగా ఉగ్రవాదులు పంజా విసిరారు. వలస కార్మికులు నిద్రిస్తున్న షెడ్‌పై గ్రెనేడ్ విసరడంతో యూపీకి చెందిన ఇద్దరు చనిపోయారు. సోమవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను యూపీలోని కనౌజ్ జిల్లా దన్నాపూర్వ గ్రామానికి చెందిన మోనిష్ కుమార్, రామ్ సాగర్‌గా గుర్తించారు. ఘటన జరిగిన వెంటనే భద్రతా బలగాలు ముష్కరుల కోసం వేట ప్రారంభించాయి. లష్కరే తోయిబాకు చెందినట్లుగా అనుమానిస్తున్న హర్మెన్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ బషీర్ గనీతోపాటు హిజ్బుల్ ముజాహిదీన్ వర్గానికి చెందిన మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, దాడి ఘటన బాధితులిద్దరూ రెండు నెలల క్రితం షోపియాన్‌లోని యాపిల్ తోటల్లోకి పనికి వెళ్లినట్లు కనౌజ్ కలెక్టర్ సుబ్రాంత్ కుమార్ శుక్లా చెప్పారు. ఇలా ఉండగా, రెండు రోజుల క్రితం ఇదే జిల్లాలో ఉగ్రవాదులు కశ్మీరీ పండిట్‌ను కాల్చి చంపిన విషయం తెలిసిందే.

'ప్రుడెంట్' నుంచి పార్టీలకు రూ.464 కోట్లు

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే సంపన్న సంస్థగా పేరొందిన ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్.. రాజకీయ పార్టీలకు భారీ స్థాయిలో విరాళాలు అందజేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రాజకీయ పార్టీలకు ఏకంగా రూ.464 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఈ మొత్తం నుంచి ఒక్క బీజేపీకే రూ.336.5 కోట్లు జమ పడ్డాయని కేంద్ర ఎన్నికల సంఘం వద్ద ఉన్న అధికారిక గణాంకాల్లో వెల్లడైంది. వేర్వేరు సంస్థల నుంచి తాము అందుకున్న విరాళాల వివరాలను రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం(ఈసీ)కి కంట్రిబ్యూషన్ రిపోర్ట్‌గా నివేదిస్తాయి. ఆ నివేదికల్లో ఈ వివరాలు ఉన్నాయి. కార్పొరేట్ సంస్థలు, వేర్వేరు మార్గాల ద్వారా ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్‌కు 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.464.83 కోట్లు వచ్చాయి. ఈ మొత్తం నుంచి రూ.464.81 కోట్లు రాజకీయ పార్టీలకు విరాళాలుగా ఇచ్చింది. ఒక్క బీజేపీకే 26 విడతల్లో మొత్తంగా రూ.336.5 కోట్లు ఇచ్చింది. ఇదే ప్రుడెంట్ సంస్థ.. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ), తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్), సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), అమరీందర్ నేతృత్వంలో కొనసాగిన పంజాబ్ లోక్ కాంగ్రెస్(పీఎల్‌సీ), గోవా ఫార్వర్డ్ పార్టీలకు విరాళాలు ఇచ్చింది. కాంగ్రెస్‌కు రూ.16.5 కోట్లు, ఆప్‌కు రూ.16.31 కోట్లు, ఎస్ఏడీకి రూ.7 కోట్లు, పీఎల్‌సీకి రూ. కోటి, టీఆర్ఎస్‌కు రూ.40 కోట్లు, ఎస్పీకి రూ.27 కోట్లు, గోవా ఫార్వర్డ్‌కు రూ.50 లక్షల విరాళాలు అందాయి. కోవిషీల్డ్ కోవిడ్ టీకా తయారీసంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా.. ప్రుడెంట్‌కు రూ. 45 కోట్లు విరాళమివ్వడం గమనార్హం. హెటిరో డ్రగ్స్, హెటిరో ల్యాబ్స్ చెరో రూ. 5 కోట్లు, టోరెంట్ ఫార్మా రూ. 2కోట్లు ప్రుడెంట్‌కు ఇచ్చాయి. భారతీ ఎయిర్‌టెల్, దాని అనుబంధ సంస్థలు మొత్తంగా రూ.52.5 కోట్లు, ఆర్సెలర్ మిట్టల్ డిజైన్, ఇంజనీరింగ్ సెంటర్, ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థలు సంయుక్తంగా రూ.130 కోట్లు ప్రుడెంట్‌కు విరాళంగా ఇచ్చాయి.

కీవ్‌పై కొనసాగుతున్న దాడులు

కీవ్: లక్షలాది మంది ఉక్రేనియన్లను అంధకారంలోకి నెడుతూ విద్యుత్, నీటి వనరులే లక్ష్యంగా వైమానిక దాడులను రష్యా మంగళవారం మరింత ఉధృతం చేసింది. కీవ్‌తోపాటు పశ్చిమంగా ఉన్న ఝిటోమిర్ నగరంపైనా దాడులు పెరిగాయి. సైనిక స్థావరాలు, పరిశ్రమలు, రెండున్నర లక్షల జనాభాతో నిండిన ఝిటోమిర్‌పై దాడుల నేపథ్యంలో నగరమంతా విద్యుత్, నీటి సరఫరా నిలిచిపోయింది. ఇంధనాగారం ధ్వంసమైంది. కీవ్‌పై దాడిలో ఇద్దరు మరణించారు. డినిప్రో సిటీపైనా క్షిపణి దాడులు ఎక్కువయ్యాయి. ఇప్పటికే రష్యా అధీనంలోకి వెళ్లిన జపొరిజియా ప్రాంతంపైనా రష్యా డ్రోన్ దాడులు ఆగకపోవడం గమనార్హం. 'యుద్ధంలో సైనిక ఓటమిని తట్టుకోలేక రష్యా కొత్తగా ఉగ్రతాండవం చేస్తోంది. ఎందుకింత ఉగ్రరూపం? మాపై ఒత్తిడి పెంచాలనా ? యూరప్ మీదనా? లేక మొత్తం ప్రపంచం మీదనా?' అని జెలెన్‌స్కీ ట్వీట్‌లో మండిపడ్డారు.



అపార్టుమెంట్‌పై కూలిన రష్యా బాంబర్..

15 మంది దుర్మరణం

మాస్కో: అపార్టుమెంట్ భవనంపై యుద్ధ విమానం కూలిన ఘటనలో 15 మంది చనిపోయారు. రష్యాలోని అజోవ్ సముద్ర తీర నగరం యెయెస్క్‌లో సోమవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. యెయెస్క్‌లోని వైమానిక స్థావరం నుంచి బయలుదేరిన ఎస్‌యు-34 రకం శిక్షణ విమానం ఒక ఇంజిన్‌లో మంటలు చెలరేగి 9 అంతస్తులున్న ఓ అపార్టుమెంట్ భవనంపై కూలింది. దీంతో, బాంబర్ విమానంలోని వేలాది లీటర్ల ఆయిల్ ఒక్కసారిగా భగ్గుమని మండిపోయింది. అపార్టుమెంట్‌లోని కొన్ని అంతస్తులు మంటల్లో చిక్కుకున్నాయి. మంటల నుంచి తప్పించుకునేందుకు ప్రాణభయంతో పైనుంచి దూకి ముగ్గురు చనిపోగా, మిగతా వారు అగ్నికి ఆహుతయ్యారని అధికారులు తెలిపారు. విమానంలోని ఇద్దరు పైలట్లు ప్రమాదానికి ముందే దూకి తప్పించుకున్నారు. మొత్తం 15 మంది మృతుల్లో ముగ్గురు చిన్నారులున్నారు. క్షతగాత్రులైన మరో 19 మందిని ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే అపార్టుమెంట్‌లోని 500 మంది నివాసితులను అక్కడి నుంచి ఖాళీ చేయించారు. అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటలపాటు శ్రమించి, మంటలను అదుపులోకి తెచ్చారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా వైమానిక దళం వాడే విమానాల్లో అధునాతన సెన్సర్లు, ఆయుధ వ్యవస్థలున్న ఎస్-34 సూపర్‌సోనిక్ ట్విన్ ఇంజిన్ బాంబర్ ముఖ్యమైంది.

ఇంత భారీ కౌంటరా?

గుజరాత్ సర్కారుకు సుప్రీం చీవాట్లు

న్యూఢిల్లీ: ''బిల్కిస్ బానో కేసులో 11 మంది జీవిత ఖైదీల విడుదలపై మీరు దాఖలు చేసిన అఫిడవిట్ పరిమాణంలో భారీగా ఉంది. కానీ మేం కోరిన పలు అంశాలకు సంబంధించిన వివరాలు మాత్రం లేవు. బుర్ర పెట్టి ఆలోచించరా?'' అంటూ గుజరాత్ సర్కారుకు సుప్రీంకోర్టు తలంటింది. సత్ప్రవర్తన పేరిట వారిని విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగీ సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. అఫిడవిట్‌ను గత తీర్పుల ఉటంకింపుతో నింపేయడాన్ని తొలిసారిగా చూస్తున్నామంటూ తప్పుబట్టింది. వాదులు, ప్రతివాదులతో సంబంధం లేకుండా విడుదలను ఇతర వ్యక్తులు సవాలు చేయజాలరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. పిటిషనర్లకు స్పందన దాఖలు చేసేందుకు గడువిస్తూ విచారణను నవంబర్ 29కి ధర్మాసనం వాయిదా వేసింది. ఖైదీల విడుదలను గుజరాత్ ప్రభుత్వం సమర్థించుకోవడం తెలిసిందే.


'జయ మరణం'లో శశికళ పాత్రపై దర్యాప్తు!



సాక్షి, చెన్నై: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత మరణం తాలూకు అనుమానాల నివృత్తి కోసం ఆమె నెచ్చెలి శశికళపై ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశముంది. మాజీ ఆరోగ్య మంత్రి సి.విజయభాస్కర్, శశికళ బంధువు, వైద్యుడు కేఎస్ శివకుమార్, ఆరోగ్యశాఖ మాజీ కార్యదర్శి జె.రాధాకృష్ణన్‌లపై కూడా దర్యాప్తు చేయాలని జస్టిస్ ఎ.ఆర్ముగస్వామి విచారణ కమిషన్ సిఫార్సు చేసింది. ఈ నివేదికను మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీంతో నాటి అన్నాడీఎంకే ప్రభుత్వ ప్రధాన సలహాదారు రామమోహనరావు, ఇద్దరు వైద్యులపైనా విచారణ జరిపించాలని కమిషన్ సూచించింది. జయలలితకు చికిత్స జరిగిన అపోలో ఆస్పత్రి చైర్మన్‌ను విచారించాలా వద్దా అనేది ప్రభుత్వ నిర్ణయమని కమిషన్ అభిప్రాయపడింది. ఆరోగ్యంగా ఉన్న జయలలిత హఠాత్తుగా 2016 సెప్టెంబర్ 22న ఎందుకు ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. దీనిపై, ఆమెకు చేసిన చికిత్సలపై, మరణంపై నిజానిజాలను నిర్ధారించేందుకు ఆర్ముగస్వామి కమిషన్ ఏర్పాటవడం తెల్సిందే. శశికళతో సత్సంబంధాలు నెరిపిన జయలలిత 2011 నుంచి ఏడాది పాటు ఆమెను తన నివాసం నుంచి గెంటేసిన అంశాన్ని కమిషన్ ప్రత్యేకంగా పేర్కొంది. ''రాజకీయాల్లో కలగజేసుకోనని శశికళ లిఖితపూర్వక హామీ ఇచ్చాకే ఆమెను జయ మళ్లీ చేరదీశారు. జయ హృదయంలో సమస్య ఉందని, ఆమెకు శస్త్రచికిత్స అత్యావశ్యకమని అమెరికాకు చెందిన కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ శమీన్ శర్మ జయను ఆస్పత్రిలో 2016 నవంబర్ 25న హెచ్చరించారు. కానీ, అంత ఇబ్బందేమీ లేదని బ్రిటన్‌కు చెందిన మరో డాక్టర్ వారించారు. ఆమెకు యాంజియోగ్రఫీ కూడా చేయకుండా 'ఇంకెవరో' అడ్డుకున్నారు. ఈ అంశంలో అపోలో ఆస్పత్రి డాక్టర్ హస్తముంది. ఈ మొత్తం వ్యవహారంలో అందరు డాక్టర్లతో నేరుగా సంప్రదింపులు జరిపిన ఒకే ఒక వ్యక్తి శశికళ' అని నివేదిక బహిర్గతంచేసింది. ఆగస్ట్ 27న ప్యానెల్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం విదితమే.

రబీ పంటల ఎంఎస్పీ పెంచిన కేంద్రం

- ఎర్ర కందిపప్పునకు అత్యధికంగా రూ.500
- గోధుమలకు రూ.110 పెరిగిన మద్దతు ధర
- ఎంఎస్పీ పెంపుతో సాగుకు మరింత దన్ను: ప్రధాని మోదీ



పంట	ఎంఎస్పీ పెంపు(రూ.లో)
గోధుమలు	110
బార్లీ	100
శెనగలు	105
ఎర్ర కందిపప్పు	500
ఆవాలు	400
కుసుమ	209

సాక్షి, న్యూఢిల్లీ: దీపావళి పండుగ వేళ కేంద్ర ప్రభుత్వం అన్నదాతకు శుభవార్త తెలిపింది. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి గోధుమ, ఎర్ర కందులు సహా 6 రకాల పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)లను 9 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా గోధుమలపై మద్దతు ధరను 5.45 శాతం అంటే రూ.110 పెంచింది. ప్రస్తుతం గోధుమ క్వింటాల్ ధర రూ.2,015 ఉండగా, కేంద్రం తాజా నిర్ణయంతో రూ.2,125కు చేరనుంది. గతంలో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో రైతులకు ఊరట లభించడంతో పాటు.. రైతులకు మరింత ఆర్థిక ప్రోత్సాహం ఇచ్చేందుకు, విస్తీర్ణాన్ని పెంచేలా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. కాగా, గత రెండేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది గోధుమల హోల్‌సేల్, రిటైల్ ధరలు పెరగడం అసాధారణమేమీ కాదని ఆహార శాఖ కార్యదర్శి సుధాన్షు పాండే అన్నారు. అవసరమైనప్పుడు ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని చెప్పారు. కనీస మద్దతు ధర పెంపుతో వ్యవసాయ రంగం మరింత ఊతం లభిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. దేశాభివృద్ధిలో రైతులు కీలక భాగస్వాములని ఆయన చెప్పారు.

పప్పుధాన్యాలకు ప్రోత్సాహం..

పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించేలా ఈ సీజన్‌లో పప్పుధాన్యాల మద్దతు ధరను కేంద్రం గరిష్టంగా పెంచింది. గత కొన్నేళ్లుగా పప్పుధాన్యాల ధరలు దేశీయంగా అనూహ్యంగా పెరగడం, దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతున్న నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు తీసుకుంది. ముఖ్యంగా ఎర్ర కంది పప్పు ధరను ఏకంగా రూ.500 మేర పెంచగా, ఆవాల ధరను రూ.400 మేర పెంచింది. దీంతో ఎర్ర కందిపప్పు ధర రూ.5,500 నుంచి రూ.6,000కు, ఆవాల ధర రూ.5,050 నుంచి రూ.5,450కి పెరిగింది. బార్లీ మద్దతు ధర రూ.1,635 నుంచి రూ.1,735కు పెరగ్గా, శనగల ధర రూ.5,230 నుంచి రూ.5,335కు పెరిగింది. అదేవిధంగా, కుసుమల ధర రూ.5,441 నుంచి రూ.5,650కు పెరిగినట్లయింది. 2023-24 రబీ సీజన్‌లో రైతులకు సహేతుకమైన, న్యాయమైన రీతిలో గిట్టుబాటు ధర లభించేందుకు ఈ మేరకు కనీస మద్దతు ధరను పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది. 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు ఉండేలా కనీస మద్దతు ధరను నిర్ణయించినట్లు పేర్కొంది.



ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే

సునాక్‌దే పైచేయి

- ప్రధాని ట్రస్‌పై పెరిగిన వ్యతిరేకత
- యూగవ్ గ్యాలప్ సర్వేలో వెల్లడి

లండన్: బ్రిటన్ ప్రధానమంత్రి పదవికి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ప్రధాని లిజ్ ట్రస్‌పై భారత సంతతి మాజీ ఆర్థిక మంత్రి రిషి సునాక్ విజయం ఖాయమని ఓ సర్వేలో వెల్లడైంది. యూగవ్ తాజాగా నిర్వహించిన గ్యాలప్ పోల్‌లో అధికార కన్జర్వేటివ్ పార్టీ సభ్యుల్లో కేవలం 25 శాతం మంది మాత్రమే మళ్లీ ట్రస్‌కు ఓటేస్తామన్నారు. రిషి వైపు 55% మంది మొగ్గు చూపారు. పన్నుల్లో కోత పెట్టి, వివాదాస్పదం కావడంతో వాటిని ఉపసంహరించుకున్న లిజ్‌ట్రస్ నాయకత్వంపై విమర్శలు చెలరేగుతున్న వేళ ఈ సర్వే చేపట్టారు. ప్రధాని పదవికి, పార్టీ నాయకత్వ పదవికి రాజీనామా చేయాలని 55 శాతం మంది కోరుకుంటుండగా, కొనసాగాలని 38% మంది మాత్రమే కోరుకోవడం గమనార్హం. పార్టీ గేట్ కుంభకోణంతో తప్పుకున్న మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను సరైన ప్రత్యామ్నాయంగా 63 శాతం మంది పేర్కొనడం విశేషం. ప్రధానిగా జాన్సన్‌ను 32%, రిషిని 23 శాతం బలపరిచారు.

తప్పులు చేశాం..క్షమించండి: లిజ్ ట్రస్

ప్రధాని లిజ్‌ట్రస్ తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదం కావడంతోపాటు, దేశ ఆర్థిక వ్యవస్థను మరింత ఇబ్బందుల్లో నెట్టాయి. సొంత పార్టీ సభ్యుల నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆమె తొలిసారిగా స్పందించారు. 'మేం తప్పులు చేశామని గుర్తించాను. ఆ తప్పిదాలకు నన్ను క్షమించండి. ఇప్పటికే ఆ తప్పులను సరిచేసుకున్నాను. కొత్త ఆర్థిక మంత్రిని నియమించాను. ఆర్థిక స్థిరత్వం, క్రమశిక్షణను పునరుద్ధరించాం'అని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకు పార్టీ నేతగా కొనసాగుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 24వ తేదీలోగా ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు పాలక కన్జర్వేటివ్ పార్టీకి చెందిన 100 మంది సభ్యులు యోచిస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆమె పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

క్లుప్తంగా

గ్రామాల్లో ప్రభుత్వ సేవలు భేష్

టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్ నవిక కుమార్



వణుకూరు సచివాలయంలో టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్ నవిక కుమార్

పెనమలూరు: గ్రామాల్లో ప్రభుత్వ సేవలు బాగున్నాయని టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్ నవిక కుమార్ అన్నారు. రాష్ట్ర గ్రామ/వార్డు సచివాలయాల అడిషనల్ డైరెక్టర్ రామనాథ రెడ్డితో కలిసి ఆయన కృష్ణాజిల్లా పెనమలూరు మండలం వణుకూరు గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆర్బీకేలో రైతులకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సేవలు పరిశీలించారు. సచివాలయంలో ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, పరిపాలన పరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో చేసిన సంస్కరణలపై నవిక కుమార్ కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీతాశర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నడిపల్లికి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్



సర్టిఫికెట్‌ను నడిపల్లికి అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

పెనమలూరు: కృష్ణాజిల్లా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రకళా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నడిపల్లి రవికుమార్‌కు బ్రేవో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ వరించింది. జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా పెన్సిల్ మొనపై 2.5 సెంటీమీటర్ల ఎత్తు, ఐదు మిల్లీ మీటర్ల వెడల్పు కొలతలతో జాతిపిత రూపాన్ని చెక్కారు. దీనికి గానూ యూకేకు చెందిన బ్రేవో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రకటించింది. సంబంధిత సర్టిఫికెట్‌ను ఉపాధ్యాయుడు నడిపల్లి రవికుమార్‌కు మచిలీపట్నంలో కలెక్టర్ రంజిత్‌బాషా సోమవారం అందజేశారు. వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ గ్రహీత నడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ.. తన చిత్రకళకు ఇప్పటివరకు 20 ప్రపంచ రికార్డులు వచ్చాయన్నారు.

పిండ మార్పిడి ద్వారా గిర్ జాతి కోడెదూడ జననం

పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి



గిర్ జాతి కోడెదూడను పరిశీలిస్తున్న జేడీ బేబిరాణి, సిబ్బంది

నాగులుప్పలపాడు: పిండ మార్పిడి ప్రక్రియ ద్వారా ఒంగోలు జాతి ఆవుకు గిర్ జాతి కోడెదూడను పుట్టించడంలో ప్రకాశం జిల్లా పశువైద్యులు విజయం సాధించారని పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి తెలిపారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ల్యాబ్‌లో తయారైన మేలు రకపు గిర్‌జాతి ఆవు పిండాన్ని ప్రకాశం జిల్లా చదలవాడ పశుక్షేత్రంలో ఉన్న ఒంగోలు జాతి ఆవు గర్భంలోకి పిండ మార్పిడి ప్రక్రియ ద్వారా ఈ ఏడాది జనవరి 11వ తేదీన పశువైద్యులు ప్రవేశపెట్టారన్నారు. ఆ ఒంగోలు జాతి ఆవుకు మంగళవారం ఆరోగ్యవంతమైన గిర్ జాతి కోడెదూడ జన్మించిందని తెలిపారు.

పోస్టల్ ద్వారా అమ్మవారి ప్రసాదాలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాల్లో అమ్మవారికి నిర్వహించిన విశేష ఆర్జిత సేవల్లో పరోక్షంగా పాల్గొన్న ఉభయ దాతలకు దేవస్థానం ప్రసాదాలను పోస్టల్ ద్వారా పంపిణీ చేస్తోంది. దసరా ఉత్సవాల్లో పది రోజుల పాటు అమ్మవారికి విశేష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణంతో పాటు చండీహోమాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న భక్తులు ఆన్‌లైన్ ద్వారా దేవస్థానానికి నిర్ణీత ఉభయం చెల్లించి పూజలు జరిపించుకున్నారు. ఆయా పూజలు జరిపించుకున్న ఉభయదాతలకు దేవస్థానం చీర, పంచె, అమ్మవారి చిత్రపటంతో పాటు అమ్మవారి డాలర్, కంకణాలను ఆలయ అధికారులు పోస్టల్ ద్వారా పంపిణీ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ సస్పెన్షన్

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కృష్ణా జిల్లాకు చెందిన మాజీ శాసనసభ్యుడు డీవై దాస్‌ను వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

ఆవ భూముల్లో ఇళ్ల పట్టాలకు లైన్ క్లియర్

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల మంజూరుకు హైకోర్టు ఆమోదం

- పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వొద్దంటూ దాఖలైన వ్యాజ్యాలు కొట్టివేత
- సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలన్న అభ్యర్థన తిరస్కృతి
- దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదలకు నివాస వసతి
- స్టే వల్ల 40 వేల మందికి పట్టాలు ఆగిపోయాయి
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ
- ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం
- స్టే ఎత్తివేత.. పిటిషన్ల కొట్టివేత



సాక్షి, అమరావతి: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ, రాజానగరం మండలాల్లోని ఆవ భూముల్లో ఇళ్ల పట్టాల మంజూరుకు లైన్ క్లియర్ అయింది. నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఆవ భూముల్లో ఇళ్ల పట్టాల మంజూరుకు హైకోర్టు ఆమోదం తెలిపింది. ఈ భూములను ఇళ్ల స్థలాలకు కేటాయించకుండా ప్రభుత్వాన్ని ఆదేశించాలని, ఆ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, వీటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కొట్టేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు భారీ స్థాయిలో నివాస వసతి కల్పిస్తోందని, అందులో భాగంగానే పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామని, స్టే వల్ల 40 వేల మందికి పట్టాల మంజూరు ఆగిపోయిందన్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనతో హైకోర్టు ఏకీభవించింది. ఇళ్ల పట్టాల మంజూరుపై విధించిన స్టేను ఎత్తివేసింది. ఆవ భూముల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయన్న పిటిషనర్ల వాదనను సైతం హైకోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది.

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎ.శ్రీనివాసరావు 2020లో దాఖలు చేసిన ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ జరిపిన అప్పటి సీజే నేతృత్వంలోని ధర్మాసనం.. ఆవ భూములను పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్ల స్థలాలకు కేటాయించవద్దని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ అదే ఏడాది ఆగస్టులో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అంశంపై మరిన్ని వ్యాజ్యాలు కూడా దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది.

రాక్షసుల్లా ప్రజా సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారు

ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రజా సంక్షేమాన్ని ఆశించి పూర్వ కాలంలో మహర్షులు చేసిన యాగాలను రాక్షసులు హోమగుండంలో రక్త మాంసాలు వేసి అడ్డుకున్నట్లుగానే ఇప్పుడు ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజా ప్రయోజన వ్యాజ్యాల పేరుతో కొందరు అడ్డుకుంటున్నారని తెలిపారు. భూ సేకరణ చట్ట నిబంధనలకు లోబడే సంప్రదింపుల ద్వారా భూములు తీసుకున్నామన్నారు. చట్టం నిర్దేశించిన దానికంటే ఎక్కువే పరిహారం చెల్లించామని వివరించారు. భూములు ఇచ్చిన వారికి, తీసుకుంటున్న వారికి లేని అభ్యంతరం పిటిషనర్లకు ఎందుకని అన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది డీవీఎస్ఎస్ ప్రసాద్‌బాబు వాదనలు వినిపిస్తూ.. ముంపునకు గురయ్యే ఆవ భూముల్లో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తోందని, నిర్దేశించిన దానికంటే ఎక్కువ చెల్లించారని, ఇదో పెద్ద కుంభకోణమని, అందుకే సీబీఐ దర్యాప్తు కోరుతున్నామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ ఏడాది సెప్టెంబర్ 1న తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం తీర్పు వెలువరించింది. ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. భూములు ఇచ్చిన వారికి, తీసుకుంటున్న వారికి లేని అభ్యంతరాలను పిటిషనర్లు లేవనెత్తడాన్ని తప్పుపట్టింది. ఆవ భూముల కొనుగోళ్లలో రూ.700 కోట్ల మేర అక్రమాలు జరిగాయన్న పిటిషనర్ల వాదనను సైతం ధర్మాసనం తోసిపుచ్చింది.

కేరళ బృందం మిర్చి యార్డు సందర్శన

కొరిటిపాడు(గుంటూరు): కేరళ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ బృందం గుంటూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డును మంగళవారం సందర్శించింది. బృందంలోని సభ్యులు కమిషనర్ డాక్టర్ డి.సజిత్‌బాబు, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజీబ్‌కుమార్ పట్జోషి, కేరళ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రైవేటు సెక్రటరీ ప్రదీప్‌కుమార్ యార్డును సందర్శించిన వారిలో ఉన్నారు. వారికి గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి సాదర స్వాగతం పలికారు. మిర్చి యార్డులోని మిర్చి కమీషన్ షాపులను కేరళ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులు పరిశీలించారు. యార్డు పనితీరు తదితర అంశాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం ఛాంబర్‌లో కేరళ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ.. ప్రపంచంలోని సుమారు 15 దేశాలకు గుంటూరు నుంచి మిర్చి ఎగుమతి చేస్తున్నామన్నారు. కేరళ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం, అనంతవరప్పాడు గ్రామంలో మిర్చి పంట సాగును బృందం పరిశీలించింది. ఆర్డీవో ప్రభాకరరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారిణి పద్మశ్రీ, ఉద్యానశాఖ అధికారి ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.



కేరళ రాష్ట్ర పౌర సరఫరాల బృందంతో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం

రైతు భరోసా కేంద్రాల పనితీరు అత్యద్భుతం

- తమిళనాడు రాష్ట్ర సహకార శాఖ అధికారులు



ఆర్‌బీకేను పరిశీలించిన తమిళనాడు అధికారులు

పెనుగంచిప్రోలు (జగ్గయ్యపేట): ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల పనితీరు అత్యద్భుతంగా ఉందని తమిళనాడు రాష్ట్ర సహకార శాఖ అడిషనల్ రిజిస్ట్రార్ ఎం.మురుగన్, జాయింట్ రిజిస్ట్రార్ కేసీ రవిచంద్రన్ ప్రశంసించారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో ఆర్బీకేల పనితీరును వారు పరిశీలించారు. ముందుగా స్థానిక ప్రాథమిక సహకార పరపతి సంఘాన్ని పరిశీలించి రుణాల పంపిణీ, డిపాజిట్లు, సంఘం పనితీరు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల వలన రైతులకు అన్ని రకాల సేవలు సత్వరం అందుతున్నాయని అభినందించారు. ఆర్బీకేల ద్వారా ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయడంతో పాటు రైతులు నష్టపోతే పరిహారం వెంటనే అందించే ఏర్పాట్లు భేషుగ్గా ఉన్నాయన్నారు. తమిళనాడులోనూ ఆర్బీకేల ప్రక్రియ అమలయ్యేలా సూచనలు చేస్తామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా సహకార శాఖ అధికారి సీహెచ్ శైలజ, సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ పి.కిరణ్‌కుమార్, ఆప్కాబ్ ఏజీఎం వి.వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు మెరుగు పరచండి



మాట్లాడుతున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ శరద్‌కుమార్ శ్రీవాస్తవ, చిత్రంలో ఎంపీలు

- ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌కు ఎంపీల విజ్ఞప్తి
- వాల్తేర్ డివిజన్ కమిటీ చైర్మన్‌గా చంద్రశేఖర్ సాహూ ఎన్నిక

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల సౌకర్యాలు మెరుగు పరచాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ (ఇన్‌చార్జి) శరద్‌కుమార్ శ్రీవాస్తవకు పలువురు ఎంపీలు విజ్ఞప్తి చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలోని రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో డివిజనల్ కమిటీ సమావేశం మంగళవారం విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో జరిగింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది ఎంపీలు హాజరయ్యారు. ఈ కమిటీకి చైర్మన్‌గా బ్రహ్మపూర్‌కు చెందిన చంద్రశేఖర్ సాహూ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎంపీలు జీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ప్రయాణికుల సౌకర్యాల మెరుగు, పలు హాల్ట్‌లు, రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంపుదల, గమ్య స్థానాల పొడిగింపు వంటి వాటిపై వినతి పత్రాలు అందజేశారు. డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జీఎం, వాల్తేర్ డీఆర్ఎంలను అభినందించారు. ఈ సమావేశంలో ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ(విశాఖపట్నం), భీశెట్టి సత్యవతి(అనకాపల్లి), గొడ్డేటి మాధవి(అరకు),బెల్లాన చంద్రశేఖర్(విజయనగరం), కె.రామ్మోహన నాయుడు(శ్రీకాకుళం), రమేష్‌చంద్ర(నవరంగ్‌పూర్), సప్తగిరి శంకర్ ఉలకా(కోరాపుట్), దీపక్‌బాజీ(బస్తర్ ఎంపీ ప్రతినిధి) హాజరయ్యారు. వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి, ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్‌గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్) పాల్గొన్నారు.

ఏయూతో ఇథియోపియా వర్సిటీ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇథియోపియాకు చెందిన వోల్కైట్ యూనివర్సిటీ ఆఫ్ ఇథియోపియా అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో ఒప్పంద పత్రాలపై మంగళవారం సంతకాలు చేశారు. ఏయూ విద్య విభాగంతో కలిసి పనిచేసే దిశగా ఒప్పందం చేసుకున్నారు. స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం, సంయుక్తంగా పరిశోధనల నిర్వహణ, సదస్సులు, వర్క్‌షాప్‌లు, విదేశీ విద్యార్థులకు విద్య అవకాశాల కల్పన తదితర అంశాలలో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు పాల్గొన్నారు.

సికింద్రాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా సికింద్రాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. 07479 నంబరు ప్రత్యేక రైలు ఈ నెల 24, 31 తేదీల్లో రాత్రి 8.25 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 5.35 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07480 నంబరుతో ఈ నెల 25, నవంబర్ ఒకటో తేదీ రాత్రి 10.30 గంటలకు కటక్‌లో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 6.50 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళంరోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్డు, భువనేశ్వర్ స్టేషన్లలో ఈ రైళ్లు ఆగుతాయి.

బాలికపై లైంగికదాడి కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్/ విజయవాడ లీగల్: బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని మంగళవారం తీర్పు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వైఎస్సార్ కాలనీలో నివసించే 13 ఏళ్ల బాలికపై అదే ప్రాంతానికి చెందిన సంగేపు నవీన్ (23) 2019 సెప్టెంబర్ 16వ తేదీన లైంగిక దాడి చేశాడు. ఘటనపై విజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పరారీలో ఉన్న నిందితుడిని నాలుగు రోజుల తరువాత పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారాయణ రెడ్డి బాధితురాలి తరఫున కోర్టులో వాదనలు వినిపించారు. 15 మంది సాక్షులను విచారించారు. విచారణలో నేరం రుజువు కావడంతో నవీన్‌కు కఠినకారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. బాధిత బాలికకు రూ.4 లక్షల నష్టపరిహారం వచ్చేలా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీని ఆదేశించారు.

సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం, సీబీఐ కౌంటర్లు

వైఎస్ వివేకా హత్య కేసు బదిలీ చేయాలన్న పిటిషన్‌పై నేడు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ : మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ సునీత నర్రెడ్డి సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ ప్రభుత్వం, సీబీఐ కౌంటర్లు దాఖలు చేశాయి. జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారిల ధర్మాసనం ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వం, సీబీఐ మంగళవారం కౌంటర్లు దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యంపై బుధవారం సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.

పవన్, చంద్రబాబుది రాజకీయ వ్యభిచారం

751వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజకీయ వ్యభిచారానికి తెరలేపిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 751వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. పావలా పవన్ కల్యాణ్, చంద్రబాబు ముసుగులు నోవాటెల్ సాక్షిగా తొలగిపోయాయని విమర్శించారు. రాజకీయాలు అంటే మూడు పెళ్ళిళ్లు, మూడు రోజుల బంధం కాదన్నారు. రాష్ట్రాన్ని నిలువునా ముంచి సంపాదించిన అవినీతి సొమ్ముతో ప్యాకేజీలిచ్చి చంద్రబాబు వశపరచుకుంటుంటే..ఆ ట్రాప్‌లో పడి రాజకీయ వ్యభిచారిలా మారిన పవన్ రాష్ట్రంలో తిరిగే అర్హత కోల్పోయాడని మండిపడ్డారు. పవన్‌కు వంగవీటి మోహనరంగా పేరు ఉచ్చరించే అర్హత లేదన్నారు. పవన్ టెర్రరిస్టు కన్నా డేంజర్‌గా మారాడని ఆరోపించారు. బహుజన హక్కులను కాపాడుతూ సంక్షేమం, అభివృద్ధి చేరువ చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉంటామన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేతల హత్యాయత్నం

- పార్టీలోకి రాలేదన్న అక్కసుతోనే దాడి



ఆస్పత్రిలో హరికుమార్

నెల్లూరు(క్రైమ్): టీడీపీలో చేరాలని ఆహ్వానిస్తే తిరస్కరించాడన్న కక్షతో ఓ వైఎస్సార్‌సీపీ దళిత కార్యకర్తపై టీడీపీ నేతలు మారణాయుధాలతో దాడి చేసిన ఘటన నెల్లూరు గాంధీనగర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. నెల్లూరు బట్వాడిపాళెం సెంటర్‌కు చెందిన కుమార్ హరికుమార్ వైఎస్సార్‌సీపీ కార్యకర్త. ఆయన మంగళవారం రాత్రి నెల్లూరు గాంధీనగర్‌లోని రేష్మ హోటల్‌కు బిర్యానీ తినేందుకు వెళ్లారు. టీడీపీ నేతలు మాజీ కార్పొరేటర్ డిష్ పెంచలయ్య, మాజీ కార్పొరేటర్ రాజానాయుడు, జలదంకి సుధాకర్, బుజ్జిగాడు బిర్యానీ హోటల్ యజమాని రమేష్, సాబీర్‌ఖాన్ అక్కడ మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో రాజానాయుడు 'మా పార్టీలోకి రమ్మని రెండు సార్లు పిలిచాను నీవు ఎందుకు రాలేదు డ్రైవర్ నా...' అని అసభ్యకర పదజాలంతో దూషించి దాడి చేశారు. గాయపడిన హరికుమార్‌ను స్నేహితులు జీజీహెచ్‌కు, అక్కడి నుంచి అపోలో ఆస్పత్రికి తరలించారు.

హంసవాహనంపై పైడితల్లి విహారం



వనంగుడిలో పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన పైడితల్లి ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. తొలుత అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం మేళతాళాలతో పల్లకిలో ఊరేగింపుగా పెద్దచెరువు వద్దకు చేరుకున్న అమ్మవారు హంసవాహనంపై విహరించారు. నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

పవన్ కల్యాణ్‌పై మానవ హక్కుల కమిషన్‌లో కేసు

గుంతకల్లు రూరల్: వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖపట్నంలో చేపట్టిన గర్జన కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ప్రయత్నించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై జాతీయ మానవహక్కుల కమిషన్‌లో కేసు నమోదు అయినట్లు జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు డేరంగుల ఉదయ్ కిరణ్ తెలిపారు. మంగళవారం ఆయన అనంతపురం జిల్లా గుంతకల్లులో వివరాలు వెల్లడించారు. విశాఖ ఘటన ద్వారా రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చేందుకు ప్రయత్నించిన పవన్ కల్యాణ్, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌పై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కమిషన్ స్పందించి తమ ఫిర్యాదును విచారణకు స్వీకరించిందని తెలిపారు.

బాబు చేతిలో కీలుబొమ్మ పవన్

మంత్రి నారాయణస్వామి



సాక్షి ప్రతినిధి, తిరుపతి: చంద్రబాబు చేతిలో కీలుబొమ్మ పవన్‌కల్యాణ్ అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చెప్పారు. తిరుపతి జిల్లా లక్కలపూడిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవంతమైన విశాఖ గర్జనను చూసి ఓర్వలేక దాడులకు పాల్పడి, దిగుజారుడు రాజకీయాలు చేయడం మంచిది కాదని పేర్కొన్నారు. రాజకీయ పరి/జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల్ని, మంత్రులను చెప్పుతో కొడతామనడం నీచసంస్కృతికి అద్దం పడుతోందని చెప్పారు. రాజకీయ నాయకుడిగా ఎదగాలన్న వ్యక్తి పూలమాల వేసినా, చెప్పులతో కొట్టినా స్వీకరించాలన్నారు. పవన్‌కు దమ్ము, ధైర్యం ఉంటే 175 సీట్లకు ఒంటరిగా పోటీచేయాలని ఆయన సవాల్ విసిరారు.

మాజీ ఎమ్మెల్యే జేసీపై కేసు

- మరో 12 మందిపైనా నమోదు
- జూటూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి ఘటనలో..

తాడిపత్రి అర్బన్: అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం జూటూరు గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి ఘటనకు సంబంధించి టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డితో పాటు 13 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వి.ఎస్.కె.చైతన్య తెలిపారు. జేసీ వర్గీయుల దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎర్రగుడి రామ్మోహన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ప్రతాపరెడ్డి, సత్యనారాయణరెడ్డి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఎర్రగుడి రామ్మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిని కుట్రదారుగా పేర్కొన్నారు. జేసీతో పాటు ఎ.నారాయణరెడ్డి, జేసీ చిత్తరంజన్‌రెడ్డి, జేసీ శశిధర్‌రెడ్డి, కె.ఓబిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, దేవరాజు, ఎ.వరప్రసాద్‌రెడ్డి, కె.రామలింగారెడ్డి, వై.ఓబిరెడ్డి, మరొకరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఆర్బీకేల తరహాలో పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలు

పైలట్ ప్రాజెక్టుగా దేశవ్యాప్తంగా 864 కేంద్రాలు ప్రారంభం

- ఏపీలో 32 కేంద్రాలకు శ్రీకారం చుట్టిన కేంద్రం
- గ్రామ, బ్లాక్, జిల్లా స్థాయిల్లో విత్తనాల నుంచి ఎరువులు, యంత్ర పరికరాలు
- రైతులకు పంటల సాగు సలహాలు, విత్తన, ఎరువుల పరీక్షలు కూడా
- ఏపీ బాటలో కేంద్రం అడుగులు
- ఇప్పటికే రాష్ట్రంలో ఆర్బీకేల ద్వారా అందుబాటులో సేవలు



సాక్షి, అమరావతి: విత్తు నుంచి విక్రయం వరకు, పురుగుమందుల నుంచి యంత్ర పరికరాల వరకు రైతులకు రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఎన్నో సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే. రైతులకు అడుగడుగునా తోడుగా నిలవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గ్రామానికో ఆర్బీకే చొప్పున రాష్ట్రంలో ఒకేసారి 10,778 ఆర్బీకేలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వీటిలోని డిజిటల్ కియోస్క్‌ల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను బుక్ చేసుకున్న గంటల్లోనే రైతుల ముంగిటకు చేరుస్తున్నారు. ధాన్యంతో సహా పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్బీకేలు.. నీతి ఆయోగ్, భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్), వరల్డ్ బ్యాంక్, ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ప్రశంసలు అందుకున్నాయి. వివిధ దేశాలు, మన దేశంలోని వివిధ రాష్ట్రాలు సైతం ఆర్బీకేలను సందర్శించి వాటి సేవలను ప్రశంసిస్తున్నాయి. తమ రాష్ట్రాలు, దేశాల్లోనూ ఆర్బీకేలను ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పుడు ఆర్బీకేల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల (పీఎంకేఎస్‌కే)ను తీసుకొచ్చింది. గ్రామ స్థాయిలో రైతు సమస్యలన్నింటికీ ఒకే పరిష్కార కేంద్రంగా వీటిని తీర్చిదిద్దనుంది. తొలి దశలో అక్టోబర్ 17న 864 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఏపీలో 32 కేంద్రాలను ప్రారంభించారు.

గ్రామ, బ్లాక్, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు..

ఇటీవలే ప్రారంభించిన వన్ నేషన్–వన్ ఫెర్టిలైజర్ కింద భారత్ బ్రాండ్ పేరిట కంపెనీల రిటైల్ అవుట్‌లెట్ల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఏపీ స్ఫూర్తితో నీతి ఆయోగ్, కేంద్ర బృందాలిచ్చిన నివేదిక ఆధారంగా వీటిని బహుళ ప్రయోజనాలు అందించే పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. ఈ షాపులన్నింటినీ ఒకే డిజైన్, రంగులు ఉండేలా తీర్చిదిద్దనుంది. గ్రామ స్థాయిలో 150 చ.అ., బ్లాక్/ సబ్ డివిజన్ స్థాయిలో 200 చ.అ., జిల్లా స్థాయిలో 2 వేల చ.అ., విస్తీర్ణంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా 864 కేంద్రాలు ఏర్పాటు

దేశవ్యాప్తంగా అక్టోబర్ 17న 864 కేంద్రాలను ప్రారంభించగా.. వీటిలో 32 ఏపీలో ఉన్నాయి. వీటిలో గుంటూరులో 3, పశ్చిమ గోదావరి, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో రెండేసి చొప్పున, నెల్లూరు, వైఎస్సార్, చిత్తూరు, ఏలూరు, కర్నూలు, అనంతపురం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఎన్టీఆర్ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. ఇక దేశవ్యాప్తంగా మొదటి దశలో నవంబర్‌లో 37,460 జిల్లా స్థాయి, 2023 జనవరిలో 1,82,126 బ్లాక్ స్థాయి, ఫిబ్రవరిలో 1,16,049 గ్రామ స్థాయి కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్బీకేల తరహాలోనే సేవలు..

గ్రామ స్థాయి కేంద్రాల్లో పీవోఎస్, క్యూఆర్ కోడ్, స్కానింగ్ మిషన్లు, వ్యవసాయ మ్యాగజైన్లు, పంట సాగు ప్రణాళికలు, భూముల సారం–పంటల మ్యాపులు, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన చార్టులు ప్రదర్శిస్తారు. స్మార్ట్ టీవీలు, భూసార, విత్తన, పురుగుల మందుల పరీక్ష కిట్‌లు, కస్టమ్ హైరింగ్ సెంటర్లు, డ్రోన్లు అందుబాటులో ఉంచుతారు. ఇక జిల్లా స్థాయి, గ్రామ, బ్లాక్ కేంద్రాల్లో భూసార, విత్తన, పురుగుల మందులు, నీటి పరీక్ష కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తారు. ఏటీఎంలు, సోలార్ ఎనర్జీ ప్యానళ్లు, హెల్ప్ డెస్క్‌లు, కామన్ సర్వీస్ సెంటర్లు అందుబాటులో ఉంటాయి. రైతులకు సంప్రదాయ, జీవ, సేంద్రియ ఎరువులతోపాటు నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు, సూక్ష్మపోషకాలు వంటివాటిని రైతులకు సరఫరా చేస్తారు. యంత్ర పరికరాలు, డ్రోన్లు అందుబాటులో ఉంచుతారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తారు. స్మార్ట్ టీవీల ద్వారా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆదర్శ రైతుల విజయగాథలు, తాజా సాంకేతికత వివరాలు అందిస్తారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా కొత్త వినూత్న వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, తదితర వివరాలను పంచుకుంటారు.

అలజడి సృష్టించేందుకే ప్యాకేజీ రాజకీయాలు

- మంత్రి దాడిశెట్టి రాజా



తుని రూరల్: ప్రజలకు చేసే మంచిని, ప్రజల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఉన్న పరపతిని ఎదుర్కోలేక రాష్ట్రంలో కులాలు, మతాల మధ్య ఘర్షణలు సృష్టించేందుకు చంద్రబాబు, పవన్ ప్యాకేజీ రాజకీయాలు నడుపుతున్నారని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజమెత్తారు. కాకినాడ జిల్లా తుని మండలం టి.వెంకటాపురంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు టీడీపీని మరిచిపోయే స్థితిలో ఉన్నారని, ఆ విషయం ఇటీవల ఆ పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేలో కూడా తేలిపోయిందన్నారు. టీడీపీకి బలం సరిపోకపోవడంతో చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కు ప్యాకేజీ ఇచ్చి తోడు తెచ్చుకున్నారన్నారు. రాజకీయం చేద్దామన్న పవన్ తాజాగా ఏవిధంగా మాట్లాడారో చూశామని, చెప్పు బయటకు తీసి అసంబద్ధ ప్రేలాపనలు, వ్యక్తిగత విమర్శలు చేశారన్నారు. జగన్ ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేరని, ఇది తన శాసనం అని పవన్ అన్నారని గుర్తు చేశారు. పవన్ ఇలాంటి శాసనాలు ఎన్నో చేశారన్నారు. వైఎస్ జగన్ పాలన పట్ల ప్రజల్లో వెల్లువెత్తుతున్న స్పందన చూసి తట్టుకోలేక పథకం ప్రకారం చంద్రబాబు, పవన్ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

దేశీ ఆవు పాల ఉత్పత్తులు ఎంతో మేలు

తొలి ఆంధ్రా గో పుష్టి కేంద్రాన్ని ప్రారంభించిన సజ్జల



ఆంధ్రా గో పుష్టి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): అంతరించిపోతున్న దేశవాళీ జాతిఆవుల సంపదను వృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. దేశీ ఆవుల పాల ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. విజయవాడలోని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తొలి ఆంధ్రా గో పుష్టి కేంద్రాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో కలిసి సజ్జల మంగళవారం ప్రారంభించారు. సేంద్రీయ దేశీ ఆవు పాల (ఏ–2) ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ, అనుబంధ రంగాల్లో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా రైతులు తమ కాళ్లమీద తాము నిలబడుతున్నారని చెప్పారు. రైతుల ఆదాయం పెంచేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ దేశీ ఆవు జాతులను పరిరక్షించాలన్న సంకల్పంతోనే పెద్ద ఎత్తున రైతులకు ఆవులను ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ అవుట్ లెట్‌లు పెడతామని చెప్పారు. పశుసంవర్థక శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, డైరెక్టర్ అమరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి తీసుకొచ్చిన ఉత్పత్తులివే..

విజయవాడలో ప్రారంభించిన ఆంధ్రా గో పుష్టి కేంద్రం 27 రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటిలో ప్రధానంగా ఏ–2 పాలతో పాటు నెయ్యి, ఏ–2 పన్నీరు, పెరుగు, బాదం పాలు, గో సంజీవిని, వేదిక్ అగియారి, ఘనజీవామృతం బాల్స్, ఘనజీవామృతం పౌడర్, టూత్ పౌడర్, పంచగవ్య, పంచగవ్య దూప్, సోప్, గ్రితనాశ్య దూప్, అగరబత్తీలు, దూప్ కోన్స్, మస్కిటో కాయిల్స్, ఆక్సిజన్ పౌడర్, ఘన్వాటి, హెర్బల్ టూత్ పౌడర్, కుంకుమ, ఫ్లోర్ క్లీనర్, గోమూత్ర ఫినాయిల్, అమృతాది తైలం, సీడ్ బాల్స్, డిష్ వాష్, పేడపిడకలు (గోమయ దంగ్ డియాస్) ఉన్నాయి.

ఆ చెప్పు నీదా... నీ యజమానిదా...

- బాబు, పవన్ అధికారం కోసం ఏ గడ్డి అయినా తింటారు
- పవన్ బీజేపీతో పొత్తు.. బాబుతో సంసారం చేస్తున్నది వాస్తవం కాదా!
- మంగళగిరిలో జనసేనకు పార్టీ ఆఫీస్ ఎలా వచ్చింది.. ప్యాకేజీ కాదా!
- నువ్వు చూపించిన చెప్పు అయినా నీదేనా లేక బాబుదా?
- మంత్రి జోగి రమేష్ ఫైర్



సాక్షి, అమరావతి: ముసుగు దొంగలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిజ స్వరూపం విజయవాడలోని నోవాటెల్ హోటల్ వేదికగా బయటపడిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. బాబు ఆడమన్నట్టు ఆడే తోలుబొమ్మ పవన్ అని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్, చంద్రబాబు అధికారం కోసం ఏ గడ్డి అయినా తింటారని ధ్వజమెత్తారు. ఎప్పటి నుంచో తాము చంద్రబాబు, పవన్ ఒకటే అని చెబుతున్నామని.. వీరిద్దరి తాజా కలయికతో ప్రజల సందిగ్ధం కూడా తీరిపోయిందని అన్నారు. మంత్రి రమేష్ ఇంకా ఏమన్నారంటే..

ప్రజలు పవన్ తిత్తి తీస్తారు..

ప్యాకేజీ స్టార్ అంటే పవన్ కల్యాణ్ రెచ్చిపోతున్నారు. సినిమాల్లో ఏవిధంగా నటిస్తున్నారో, రాజకీయ జీవితంలో కూడా ముసుగు వీరుడిలా నటిస్తున్నారు. మంగళగిరిలో జనసేన కార్యాలయాన్ని ఎవరు ఇచ్చారు? ఎవరు కట్టించారు?. ప్యాకేజీలో భాగంగానే నీ ఆఫీసు వచ్చింది కదా. నువ్వు రెండుచోట్ల పోటీ చేస్తే.. రెండుచోట్లా ప్రజలు ఓడించారు. జనసేన అభ్యర్థి ఒక్క స్థానంలో గెలిచినా.. అతడు నిన్ను చెప్పుతో కొట్టేసి వెళ్లిపోయినా సిగ్గు రాలేదా? సినిమా డైలాగులు చెప్పడం కాదు. రెచ్చిపోయి మాట్లాడటం సరికాదు. మిడిమిడి జ్ఞానంతో, ప్యాకేజీలకు అమ్ముడుపోయే మీలాంటి వాళ్లకు ప్రజలు మళ్లీ 2024 ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతారు. ప్రజలు పవన్ తిత్తి తీయడం ఖాయం.

మేమైతే ఏకంగా చెప్పుతోనే కొడతాం..

పవన్ బీజేపీతో పొత్తు పెట్టుకుని బాబుతో సంసారం చేస్తున్నది వాస్తవం కాదా? పవన్.. నువ్వు చూపించిన ఆ చెప్పు అయినా నీదేనా? 2019 ఎన్నికల్లో మిమ్మల్ని చెప్పులు అరిగేలా, మీ చెంపలు చెళ్లుమనిపించేలా ప్రజలు కొట్టారు కదా? అయినా బుద్ధి, సిగ్గు రాలేదా? బాబు, పవన్‌లకు ఒక సిద్ధాంతం లేదు. విశాఖ రాజధాని కావాలంటూ ఉత్తరాంధ్ర ప్రజలంతా విశాఖ గర్జనలో తమ మనోగతాన్ని గొంతెత్తి చాటారు. ఆ గర్జన విజయవంతం కావడంతో కడుపు మంటతో మంత్రులపై కర్రలు, రాళ్లతో జనసేన సైన్యం అని చెప్పుకునే సైకోలను మా మీదకు ఉసిగొలిపావు. ఎంత మంది సైకోలు వచ్చినా మమ్మల్ని ఏమీ చేయలేరు. నీ భాషను రాష్ట్ర ప్రజలంతా చూశారు. నా కొడుకులు అని మాట్లాడుతున్నావే.. మేమూ మాట్లాడలేమా? మా నాయకుడు మాకు అలా నేర్పించలేదు. నువ్వు కేవలం చెప్పు మాత్రమే చూపించావు. మేమైతే చెప్పుతోనే కొడతాం..

పవన్‌కల్యాణ్‌కు మతి భ్రమించింది

- ఇలాంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరాడు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, నరసరావుపేట/చిలకలూరిపేట: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మతిభ్రమించి ఏదేదో మాట్లాడుతున్నాడని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై మంగళవారం మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలో స్పందించారు. ఆమె మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ లాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తులు రాజకీయాలకు పనికిరారని తెలిపారు. ఆయన్ను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్టుగా ఉంటుందనే విషయం జనసేన కార్యకర్తలకూ తెలిసిపోయిందని చెప్పారు. రెండు నియోజకవర్గాల్లో ఒకసారి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ పయనిస్తున్నాడని, ఇప్పటి వరకు ముసుగులో ఉన్న వారిద్దరు ఈరోజు ముసుగు తొలగించుకుని బయటకు వచ్చారని మంత్రి విమర్శించారు.

బాబూ.. ఏ ముఖం పెట్టుకుని పర్యటనలు?

అధికారంలో ఉండగా రైతులను ఏమాత్రం పట్టించుకోని టీడీపీ అధినేత చంద్రబాబు పల్నాడు జిల్లాలో పంట పొలాల పరిశీలనకు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వస్తారని రజిని ప్రశ్నించారు. అధిక వర్షాల వల్ల పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అన్నదాతలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదని గుర్తు చేశారు. బాబు, కరువు కవల పిల్లలని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఎంతో మేలు చేకూరుతున్నదని మంత్రి విడదల రజిని చెప్పారు.

పొలిటికల్ జోకర్ పవన్

- ఎప్పుడు ఏం మాట్లాడుతున్నాడో పవన్‌కైనా తెలుసా?
- 3 రాజధానులపై గతంలో ఏమన్నారో చెప్పాలి
- చంద్రబాబుతో స్నేహం చేయడం వల్ల మతిమరుపు జబ్బు వచ్చినట్టుంది
- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం



నెల్లూరు (సెంట్రల్): కొద్ది రోజులుగా పవన్ కల్యాణ్ విన్యాసాలు గమనిస్తే ఆయన పొలిటికల్ జోకర్ లాగా మారారని తెలుస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఏం మాట్లాడుతున్నారో, దేనిగురించి మాట్లాడుతున్నారో కనీసం ఆయనకన్నా తెలుసో, లేదో అని ఎద్దేవా చేశారు. చంద్రబాబుతో స్నేహం చేయడం వల్ల పవన్ పూర్తిగా మతిమరుపు వ్యాధి సోకినట్లు ప్రవర్తిస్తున్నారన్నారు. ప్యాకేజీల పవన్, చంద్రబాబులతో ఒరిగేది ఏమీ లేదన్నారు. వీరు పొలిటికల్ బ్రోకర్ల లాగా విన్యాసాలు చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖపట్నం రాజధానికి అనుకూలమా, లేక రాజధాని వద్దా అనే విషయం పవన్ కల్యాణ్ స్పష్టంగా చెప్పలేకపోతున్నారన్నారు. ఒకేచోట రాజధాని పెడితే ఒకే ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, వికేంద్రీకరణ జరగాలని గతంలో చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం ఒకే రాజధాని అమరావతిలో ఉండాలనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

అప్పుడు నారావారి రాజ్యాంగం తెలియదా?

రాష్ట్రంలో రాజ్యాంగం ఉందా... అని పవన్ అనడం సిగ్గుచేటుగా ఉందన్నారు. గతంలో వైఎస్ జగన్ 67 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ప్రతిపక్ష నాయకుడిగా విశాఖకు వెళితే ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రన్‌వేపైనే అరెస్టు చేయించిన నారావారి రాజ్యాంగం సంగతి తెలియదా.. అని నిలదీశారు. ప్రస్తుతం బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలవుతోంది కాబట్టే పవన్ స్వేచ్ఛ గా విశాఖలో పర్యటించారనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. చంద్రబాబు సుపుత్రుడిపై నమ్మకం లేకనే దత్తపుత్రుడిపై ఆశలు పెట్టుకున్నారన్నారు. ప్రస్తుతం దిక్కులేకుండా కుప్పం వైపు పరుగుతీస్తున్న చంద్రబాబును ఎలాగనా గద్దెనెక్కించాలని పవన్ ఆరాటపడుతున్నారని విమర్శించారు.

కలిసి కాపురం చేయడానికి ఇంత సీన్ సృష్టించాలా?

- ఇంతకాలం చంద్రబాబు, పవన్‌లది రహస్య ప్రేమ
- మేం బ్రహ్మనాయుడిని ఆదర్శంగా తీసుకుంటే.. నువ్వు బాబును తీసుకుంటావా?
- మాజీ మంత్రి కన్నబాబు ధ్వజం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లది ఇంతకాలం రహస్య ప్రేమ అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ధ్వజమెత్తారు. ఇద్దరూ కలిసి కాపురం చేయడానికి ఇంత సీన్ సృష్టించాలా అని నిలదీశారు. బాబును సీఎంగా చేయడానికే రాజకీయాలు చేస్తున్నారు తప్పించి పవన్ సీఎం కావడానికి చేయడం లేదనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. ఆయన మంగళవారం కాకినాడలో మీడియాతో మాట్లాడారు. వికేంద్రీకరణ, మూడు రాజధానులు ఉండాలి, ఎంతో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధించాలనే మహదాశయంతో విశాఖ గర్జన ద్వారా ప్రజలు వారి ఆకాంక్షలు ప్రతిబింబింపచేశారని చెప్పారు. శాంతిభద్రతల సమస్య వచ్చినప్పుడు, మంత్రులపై దాడి జరిగితే ఏ విధంగా స్పందించాలో తమ ప్రభుత్వం అదే చేసిందని పేర్కొన్నారు. కన్నబాబు ఇంకా ఏమన్నారంటే...

రాజకీయాలంటే సినిమాలు కాదు

విశాఖ గర్జన రోజున చంద్రబాబు అండ్ కో తప్పెటగుళ్లతో రాద్ధాంతం చేయడం మొదలుపెట్టారు. ఈ రోజు ఉదయం నుంచి టీవీల్లో పవన్ ఏకపాత్రాభినయం చూస్తున్నాం. సినిమాల్లో క్లైమాక్స్ సీన్ల మాదిరిగా చాలా ఉద్రేకంగా, హుషారుగా ఎదుటి వారంతా విలన్లు అన్నట్టుగా ఊహించుకుని పెద్ద సీన్ క్రియేట్ చేస్తున్నారు. పవన్ ఇదేమీ సినిమా కాదు. ఇది వాస్తవం. సినిమాలో మీ డైలాగులు చూస్తే చప్పట్లు కొడతాం. కానీ, వాస్తవంలో ఆ సీన్లు రిపీట్ చేస్తే చూస్తూ ఊరుకోం. సినిమాలో డైలాగులు కొట్టడం, మీరు చెయ్యి విసిరితే విలన్లు గాలిలో ఎగిరిపోవడం, డైరెక్టర్ కట్ చెబితే మీకు టచ్‌అప్‌లు ఇచ్చేవారు ఇక్కడ ఉండరని తెలుసుకోవాలి. కుమ్మేస్తా, పొడిచేస్తా... వంటి డైలాగులు సినిమాలో బాగుంటాయి. నిజజీవితంలో, రాజకీయాల్లో ఇవేమీ పనిచేయవు. ఇంతకాలం రహస్యంగా ప్రేమించుకుని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు పెద్దల ముందు ఆ ప్రేమను బహిరంగంగా వ్యక్తం చేయడానికి బయటకు వచ్చినట్టుగా కనిపిస్తోంది. ఇకముందు కలిసి కాపురం చేస్తున్నామని చెప్పడానికి ఇంత సీన్ క్రియేట్ చేయాలా? ఇప్పుడు కొత్తగా స్టేజీపైకి వచ్చి మరోసారి చెప్పాల్సిన అవసరం లేదు. మీ ముసుగు తొలగిపోయింది. 2014లో పార్టీ పెట్టి పోటీచేశారా? చివరకు ప్రజాశాంతి పార్టీ కూడా పోటీచేసింది. 2019 వచ్చేసరికి చంద్రబాబు అధికారంలో ఉండటంతో వ్యతిరేక ఓటు చీలిపోకుండా విడిగా పోటీచేసి బాబుకు దాసోహం అనిపించుకున్నారు. జనసేన పార్టీ బీ ఫారాలు తెలుగుదేశం అభ్యర్థుల చేతుల్లో పెట్టి మీకు నచ్చినవారి పేర్లు రాసుకోండని చెప్పిన చరిత్ర తరవాత బయటకు వచ్చింది. 2024కు వచ్చేసరికి కలిసే పోటీచేస్తారు. ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. ఇందుకోసం ఒక డయాస్ సృష్టించడం. వైఎస్సార్‌సీపీని విలన్‌గా చూపించి తానేమో పెద్ద హీరో మాదిరిగా అనుకోవడం సిగ్గుచేటు. వైఎస్సార్‌సీపీలో ఉన్న ఎమ్మెల్యేలంతా విలన్లు.. వారితో పోరాటం చేస్తోన్న హీరో పవన్ అన్నట్టు సీన్ క్రియేట్ చేస్తున్నారు. జనం మిమ్మల్ని రాజకీయాల్లో జీరో అనుకున్నారు. కాబట్టే ఆ ఫలితాలు వచ్చాయి. కానీ వైఎస్ జగన్‌ను రాష్ట్ర ప్రజలు హీరో అనుకున్నారు కాబట్టే 151 సీట్లు ఇచ్చారు.

కాపులకు బ్రహ్మనాయుడు.. నీకు చంద్రబాబు ఆదర్శం

కాపులంతా బ్రహ్మనాయుడును ఆదర్శంగా తీసుకోమని చెబుతున్నావ్. మేము బ్రహ్మనాయుడును ఆదర్శంగా తీసుకుంటాం.. నువ్వు మాత్రం చంద్రబాబును ఆదర్శంగా తీసుకో. ఈ రోజు బ్రహ్మనాయుడు చరిత్ర తెలిసిందా పవన్. 2019లోనే అధికారంలోకి వచ్చి తొలి కేబినెట్‌లోనే జగన్‌మోహన్‌రెడ్డి దళిత మహిళను హోం మంత్రిని చేశారు. మంత్రివర్గ మార్పుల్లో మాదిగ సామాజికవర్గం నుంచి మరో మహిళకు హోం మంత్రి పదవి ఇచ్చారు. కేబినెట్‌లో ఉన్న 25 మందిలో ఐదుగురు కాపులున్నారు.

నీ పక్కన కూర్చునే అర్హత కాపులకు లేదా?

రాజకీయాల్లోకి వచ్చిన దగ్గర నుంచి తిడుతూనే ఉన్నావు కదా. ఒక్కరోజు అయినా కాపుల సంక్షేమం కోసం మాట్లాడావా? కాపులను నేను రమ్మన్నానా, మద్దతు ఇవ్వమన్నానా.. అని ప్రశ్నించిన పెద్దమనిషి ఈ రోజు కాపుల కోసం అంటూ మాట్లాడటం సిగ్గు చేటు. తన పక్కన కుర్చీ వేసి కమ్మ సామాజికవర్గానికి చెందిన నాదెండ్ల మనోహర్‌ను కూర్చోబెట్టావే తప్ప ఏ ఒక్క కాపు నాయకుడిని అయినా కూర్చోబెట్టావా? మీ పక్కన కూర్చోబెట్టుకునేందుకు కాపులకు అర్హత లేదా? మీరు ఉపన్యాసాలు దంచుతుంటే చెవిలో పువ్వులు పెట్టుకుని మేము వినాలా. మీ పార్టీని ఎవరు నడిపిస్తున్నారో, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, నిర్మాత ఎవరెవరో అందరికీ తెలుసు. వంగవీటి రంగా హత్య గురించి మాట్లాడుతున్నారు. రంగా హత్య జరిగినప్పుడు నాటి హోం మంత్రి హరిరామజోగయ్య రాసిన పుస్తకంలో టీడీపీ అధినేత చంద్రబాబే సూత్రదారి అని రాసిన విషయం తెలియదా. అటువంటి చంద్రబాబు చంకలో కూర్చుని రంగా హత్యపై కన్నీరు కార్చడం చూస్తుంటే బాధేస్తోంది. ముద్రగడను కాపులు ఒక ఐకాన్‌గా చూస్తారు. ఆ కుటుంబాన్ని తప్పుగా మాట్లాడి హింసించి క్షోభకు గురిచేసిన చంద్రబాబు సర్కార్‌పై ఒక్క రోజైనా స్పందించి ఒక్క స్టేట్‌మెంట్ ఇచ్చావా?

ఎప్పుడూ చంద్రబాబు చంకలోనే..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు ఆయన చంకలోనే ఉన్నారు. పైకి పోరాటం, పటిమ అనే మాటలు తప్ప చంద్రబాబు కబంధ హస్తాల నుంచి బయటకు రాలేరని ప్రజలు భావిస్తున్నారు. లేకపోతే ఇంత రాజీపడిపోయి, సాగిలపడిపోయి చంద్రబాబు బూట్లు నాకే పరిస్థితికి ఎందుకు రావాలి? అంత చెంచాగిరి ఎందుకు చేయాలి? నాడు 33 వేల ఎకరాలు ఎవరి కోసం సేకరిస్తున్నారు? ఇది ఒక కులానికి రాజధానిలా ఉంది అని చెప్పిన మీరే ఇప్పుడు మాట మార్చారు. అసలు విశాఖపట్నంలో గర్జన జరిగిన రోజే మీరు అక్కడికి రావలసిన అవసరం ఏముంది? హోటల్‌కు ర్యాలీగా వెళ్లాల్సిన పని ఏమిటి? డైవర్షన్ పాలిటిక్స్ కదా? జోగి రమేష్, రోజాపై దాడి నేపథ్యంలో పోలీసులు మిమ్మల్ని నియంత్రిస్తే.. ఆ విషయాన్ని వదిలేసి కాపు ఎమ్మెల్యేలు అంటూ మమ్మల్ని బూతులు తిట్టడం ఏమిటి? దాడిచేసింది నీ పార్టీవాళ్లే. నీ మద్దతుదారులే. అక్కడ అల్లరి చేసింది మీరే.. ఒక మహిళా మంత్రిమీద, ఒక బీసీ మంత్రిమీద దాడిచేసినా కనీసం క్షమాపణ చెబుదామన్న జ్ఞానం కూడా లేదు. పైగా వైఎస్సార్‌సీపీలో ఉన్న కాపు నాయకులను బూతులు తిట్టడం. సంస్కారానికి సంబంధించిన విషయం ఇది.

పవన్ వ్యాఖ్యలపై నిరసన

- చిత్తూరు జిల్లాలో పలుచోట్ల దిష్టిబొమ్మల దహనం
- అలిపిరి పోలీసు స్టేషన్‌లో పవన్‌పై ఫిర్యాదు
- రాష్ట్రంలో అశాంతి సృష్టిస్తున్నారని వెల్లడి
- బాపట్ల జిల్లాలోనూ పవన్‌పై ఫిర్యాదు



తిరుపతిలో పవన్ కల్యాణ్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఉమ్మడి చిత్తూరు జిల్లావాసులు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం ఆందోళనలు జరిగాయి. పలుచోట్ల పవన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయం వద్ద విద్యార్థులు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. పుంగనూరు నియోజకవర్గం సోమలలో వైఎస్సార్‌సీపీ నేతలు పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. తిరుపతి అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో కాపు నాయకులు పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. కాపులను అవమానిస్తూ అభ్యంతరకర మాటలతో రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, తిరుపతి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు బాలిశెట్టి కిషోర్, మరికొందరు కాపు నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పవన్ వ్యాఖ్యలపై డీసీసీబీ చైర్పర్సన్ మొగసాల రెడ్డమ్మ, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తదితరులు పవన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

పవన్‌పై వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

చీరాల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులను అసభ్య పదజాలంతో దూషించిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను అరెస్ట్ చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, పార్టీ నేతలు మంగళవారం రాత్రి బాపట్ల జిల్లా చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ పి.శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో పవన్ ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేర్లి నాని, మున్సిపల్ కౌన్సిలర్ పి.సుబ్బయ్య, కో–ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్ పాల్గొన్నారు.


పార్వతీపురం మన్యం జిల్లా కిచ్చాడలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి బొట్టు పెట్టి ఆశీర్వదిస్తున్న సంక్షేమ పథక లబ్ధిదారు


అన్నమయ్య జిల్లా నేకనాపురంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

సంక్షేమాభివృద్ధికి సలాం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా కొనసాగింది. గ్రామ గ్రామానా ప్రజలు ఎదురేగి నాయకులకు స్వాగతం పలికారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఇంటికి వచ్చి సమస్యల గురించి అడుగుతుండటంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని సమస్యల పరిష్కారంపై నాయకులు అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీచేశారు.


ప్రకాశం జిల్లా దొడ్డవరప్పాడులో ప్రభుత్వ పథకాల లబ్ధి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు


పశ్చిమ గోదావరి జిల్లా కొత్తోటలో పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

పీహెచ్‌సీల్లో విజిలెన్స్ తనిఖీలు

సాక్షి, అమరావతి: విజిలెన్స్– ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాష్ట్రంలోని 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మౌలిక వసతులు, మందులు, మెడికల్ కిట్లు, వైద్య పరికరాలు పరిశీలించారు. కొన్ని ఆస్పత్రుల్లో రికార్డుల్లో చూపించిన మందులకు, రోగులకు అందుబాటులో ఉంచిన మందులకు పొంతన లేదని గుర్తించారు. డెంగీ పరీక్ష కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, పాము కాటుకు గురయ్యేవారికి వేసే యాంటీ వీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో లేవని గుర్తించారు. రోగులకు ల్యాబరేటరీలో సరైన వైద్య పరీక్షలు చేయడంలేదని నిర్ధారించారు. అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నారు.

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో న్యూమాటిక్ డోర్లు

సాక్షి, అమరావతి: ప్రయాణికుల భద్రత కోసం ఆర్టీసీ మరిన్ని మెరుగైన చర్యలు తీసుకుంటున్నది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 'న్యూమాటిక్ డోర్లు' ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా రెండు బస్సుల్లో ఏర్పాటు చేసిన న్యూమాటిక్ డోర్లను ఆర్టీసీ ఎండీ సీహెచ్. ద్వారకా తిరుమలరావు మంగళవారం పరిశీలించారు. ప్రయాణికులు తొందరపాటుతో కదులుతున్న బస్సుల్లోంచి దిగుతున్నప్పుడుగానీ ఎక్కుతున్నప్పుడుగానీ కాలుజారి పడడం వంటి ప్రమాదాలను నివారించేందుకు న్యూమాటిక్ డోర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ డోర్లు పూర్తిగా డ్రైవర్ నియంత్రణలో ఉంటాయి. బస్సు ఆగిన తరువాత డ్రైవర్ సీటు వద్ద ఉన్న బటన్‌ను నొక్కితేనే డోర్లు తెరుచుకుంటాయి. వర్షాలు, చలితో బస్సులోని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఈ డోర్లు ఉపయోగపడతాయి. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు డ్రైవర్లతో మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కాగా, త్వరలోనే అన్ని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ న్యూమాటిక్ డోర్లను ఆర్టీసీ ఏర్పాటు చేయనుంది.

మత్స్య, వ్యవసాయ రంగాల్లో

ఏపీ ఉత్పత్తులు భేష్

స్థానిక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు సాధించాలి

- నాణ్యత, పరిమాణం, ప్యాకింగ్‌లపై దృష్టి సారించాలి
- తద్వారా ఎగుమతులు రెట్టింపు అవుతాయి
- జర్మనీలో భారత రాయబారి హరీష్
- అన్ని రంగాల్లో పెట్టుబడులకు ఏపీ అనుకూలం: పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన

సాక్షి, అమరావతి: మత్స్య, వ్యవసాయ రంగాల్లో ఏపీ ఉత్పత్తులు భేష్ అని జర్మనీలో భారత్ రాయబారి పర్వతనేని హరీష్ ప్రశంసించారు. స్థానిక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జీఐ) ఉంటే వాటికి అంతర్జాతీయ మార్కెట్ ఉంటుందని వెల్లడించారు. తద్వారా ఎగుమతుల్లో ఏపీకి ఎదురుండదన్నారు. మంగళవారం ఆయన గుంటూరు జిల్లా మంగళగిరిలో మీడియాతో మాట్లాడారు. ఉద్యానవన పంటలకు అంతర్జాతీయ జీఏపీ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్) సర్టిఫికేషన్‌పై దృష్టి పెడితే రెట్టింపు ఎగుమతులు సాధ్యమన్నారు. ఉత్పత్తిలో నాణ్యత, పరిమాణం, ప్యాకింగ్‌లపై దృష్టి పెడితే ఏపీ మరింత రాణిస్తుందని చెప్పారు. మత్స్య ఆధారిత ఉత్పత్తులకు విలువ జోడింపు వల్ల రెట్టింపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఆ దిశగా ఏపీ ముందడుగు వేయాలన్నారు. ఏపీలో ఆయా ఉత్పత్తుల వ్యర్థాల ద్వారా బయో మీథేన్.. తద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అపార అవకాశాలున్నాయని వివరించారు. అలాగే రాష్ట్రం నుంచి జర్మనీకి ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు ఎక్కువ ఆస్కారం ఉందన్నారు. అంతకుముందు గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తుల ప్రదర్శనను హరీష్ ఆసక్తిగా తిలకించారు. అనంతరం



ఎగుమతిదారులు, పారిశ్రామికవేత్తలతో సమావేశమై ఎగుమతులపై చర్చించారు.

అన్ని రంగాల్లో పెట్టుబడులకు అనుకూల ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమని పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన తెలిపారు. ఇప్పటిదాకా ఏపీలో 1,006 భారీ పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.2,35,152 కోట్ల పెట్టుబడులు, 4,66,738 మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. దేశం నుంచి సరుకుల ఎగుమతుల్లో గతేడాది ఏపీ నాలుగో స్థానంలో నిలిచిందని వివరించారు. మరోవైపు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో ఏపీ ఉందన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన లీడ్స్–2022 ర్యాంకుల్లో తీర ప్రాంత రాష్ట్రాల్లో ఏపీ మొదటి ర్యాంకు దక్కించుకుందని తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్రం సాధించిన పురోగతిని తెలిపే వివిధ అంశాలపై ఆమె ప్రజెంటేషన్ ఇచ్చారు. గత మూడేళ్ల కాలంలో 106 యూనిట్లు ప్రారంభించడం ద్వారా రూ.44,802 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయన్నారు. అదేవిధంగా 68,418 మందికి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో 90 రకాల ఆన్‌లైన్ సేవలను పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న రాష్ట్రానికి దేశంలో పోటీ లేదన్నారు.

అన్ని రకాల పెట్టుబడులకు 'ఈడీబీ' కేంద్ర బిందువు

ఏపీలో అన్ని రకాల పెట్టుబడులకు 'ఈడీబీ' కేంద్ర బిందువుగా ఉంటుందని ఏపీఈడీబీ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ సావరపు తెలిపారు. ఎలక్ట్రానిక్, సోలార్, ఫార్మా, కెమికల్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్, బొమ్మలు, ఫర్నీచర్ తయారీ రంగాల్లో పెట్టుబడులకు అపార అవకాశాలున్నట్లు వెల్లడించారు. 2050 కల్లా పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ అవతరించేలా, లాజిస్టిక్ హబ్‌గా నిలిచే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు మాట్లాడారు.

అమృత్ సరోవర్లను పూర్తి చేయడమే లక్ష్యం

వచ్చే ఏడాది ఆగస్టు నాటికి మొత్తం 1,362 అమృత్ సరోవర్లను పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. 'మిషన్ అమృత్ సరోవర్'పై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. కాగా చేనేత, జౌళి వస్త్ర ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత వెల్లడించారు. పెడనలో తయారయ్యే కలంకారీ ఉత్పత్తులు ప్రపంచం నలుమూలలా చేరాయన్నారు. నార్వే, జర్మనీ దేశాలకు ఎగుమతి చేయగలిగే ఉత్పత్తుల జాబితాపై ఆమె ప్రజెంటేషన్ ఇచ్చారు. పండ్లు, చేపల ఉత్పత్తికి ఏపీ చిరునామాగా మారిందని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో ఉల్లిపాయలు, అనంతపురంలో దానిమ్మ, విజయనగరంలో ఒక రకమైన ఎరుపు, పసుపు రంగు మామిడిపండ్లు, గుంటూరు మిర్చి, ఏలూరులో బాదం, నెల్లూరులో నిమ్మ, శ్రీకాకుళం జీడిపప్పు, కోనసీమ కొబ్బరి వంటి వాటితో ఏపీ ప్రత్యేకత సంతరించుకుందన్నారు. వీటిలో రెట్టింపు ఎగుమతులు సాధించే దిశగా అడుగులేస్తున్నామని చెప్పారు.

ఆస్పత్రికి రూ.40 లక్షలు జరిమానా

- యువకుడి మృతికి కారణమైనందున..
- రాష్ట్ర వినియోగదారుల కమిషన్ సంచలన తీర్పు

విశాఖ లీగల్: నిర్లక్ష్యంగా వైద్యం చేసి ఓ యువకుడి మృతికి కారణమైన ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం రూ.40 లక్షలు నష్టపరిహారంగా చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ సంచలన తీర్పు ఇచ్చింది. నష్టపరిహారంతో పాటు రూ.25 వేలు దహన సంస్కారాలకు, మరో రూ.25 వేలు కోర్టు ఖర్చులకు ఇవ్వాలని ఆ తీర్పులో పేర్కొంది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షులు జస్టిస్ జి.వెంకట కృష్ణయ్య, మహిళా సభ్యురాలు చావలి వెంకట సూర్య భాస్కరం ఇటీవల తీర్పునిచ్చారు. బాధితులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నగరంలోని తోటగరువు ప్రాంతానికి చెందిన శీల తులసీరాం (26) ఓ ప్రైవేటు బ్యాంక్‌లో అధికారిగా పనిచేసేవారు. 2013 అక్టోబర్ 8న తీవ్ర అస్వస్థతకు లోనై సీతమ్మధారలోని క్వీన్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్సకు చేరాడు. ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అపెంటిసైటిస్‌గా గుర్తించారు. తక్షణం శస్త్రచికిత్స చేయాలని సూచించారు. అతని తల్లిదండ్రులు శీలా సూరిబాబు, వెంకట అప్పలకొండల నుంచి ధృవీకరణ పత్రాలపై సంతకాలు తీసుకుని శస్త్ర చికిత్స చేశారు. డాక్టర్ పి.తనూజ, డాక్టర్ రాజలక్ష్మీదేవి, డాక్టర్ పోల రాఘవేంద్ర దాస్ చికిత్స చేశారు. 24 గంటల తరువాత తులసీరాం కోమాలోకి వెళ్లి..అక్టోబర్ 10వ తేదీన తులసీరాం చనిపోయాడు.అయితే కోమాలోకి వెళ్లిన మూడు రోజుల వరకు విషయాన్ని వైద్యులు తులసీరాం తల్లిదండ్రులకు చెప్పలేదు. చనిపోవడానికి కారణం తమది కాదని వైద్యులు బుకాయించారు. అయితే తులసీరాం తండ్రి సూరిబాబు మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మెడికల్ కమిషన్‌ను ఆశ్రయించారు. వైద్యులు నిర్వహించిన ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించిన మెడికల్ కౌన్సిల్ వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు ధృవీకరించింది. దీంతో తన కుమారుడు మరణానికి రూ.90 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఆస్పత్రిపై కేసు వేశారు. సమగ్ర విచారణ జరిపి సాక్ష్యాలను పరిశీలించిన రాష్ట్ర వినియోగదారులు వివాద పరిష్కార కమిషన్ (విజయవాడ) పై విధంగా తీర్పు నిచ్చింది.

'వైఎస్సార్ పురస్కారాల' ఏర్పాట్లు పూర్తి చేయండి


- ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు
- నవంబర్ 1న వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్, వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానం


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నవంబర్ ఒకటో తేదీన రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్, వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏర్పాట్లు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ప్రభుత్వం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ఈ పురస్కారాలు ప్రదానం చేస్తుందని తెలిపారు. ఈ ఏడాది 30 మందికి ప్రదానం చేయనుందని పేర్కొన్నారు. పురస్కారాల ప్రదానోత్సవానికి విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్‌ను ఖరారు చేశామన్నారు. అలాగే పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రొటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డీఆర్వో కె.మోహన్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలపై కుంపటి!

- మధుమేహం, రక్తపోటుతో మానవ వడపోత యంత్రాలకు సుస్తీ
- అధిక మందుల వినియోగం కూడా ఓ కారణమే..
- రోజురోజుకు పెరుగుతున్న కిడ్నీ సంబంధిత వ్యాధులు
- బాధితులకు వరంలా మారిన విజయవాడ జీజీహెచ్


విజయవాడ జీజీహెచ్‌లో నెఫ్రాలజీ వార్డు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): మానవ శరీరంలో వడపోత యంత్రాలు మూత్ర పిండాలు. రక్తాన్ని శుద్ధి చేయడం వీటి ప్రధాన పని. ఇవి పాడయిపోతే మొత్తం శరీరమే కుదేలైపోతుంది. అందుకే కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ముఖ్యం. అయితే ఇటీవల కాలంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. విజయవాడ ప్రభుత్వాస్పత్రికి కిడ్నీ బాధితులు క్యూ కడుతున్నారు. జీవనశైలి వ్యాధులైన మధుమేహం, రక్తపోటు కారణంగా కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్న వారు ఎక్కువగా ఉంటున్నారు. మరికొందరు జన్యుపరమైన సమస్యలు, అధిక మోతాదులో మందులు వాడిన వారు ఉంటున్నారు. వారికి విజయవాడ ప్రభుత్వాస్పత్రి సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లోని నెఫ్రాలజీ విభాగంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ధైర్యంగా వైద్యం పొందేందుకు ప్రభుత్వాస్పత్రికి వస్తున్నారు.

వారంలో రెండు రోజులు ఓపీ

సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లో కిడ్నీ వ్యాధులకు సంబంధించి వారంలో రెండు రోజులు అవుట్‌పేషెంట్లకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రతి బుధ, శనివారం నిర్వహించే నెఫ్రాలజీ ఓపీకి 100 నుంచి 125 మంది వరకూ కిడ్నీ రోగులు వస్తున్నారు. వారిలో 50 శాతం మంది మధుమేహం కారణంగా కిడ్నీలు పాడైన వారు ఉంటుండగా, మరో 30 శాతం మంది హైపర్‌టెన్షన్ (రక్తపోటు) కారణంగా.. 20 శాతం మంది అధిక మోతాదులో మందులు వాడటం, జన్యుపరమైన సమస్యలు, ఒబెసిటీ వంటి కారణాలతో వ్యాధిబారిన పడుతున్నవారు ఉంటున్నారు.

ఐదు జిల్లాల నుంచి రాక..

ప్రభుత్వాస్పత్రిలోని నెఫ్రాలజీ విభాగానికి ఉమ్మడి జిల్లాలైన కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి నుంచి రోగులు వస్తున్నారు. తరచుగా రాజమండ్రి నుంచి సైతం కిడ్నీ రోగులు చికిత్స కోసం వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఒకప్పుడు ఇక్కడి రోగులకు కిడ్నీ వ్యాధులుంటే గుంటూరు రిఫర్ చేసేవారు. ఇప్పుడు గుంటూరులో చికిత్స పొందే వారు సైతం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలివస్తున్నారు. కిడ్నీ వ్యాధులను నిర్ధారించేందుకు ఆల్ట్రా సౌండ్ స్కాన్, సీటీ స్కాన్‌లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైతే బయాప్సీ తీసి హైదరాబాద్, చెన్నై పంపుతున్నారు. ఆ పరీక్షలు కూడా పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నారు.

అత్యాధునిక వార్డు..

సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో నెఫ్రాలజీ వార్డును తీర్చిదిద్దారు. నెఫ్రాలజీ వార్డులో 20 పడకలు ఉండగా, పది ఐసీయూ బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. కిడ్నీ రోగులకు అత్యవసరమైతే చేసేందుకు 12 డయాలసిస్ యూనిట్లు ఉన్నాయి. అత్యవసర రోగులతో పాటు, రెగ్యులర్‌గా అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో డయాలసిస్ చేస్తున్నారు.

అప్రమత్తతే రక్ష..



జీవనశైలితో వచ్చే మధుమేహం, రక్తపోటు కారణంగా కిడ్నీ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి. ఒబెసిటీ వారిలో కూడా కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మందులు అధికంగా వాడుతున్న వారికీ కిడ్నీ ఫెయిల్యూర్ అవుతుంది. వ్యాధి వచ్చాక బాధపడే కన్నా ముందు జాగ్రత్తలు మేలు. వైద్యుని సిఫార్సు లేకుండా మందులు వాడకూడదు. సుగర్, బీపీలను అదుపులో ఉంచుకోవాలి. తగిన మోతాదులోనే ఉప్పు తీసుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి. ప్రభుత్వాస్పత్రి నెఫ్రాలజీ విభాగంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు, మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు,
నెఫ్రాలజిస్టు, విజయవాడ జీజీహెచ్

బైపాస్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి

జొన్నలగడ్డ రైతుల వినతి


ఎంపీ లావుకు వినతిపత్రం అందజేస్తున్న జొన్నలగడ్డ రైతులు

నరసరావుపేట రూరల్: చీరాల వాడరేవు – నకరికల్లు ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనుల్లో ఏర్పాటు చేసే బైపాస్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని జొన్నలగడ్డ రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కోరారు. ఎన్‌జీవో కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎంపీ లావును జొన్నలగడ్డ రైతులు కలిశారు. ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా పట్టణానికి సమీపంలోని జొన్నలగడ్డ భూముల నుంచి బైపాస్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసిందన్నారు. బైపాస్ నిర్మాణం వల్ల చిన్న, సన్నకారు రైతులు తమ భూములను కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. నాగార్జునసాగర్ కుడికాలువ నీటి వసతి ఉన్న భూములను సేకరించి రైతు కుటుంబాలు ఇబ్బందులకు గురిచేయడం సరికాదని తెలిపారు. గతంలో నరసరావుపేట – గుంటూరు రోడ్డు, నరసరావుపేట– సత్తెనపల్లిరోడ్డు విస్తరణకు విలువైన వ్యవసాయ భూములను పంచాయతీరాజ్ శాఖకు ఇవ్వడం జరిగిందని చెప్పారు. తాజాగా మరో రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొందని తెలిపారు. వ్యవసాయ భూములు సేకరించకుండా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని కోరారు. దీనిపై అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి నిర్ణయం తీసుకుంటామని ఎంపీ లావు రైతులకు తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని హామీ ఇచ్చారు.

ఫిజికల్ డైరెక్టర్ సస్పెన్షన్

- 13 ఏళ్లు ఒకేచోట డెప్యూటేషన్‌పై కొనసాగినందుకు చర్యలు
- ఉత్తర్వులు విడుదల చేసిన గుంటూరు డీఈఓ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరం పాత్తూరువారితోటలోని మహాకవి తిక్కన, పులిపాక కమల –హనుమంతరాయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ ఎ.సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మాతృ పాఠశాలకు దూరంగా 13 ఏళ్ల పాటు డెప్యూటేషన్‌పై నరసరావుపేటలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం ఇన్‌చార్జిగా కొనసాగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపిన అధికారులు ఎట్టకేలకు సస్పెన్షన్ వేటు వేశారు. 2008 నుంచి 2017, 2019 నుంచి 2022 వరకు ఏకధాటిగా 13 ఏళ్లపాటు డెప్యూటేషన్‌పై కొనసాగడంపై పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిషనర్ కార్యాలయం నుంచి గత ఆగస్టు 29న ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ పి.శైలజకు ఆదేశాలు అందాయి. విచారణలో జాప్యం చేసిన అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. 13 ఏళ్లపాటు డెప్యూటేషన్‌తో పాటు ఆన్‌డ్యూటీ సదుపాయాన్ని వర్తింపజేయడం ప్రభుత్వ నిబంధనలకు పూర్తి విరుద్ధమని తేల్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల అమలులో జరిగిన జాప్యాన్ని వెలుగులోకి తెస్తూ సాక్షి జిల్లా టాబ్లాయిడ్‌లో సోమవారం 'తిష్ట గరిష్ఠుడు' శీర్షికతో కథనాన్ని ప్రచురితమైంది.

యార్డులో 35,249 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 34,773 మిర్చి బస్తాలు రాగా, నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 35,249 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9 వేల నుంచి రూ.27,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.27 వేల వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చికి రూ.11,500 నుంచి రూ.27 వేల వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9 వేల నుంచి రూ.27,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,200 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. విక్రయాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,708 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అనంతవరప్పాడులో కేరళ బందం పర్యటన

ఉద్యాన శాఖ అధికారులతో కలిసి మిర్చి పంట పరిశీలన


అనంతవరప్పాడులో మిర్చి పంటను పరిశీలిస్తున్న కేరళ బృందం

ప్రత్తిపాడు: కేరళ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారుల బృందం మంగళవారం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో పర్యటించింది. కేరళ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డాక్టర్ డి.సజిత్ బాబు, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజీబ్ కుమార్ పట్జోషి, కేరళ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ స్థానికంగా సాగు చేసిన మిర్చి పంటను పరిశీలించారు. ఆదర్శ రైతు బండారు శ్రీనివాసరావుతో మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుకు విత్తనం దశ నుంచే ప్రభుత్వం అండగా ఉంటోందని, నాణ్యమైన నారు అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఒక్కొక్క మిరప మొక్క రూపాయిన్నరకు కొనుగోలు చేశామని, దిగుబడి ఈసారి గణనీయంగా వస్తుందని ఆశిస్తున్నట్లు ఆదర్శ రైతు కేరళ బృందానికి వివరించారు. మిరప పంట మొదలు పెట్టినప్పటి నుంచి కోత వరకు రైతు ఎకరాకు రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందన్నారు. ఎకరాకు లేబర్ కూలీ అరవై వేల రూపాయలు వరకు అవుతుందని చెప్పారు. మిషన్లు ఉపయోగించడం లేదని రైతు అధికారులకు వివరించారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉందని, పూత వచ్చినప్పటి నుంచి 90 రోజుల్లో మొదటి కోత వస్తుందని తెలిపారు. మొత్తం మూడు సార్లు ఫిబ్రవరి, ఏప్రిల్, మే నెలల్లో మిరప కోతలు కోస్తారని బృందానికి వివరించారు. అనంతరం రైతులు, కేరళ రాష్ట్ర అధికారులకు మిరప కారం ప్యాకెట్లను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారిణి పద్మశ్రీ, ఉద్యాన శాఖ డీడీ సుజాత, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీబీ రాజబాబు, ప్రత్తిపాడు మండల ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

బీసీ కమిషన్ చైర్మన్‌కు ఏపీ బీసీ సంఘం వినతి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పలు శాఖల్లో ఖాళీగా ఉన్న బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై విజయవాడలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ చైర్మన్ అంబటి శంకర్‌నారాయణకు బీసీ సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. విద్య, వైద్యం రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, న్యాయ, ఉద్యాన తదితర శాఖల్లో దాదాపు 20 ఏళ్లుగా బీసీ పోస్టులు భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ మాదిరిగానే బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు షేక్ అబ్దుల్ కలాం తదతరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి

రాష్ట్ర వ్యవసాయ బృందం పర్యటన


కషాయాల తయారీని పరిశీలిస్తున్న రాష్ట్ర పర్యవేక్షణ బృందం

యద్దనపూడి: రసాయనిక, క్రిమిసంహారక మందుల నుంచి నేలతల్లిని కాపాడటమే ధ్యేయంగా రైతులందరూ కలిసికట్టుగా ప్రకృతి వ్యవసాయాన్ని అవలంభించాలని జెడ్పీఎన్ఎఫ్ మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ టి. శరత్ రైతులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ పరిశీలనకు సంబంధించి మంగళవారం రాష్ట్ర పర్యవేక్షణ బృందం బాపట్ల జిల్లా, యద్దనపూడి మండలంలోని పూనూరు, గన్నవరం, యద్దనపూడి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను కలిసి వారి పంటలను పరిశీలించారు. అనంతరం ఎంతమంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. చీడపీడల నివారణకు ఏయే కషాయాలు వాడుతున్నారు తదితర విషయాలను ఐసీఆర్పీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కాలుష్యరహిత ఆహార ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే ఆకులు, వేర్లతో తయారుచేసే దశపర్ణికషాయం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, వావిలాకు కషాయం, అగ్ని అస్త్రం, వేపగింజల కషాయం, ద్రవజీవామృతం వంటి కషాయాలను పిచికారి చేసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఎంటీ బృంద సభ్యుడు తిరుమల, శ్యామ్, ఎల్‌టూలు అనూష, వెంకటరత్నం, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

మహిళల అక్రమ రవాణా...
ప్రభుత్వాలకు పెద్ద సవాల్.
సమాజానికి తలవంపులు.
బాధిత మహిళకు విషమ పరీక్ష.
మహిళల రక్షణ ఆమె ఆకాంక్ష.
తనకు తెలిసిన మార్గం పోరాటమే.
పోరాటం... పోరాటం... పోరాటం.
అసాంఘిక శక్తులతో పోరాటం.
సామాజిక పరిస్థితులతో పోరాటం.
మనసు మారితే సమాజం మారుతుంది.
ఇప్పుడు ఆ మార్పు కోసం అభ్యర్థిస్తోంది.


సునీతాకృష్ణన్

దయచేసి మారండి!

సునీతాకృష్ణన్ 'నా బంగారు తల్లి' సినిమా తీసి దాదాపుగా దశాబ్దమవుతోంది. మహిళలను మోసగించి అక్రమ రవాణాకు పాల్పడే దుర్మార్గాన్ని ఆ సినిమాలో కళ్లకు కట్టారు సునీతా కృష్ణన్, ఆమె భర్త రాజేశ్ టచ్‌రివర్. ప్రతి సన్నివేశమూ వాస్తవానికి అద్దం పట్టింది. సినిమా క్లైమాక్స్ దృశ్యాలు కన్నీటి పర్యంతం చేస్తాయి, మనసు ద్రవించిపోతుంది. సమాజంలో మహిళ ఎదుర్కొనే దాష్టీకాలకు మౌనంగా రోదిస్తూ బయటకు వస్తారు ప్రేక్షకులు. వాస్తవ సంఘటన ఆధారంగా తెరకెక్కిన చిత్రం అది. ఆ సందర్భంగా నిర్మాత సునీతా కృష్ణన్ మాట్లాడుతూ ''1996లో ప్రజ్వల ఫౌండేషన్ ప్రారంభించినప్పటి నుంచి పోరాడుతున్నాను. అంతకంటే ముందు ప్రజ్వల వంటి ఫౌండేషన్ అవసరం ఉందని గ్రహించే వరకు నేను గుర్తించిన సామాజికాంశాలన్నింటి మీదా పోరాడాను. 'స్త్రీ అంగడి సరుకు కాదు, దేహం మీద దాడి చేస్తే ఆమె మనసు ఎంతగా రోదిస్తుందో ఆలోచించండి' అని గొంతుచించుకుని చెప్తున్నాను. నా ఉద్యమం సమాజంలో ప్రతి ఒక్కరినీ చేరాలంటే, ఏకకాలంలో ఎక్కువమందిని సెన్సిటైజ్ చేయాలంటే ప్రభావవంతమైన మాధ్యమం అవసరం అనిపించింది. అందుకే సినిమా తీశాను. ఈ చిత్రాన్ని చూసిన తర్వాత ఎవరైనా కనీసం ఒక్క క్షణమైనా ఆలోచించకపోతారా, స్త్రీ దేహాన్ని మాత్రమే కాంక్షించే మగవాళ్లకు తమ ఇళ్లలో ఉండే ఆడబిడ్డలు కళ్ల ముందు మెదలకపోతారా' అనేది మా ఆశ. నేను యాక్టివిస్టుని, నా భర్త సినిమా దర్శకుడు కావడంతో మా ఆలోచన అనుకున్నది అనుకున్నట్లే కార్యరూపం దాల్చింది. ఎటువంటి సినిమాటిక్ లిబర్టీ తీసుకోకుండా, కమర్షియల్ ఎలిమెంట్స్ లేకుండా చిత్రించాం'' అని చెప్పారామె. ఆమె సామాజిక సేవను గుర్తించిన భారత ప్రభుత్వం 2016లో పద్మశ్రీతో సత్కరించింది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు (మహిళాసాధికారత విభాగం)కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆమె సాక్షితో పంచుకున్న అనుభవాలివి.

ఎక్కడ ఉన్నా పోరాటమే!

''నేను బెంగళూరులో పుట్టిన మలయాళీని. నేను పుట్టిన నెలరోజులకే మా నాన్నకు హైదరాబాద్‌కు బదిలీ అయింది. నా బాల్యం మూడేళ్లు ఇక్కడే గడిచింది. నేను మహిళల కోసం పని చేయడానికి హైదరాబాద్‌ను ఎంచుకోవడం అనుకోకుండా జరిగింది. బెంగళూరులో స్టూడెంట్‌గా నేను ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేదాన్ని. స్త్రీ దేహం కాస్మటిక్ కంపెనీల నిబంధనల చట్రంలో ఇమడాలనే భావనను వ్యతిరేకించాను. స్త్రీ దేహం ఫలానా కొలతల్లో ఉంటేనే అందం అని ఒకరు నిర్ణయించడమేంటి, ఆ మాయలో చిక్కుకుని అమ్మాయిలు తమ దేహాన్ని నియంత్రించుకోవడానికి తంటాలు పడడం ఏమిటి? అని... స్త్రీ దేహాన్ని మార్కెట్ వస్తువుగా పరిగణించే ధోరణిని నిరసిస్తూ అందాల పోటీల నిర్వహణను అడ్డుకుని రెండు నెలలు జైల్లో ఉన్నాను. అప్పుడు నాకు ఇరవై రెండేళ్లు. నేను ఉద్యమించి జైలుకెళ్లడాన్ని మా ఇంట్లో సమ్మతించలేకపోయారు. అలా ఇల్లు వదిలి వచ్చేశాను. ఎక్కడికెళ్లాలో తెలియదు. రైల్వే స్టేషన్‌కెళ్లి కౌంటర్‌లో ఎటువెళ్లే రైళ్లున్నాయని అడిగాను. వాళ్లు చెప్పిన పేర్లలో 'హైదరాబాద్' వినిపించగానే 'టికెట్ ఇవ్వండి ' అనేశాను. అలా హైదరాబాద్, చాదర్‌ఘాట్‌లో నివసిస్తున్న ఓ మిత్రురాలింటికి వచ్చాను. ఇక్కడ కూడా ఉద్యమించాల్సిన అవసరం వచ్చింది. అప్పుడు మూసీ నది తీరాన్ని 'నందనవనం'గా మార్చాలని ప్రభుత్వం అక్కడి ఇళ్లను ఖాళీ చేయించాలని నిర్ణయం తీసుకుంది. 'పునరావాసం కల్పించిన తర్వాత మాత్రమే మా ఇళ్లను కూలగొట్టండి' అంటూ రోడ్డెక్కాను. ఆ తర్వాత హైదరాబాద్‌లో 'మెహబూబ్ కీ మెహందీ'లో నివసిస్తున్న వారిని తొలగించే ప్రయత్నం జరిగింది. ఆ మహిళల కోసం ఏదైనా చేయాలని పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాను. లైంగికహింస, అక్రమ రవాణాలకు గురయ్యి జైళ్లు, హోమ్‌లలో ఉన్న మహిళలను కలిశాను. వాళ్లలో చాలా మంది తమ పిల్లలకు భవిష్యత్తు ఇవ్వమని కోరారు. అలా ఐదుగురు పిల్లలతో స్కూలు ప్రారంభించాను. ఆ తర్వాత పదిమంది పిల్లలతో షెల్టర్ హోమ్ పెట్టాను. అలా మొదలైన చిన్న ప్రయత్నం ఇప్పుడు పదిహేడు ట్రాన్సిషన్ సెంటర్‌లలో ఏడు వందల మంది పిల్లలు చదువుకునేంతగా పరిణమించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు పన్నెండు వేల మంది చదువుకుని గౌరవప్రదమైన జీవితాల్లో స్థిరపడ్డారు.

ఈ ఫౌండేషన్ అవసరం ఉండకూడదు!

ఆడపిల్లల అక్రమ రవాణాదారులు ఒక అమ్మాయిని తీసుకువచ్చినట్లు సమాచారం అందగానే దూకుడుగా వెళ్లిపోయేదాన్ని. అడ్డువచ్చిన వాళ్లతో బాహాబాహీకి దిగి మరీ ఆడపిల్లలను బయటకు తీసుకువచ్చేదాన్ని. అలా లెక్కలేనన్నిసార్లు నా మీద దాడులు జరిగాయి. చెవి మీద తగిలిన దెబ్బ కారణంగా వినికిడి కూడా తగ్గింది. ఆ దాడులను పట్టించుకోలేదు. కానీ నా అనుచరుడిని హత్య చేశారు. అప్పుడు నా పంథా మార్చుకుని పోలీస్, మహిళా సంక్షేమశాఖల వంటి ప్రభుత్వ వ్యవస్థలతో కలిసి పని చేయడం మొదలుపెట్టాను. ఇప్పటికి 96 వేల మంది బాలికలు, యువతులు, మహిళలను రక్షించగలిగాను. ఆ నంబరు ఇంత పెద్దదిగా ఉన్నందుకు గర్వపడడం కాదు మనం సిగ్గుపడాలి. స్త్రీల రక్షణ కోసం ప్రజ్వల ఫౌండేషన్ ప్రారంభించాను. సమాజంలో స్త్రీల అక్రమ రవాణా పూర్తిగా అంతరించిపోవాలి. నేను బతికి ఉండగానే ఈ ఫౌండేషన్‌ను మూసివేయాలనేది నా ఆకాంక్ష. సమాజంలో సున్నితత్వం పెరిగి, మంచి మార్పు రావాలని అందరం ఆశిద్దాం.

- సునీతాకృష్ణన్,
సామాజిక ఉద్యమకారిణి


అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న సునీతాకృష్ణన్

మగవాళ్లకు చెప్పాలి!

నా బంగారు తల్లి సినిమాతో సమాజాన్ని ఆలోచింపచేయగలిగాను. ఆ సినిమాకి మూడు నేషనల్ అవార్డులు వచ్చాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీ నాలుగు నంది అవార్డులు ప్రకటించింది. ఇప్పుడు మగవారి మీద దృష్టి పెట్టాను. ఆడవాళ్ల మీద జరిగే దాడులను, మోసాలను అరికట్టడానికి భుజబలం ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనం కంటే మగవాళ్లను చైతన్యవంతం చేయడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చనిపించింది. అందుకే ఇప్పుడు 'మ్యాన్ అగెనెస్ట్ డిమాండ్ (మ్యాడ్)' నినాదంతో ముందుకు వెళ్తున్నాను. 'మీ లైంగిక అవసరాలకు ఇతర స్త్రీలను కోరుకోవడం మానేయండి, మీలో ఈ మార్పు వస్తే స్త్రీల అక్రమ రవాణా మాఫియా దానంతట అదే అంతరించిపోతుంది' అని అభ్యర్థిస్తున్నాను. మనిషిలో సహజంగానే సున్నితత్వం ఉంటుంది. ఆ సున్నితత్వాన్ని పురుషాహంకారంతో అణచివేయకుండా ఉంటే చాలు. మార్పు వచ్చి తీరుతుంది'' అని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు సునీతా కృష్ణన్. ఇరవై ఆరేళ్ల తన పోరాటంలో తిరస్కారాలు తప్ప పురస్కారాలు అందలేదని, తన సొంతరాష్ట్రం కేరళలో ప్రభుత్వ పురస్కారం తర్వాత తెలుగు రాష్ట్రాల్లో దక్కిన తొలి గౌరవం 'వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' అని సంతోషం వ్యక్తం చేశారామె.

- వాకా మంజులారెడ్డి

బ్యూటిప్స్



రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, టేబుల్ స్పూను తేనె తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. పదిహేను నిమిషాల తరువాత కడగాలి.





- టీ స్పూను తేనెలో అర టీస్పూను పసుపు వేసి బాగా కలిపి ముఖానికి రాసుకోవాలి ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి.
- ఈ రెండు ప్యాక్‌లను వారానికి మూడు సార్లు వేయడం వల్ల చర్మం మృదువుగా మారడమేగాక, ఆరోగ్యంగా ఉంటుంది.

అకారణ అనుమానం ఏం చేయాలి?

అనుమానం పెనుభూతం. అకారణ అనుమానం ఎదుటివారికి ప్రాణాంతకం. భర్త మంచివాడే.. ఉద్యోగం చేస్తాడు.. కష్టపడతాడు. ఇంటిని పోషించాలనుకుంటాడు. కాని అతనికి తీవ్రమైన అనుమానం ఉంటే? భార్యను విసిగిస్తూ ఉంటే? అదొక మానసిక అవస్థ అని తక్షణమే గుర్తించాలి. ఆత్మీయుల సాయం పొందాలి. వైద్యం అందించాలి. ఇటీవల పత్రికలలో ఈ మానసిక అవస్థతో జరుగుతున్న దుర్ఘటనలు ఇంటిని, ఇంటి మనిషిని కాపాడుకోమని అప్రమత్తం చేస్తున్నాయి.

కేస్‌స్టడీ 1: మధు ఆఫీస్ నుంచి హఠాత్తుగా ఇంటికి వచ్చాడు. అప్పటికి ఆమె వంటపనిలో ఉంది. తలుపు తట్టి నేరుగా లోపలికి దూసుకు వచ్చాడు. బెడ్‌రూమ్ అంతా కలియతిరిగాడు. బాత్‌రూమ్ చూశాడు. కప్‌బోర్డులు వెతికాడు. 'ఎక్కడ దాచి పెట్టావ్ వాణ్ణి' అన్నాడు. ఆమె హతాశురాలు కాలేదు. అలా అతణ్ణి చూస్తూ ఉంది. ఈ మధ్య అలాగే చేస్తున్నాడు. 'చెప్తాను నీ సంగతి' అని పళ్లు కొరుకుతూ వెళ్లిపోయాడు. ఆమెకు ఏడుపొచ్చింది. కాని ఎన్నిసార్లని ఏడుస్తుంది. ఈ అనుమానం మొగుణ్ణి గతంలో ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇద్దరు పిల్లలు. ఇతను ఇలా తయారవుతాడని కలగందా? ఏం చేయాలి? ఇంటి నుంచి బయటపడి కుటుంబాన్ని డిస్టర్బ్ చేయడమా? లేదా అతణ్ణి భరించడమా?

కేస్ స్టడీ 2: బర్త్‌డే పార్టీ నుంచి ఇంటికి తిరిగొస్తున్నప్పుడు ముభావంగా మారిపోయాడు శివ. భార్య గతుక్కుమంది. అలా మారాడంటే ఏదో అయ్యిందన్నమాటే. 'ఏమైందండీ' అడిగింది బైక్ వెనుక నుంచి. 'పార్టీలో నువ్వు ఐదు నిమిషాలు కనిపించలేదు. ఎవరితో మాట్లాడటానికి వెళ్లావ్' అన్నాడు. 'అయ్యో. వాష్‌రూమ్‌కు వెళ్లానండీ'. 'అంటే వాష్‌రూమ్ దగ్గరకు వాణ్ణి రమ్మన్నావా?'. 'దేవుడా.. వాడెవడండీ'. 'అదే... ఆ శ్రీనివాస్‌గాడు. భోజనాల దగ్గర నీతో మాట్లాడుతున్నాడు కదా'. 'అయ్యో. నాతో ఏం మాట్లాడలేదండీ. ప్లేట్ అందించాడంతే'. కాని శివ ఏమిటేమిటో అంటున్నాడు. ఇల్లు చేరేవరకూ అంటూనే ఉన్నాడు. చేరాక అన్నాడు. తెల్లార్లూ అన్నాడు.

కేస్‌స్టడీ 3: ఆమెకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. భర్త మంచం మీద లేడు. కంగారుగా లేచి చూసింది. హాల్లో ఒక్కడే పడుకుని శూన్యంలోకి చూస్తూ ఉన్నాడు. 'ఏంటండీ... ఇక్కడ ఏం చేస్తున్నారు'.... 'నాకు చచ్చిపోవాలని ఉంది. నేనంటే నీకు ఇష్టం లేదు. అది తెలిసిపోయాక నిన్నేదైనా చేస్తానేమోనని భయంగా ఉంది' చెప్పి భోరుమన్నాడు. ఆమె భయంతో ఆందోళనతో సతమతమైపోయింది. 'మీరంటే ఇష్టం లేదని ఎవరు చెప్పారు'. 'ఒకరు చెప్పాలా... నాకు తెలుసు'. ఆమె నెత్తి కొట్టుకుంది.

•••

'పారనోయ' అనేది ఒక మానసిక అనారోగ్యం. ఈ అనారోగ్యం ఉన్నవారికి అనుమానం, అపనమ్మకం, అక్కసు, భ్రాంతి... వంటి రకరకాల భావాలు ఉంటాయి. వీరు అందరిలా నార్మల్‌గానే ఉంటారు. నార్మల్‌గా జీవిస్తున్నట్టుగానే కనపడుతుంటారు కాని ఈ సమస్య ఉంటుంది. వారు ఎవరిని ఆ సమస్యతో ఇబ్బంది పెడుతున్నారో వారికే అది తెలుస్తుంది. అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే వీరు చేసే ఆరోపణలు 'ఏనుగు గాల్లో ఎగురుతుంది' లాంటివి కావు. 'ఏవి జరగడానికి ఆస్కారం ఉంటుందో ఆ విషయాల పట్ల వారికి అనుమానం ఉంటుంది'.

అంటే 'భార్యకు మరొకరితో సంబంధం ఉండే ఆస్కారం ఉంటుంది కనుక అనుమానం ఉంటుంది'. 'కొలీగ్ తన డెస్క్‌ను చెక్ చేయడానికి ఆస్కారం ఉంటుంది కనుక అనుమానం ఉంటుంది'. 'పక్కింటివారు తనకు ఏదో హాని చేసే అవకాశం ఉంటుంది కనుక అనుమానం ఉంటుంది'.

అంటే జరగగలిగిన వాటి గురించే వీరు వర్రీ అవుతూ ఉంటారు. కాని వాటికి వారి దగ్గర ఆధారాలు ఉండవు. కాని గట్టిగా నమ్ముతుంటారు. 'నీకు పక్కింటి వ్యక్తితో సంబంధం ఉంది' అని భార్యతో వాదిస్తారు. 'లేదు' అని భార్య వాదించే కొద్దీ వారి అనుమానం బలపడుతుంది. దీనిని నసగా, చాదస్తంగా, పెద్ద పట్టించుకోవాల్సిన విషయం కానట్టుగా, భరించక తప్పదు అని లోలోపల కుళ్లే విషయంగా చాలామంది భార్యలు భావిస్తుంటారు. అది ప్రమాదం. ఇది 'మానసిక అనారోగ్యం' అని గుర్తించాలి. అలా ఎప్పుడైతే గుర్తిస్తామో పరిష్కారం వైపు అడుగులు వేసినట్టు. ప్రమాదం నుంచి దూరం జరుగుతున్నట్టు. లేకపోతే ఈ అవస్థ ముదిరితే నూటికి ఇద్దరు తమకు తాము హాని చేసుకోవడమో ఎదుటివారికి హాని తలపెట్టడమో చేస్తారు. పేపర్లలో ఇప్పుడు చూస్తున్నవి అలాంటి వారి వల్ల జరుగుతున్న ఉత్పాతాలే.

ఏం చేయాలి?

- మొదట ఆత్మీయుల మద్దతు తీసుకోవాలి. వైద్యానికి ఒప్పించాలి. ఇలాంటి వ్యక్తులతో ఎలా వ్యవహరించాలో సైకియాట్రిస్టుల సలహా తీసుకోవాలి. భర్తతో ఈ ఇబ్బంది తప్ప వేరే సమస్య లేదు కనక అతణ్ణి కాపాడుకోవాలి (భార్యల్లో కూడా ఇదే సమస్య ఉంటుంది. ఆమె గురించి కూడా ఇదే వర్తిస్తుంది).
- వాదించకూడదు. భర్త చేసే ఆరోపణలను వాదించవద్దు. ఖండించవద్దు. విని ఊరుకుంటూ ఉండాలి. స్నేహంగా, ఓర్పుగా వారితో మాట్లాడాలి.
- ఈ సమస్య ఉన్నవారితో వేగాలంటే ముందు మన మానసిక, శారీరక ఆరోగ్యం దృఢంగా ఉండాలి. అందువల్ల మన జాగ్రత్తలో మనం ఉండాలి.

ఏమిటి వైద్యం?

- సైకోథెరపీ, బిహేవియరల్ థెరపీ, కాగ్నిటివ్ థెరపీ లాంటివి ఉన్నాయి. ఇరవై ఏళ్ల క్రితం నుంచే మందులూ వచ్చాయి. ఇప్పుడు లేటెస్ట్ డ్రగ్స్ ఉన్నాయి. అయితే కొన్ని మందుల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. అవి గమనించుకుంటూ వైద్యుణ్ణి సంప్రదిస్తూ సరైన మందులు ఇస్తూ ఈ అనుమాన భూతాన్ని అదుపులోకి తేవాలి.

సమస్యను అయినవారితో చెప్పకుండా దాచడం మంచిది కాదు. చెప్తే నవ్వుతారేమో అనుకోకూడదు. ప్రమాదం వచ్చాక అందరూ ఏడ్వడం కన్నా ఇప్పుడు ఒకరిద్దరు నవ్వినా నష్టం లేదు. పరిష్కారం వైపు అడుగు ముందుకు పడటమే ముఖ్యం.


ప్రతీకాత్మక చిత్రం

కిచెన్‌టిప్స్

- పాలకూరను వెంటనే వండలేని పరిస్థితుల్లో.. కాడలు కట్ చేసి ఆకుల్ని శుభ్రంగా కడిగి మరుగుతున్న నీళ్లలో కొద్దిగా ఉప్పు, పాలకూర ఆకుల్ని వేయాలి. పాలకూర సగం ఉడికిన తరువాత ఆకుల్ని వడగట్టి చల్లారనివ్వాలి. చల్లారాక మిక్సీజార్‌లో వేసి నాలుగు రెబ్బలు వెల్లుల్లి, నాలుగు పచ్చిమిరపకాయలను వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేసుకోవాలి. దీనిని ఎయిర్‌టైట్ కంటైనర్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వచేసుకోవాలి. ఐదారు రోజులపాటు తాజాగా ఉండే ఈ పేస్టుతో.. పాలక్ రోటీ, పరాటా, పూరీ, పాలక్ ఆలూ కుర్మా, పాలక్ పనీర్‌లు చేయవచ్చు.



- బంగాళ దుంపల మసాలా కూర మరింత రుచిగా రావాలంటే.. పచ్చి బంగాళదుంపల తొక్కతీసి శుభ్రంగా కడగాలి. తరువాత ఫోర్క్‌తో దుంపపైన గుచ్చుతూ రంధ్రాలు చేసి.. డీప్ ఫ్రై చేసి పక్కన పెట్టుకోవాలి. చల్లారాక మరోసారి డీప్ ఫ్రై చేసి మసాలా కూరలో వేసుకుంటే కూర చాలా రుచిగా ఉంటుంది.



యూత్ పల్స్

'ప్రయాణం అంటే కొత్త ప్రపంచాన్ని చూడడం మాత్రమే కాదు, మనల్ని మనం కొత్తగా ఆవిష్కరించుకోవడం కూడా!' అని నమ్ముతోంది ఈ తరం. వారి దృష్టిలో ప్రయాణం చేయడం అంటే... 'జస్ట్ ఎంజాయ్' అని కాదు... ట్రావెలింగ్‌ను కొత్త దృష్టితో చూస్తోంది నవతరం..

కొత్తగా రెక్కలొచ్చెనా...


ప్రతీకాత్మక చిత్రం

రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాకు చెందిన జాన్వీకి ప్రయాణాలు చేయడం అంటే చాలా ఇష్టం. తన ప్రయాణ అనుభవాలను ఎప్పటికప్పుడు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసేది. అలాంటి జాన్వీ కాలేజికి, ఇంటికి మాత్రమే పరిమితం అయిపోయింది. కోవిడ్ కారుమేఘాలు తొలగిపోయిన తరువాత జాన్వీలాంటి వాళ్లు ఇప్పుడు మళ్లీ ప్రయాణానికి సై అంటున్నారు.

ఇండియన్ మిలీనియల్స్‌లో 82 శాతం ట్రావెల్ ప్లాన్‌లతో సిద్ధంగా ఉన్నట్లు బిజినెస్ ఆఫ్ ట్రావెల్ ట్రేడ్ 'ట్రావెల్ సెంటిమెంట్ ట్రాకర్' రిపోర్ట్ తెలియజేస్తోంది.

'మిలీనియల్స్‌లో 82 శాతం ప్రయాణాలపై ఆసక్తి చూపడం అనేది ట్రావెల్ అండ్ టూరిజం ఇండస్ట్రీకి శుభపరిణామం' అంటున్నారు ఆన్‌లైన్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్ టీబీవో కో–ఫౌండర్ అంకుష్.

ప్రపంచవ్యాప్తంగా మిలీనియల్స్ ఆసక్తి చూపుతున్న దేశాల్లో ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, ఫిన్‌లాండ్, కెనడా, ఆస్ట్రేలియా... మొదలైనవి ఉన్నాయి. ఇక డొమెస్టిక్ సెగ్మెంట్ విషయానికి వస్తే కేరళ, గోవా, జమ్ము అండ్ కశ్మీర్, ఉత్తరాఖండ్, గుజరాత్... మొదలైనవి ఉన్నాయి. 'గతంతో పోల్చితే ఇండియన్ మిలీనియల్స్ ట్రావెలింగ్‌పై అధిక ఆసక్తి ప్రదర్శించడమే కాదు ఎక్కువ సమయం గడపడానికి, ఎక్కువ డబ్బు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది ఆరంభం మాత్రమే' అంటున్నారు ట్రావెల్ ఏజెంట్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు జ్యోతి మయల్.

> బడ్జెట్ కంట్రోల్ విషయంలో మిలీనియల్స్ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'ఎంజాయ్' పేరుతో విచ్చల విడిగా, వృథా ఖర్చు చేయడానికి సుముఖంగా లేరు.

ఖర్చు విషయానికి వస్తే, 42 శాతం మిలీనియల్స్ రెండు నుంచి అయిదు లక్షలు, 33 శాతం అయిదు నుంచి పది లక్షలు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇక సౌకర్యాల విషయానికి వస్తే 31 శాతం మంది లగ్జరీకి ప్రాధాన్యత ఇస్తుండగా... 27 శాతం మంది లగ్జరీతో పనిలేదు అంటున్నారు.

డిజిటల్ ప్రపంచంలోనే ఎక్కువ సమయం గడిపే మిలీనియల్స్ 'ఎక్కడికి వెళ్లాలి?' 'ఎందుకు వెళ్లాలి?' 'ఎంత ఖర్చు చేయాలి' అనేవి స్వయంగా పరిశోధించి తెలుసుకుంటున్నారు.

'ఫలానా ప్రాంతానికి వెళుతున్నాను. జాగ్రత్తలు చెప్పగలరా... అని అడిగితే చాలు ఫేస్‌బుక్‌లాంటి వేదికలలో ఎంతోమంది ఎన్నో సలహాలు ఇస్తారు. అవి నాకు ఎంతో ఉపయోగపడతాయి' అంటోంది ముంబైకి చెందిన అనిత.

టెక్ సావి స్టార్స్‌గా పేరున్న మిలీనియల్స్ ఇండియా, అమెరికా, చైనా... మొదలైన దేశాల్లో టూరిజం మార్కెట్‌కు గట్టి ఊపు ఇస్తున్నారు.

మిలీనియల్స్‌కు ట్రావెల్ అనేది ఉల్లాసం, ఉత్సాహం మాత్రమే కాదు అధ్యయనం కూడా!

ఒక కొత్త ప్రాంతానికి వెళితే, అక్కడి ప్రత్యేకమైన వంటల నుంచి ఆచార వ్యవహారాల వరకు ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇతరులతో పంచుకుంటున్నారు.

'మా తరంలో ప్రయాణం చేయడం అంటే ఏదో రకంగా ఎంజాయ్ చేయడమే. అంతకు మించి ఉండేది కాదు. మా అబ్బాయి తరానికి వచ్చేసరికి చాలా విషయాల్లో మార్పు వచ్చింది. ఇది ఆహ్వానించదగిన మార్పు' అంటున్నాడు చెన్నైకి చెందిన ఆనంద్.

బడ్జెట్ కంట్రోల్ విషయంలో మిలీనియల్స్ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'ఎంజాయ్' పేరుతో విచ్చల విడిగా, వృథా ఖర్చు చేయడానికి సుముఖంగా లేరు.

'ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి టూర్‌కు వెళ్లాను. తీసుకువెళ్లిన డబ్బులన్నీ ఖర్చు కావడంతో ఫ్రెండ్స్‌ను అప్పు అడగాల్సి వచ్చింది. రెండోసారి మాత్రం నా ట్రావెల్ బడ్జెట్‌ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకున్నాను. దీంతో మిగులు డబ్బుతో తిరిగి వచ్చాను' అంటున్నాడు హైదరాబాద్‌కు చెందిన నివాస్.

రాబోయే సంవత్సరాలలో ట్రావెలింగ్‌పై మొగ్గు చూపే వారి సంఖ్య యువతలో భారీగా పెరగనుందని ఒక అంచనా.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
550	175
58,961	17,487

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,784	▲	108
డోజోన్స్	30,502	▲	317
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,937	▲	17
డాక్స్	12,766	▲	17
షాంఘై	3,081	▼	4
నికాయ్	27,156	▲	381

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
50,362	▼	76
బంగారం (99.5 స్వచ్ఛత)		
50,160	▼	76
వెండి (కిలో)		
56,010	▼	376

నిజామాబాద్‌లో జోస్ ఆలుక్కాస్ షోరూమ్

JOS ALUKKAS — A TRADITION OF FINE JEWELLERY

ప్రముఖ జ్యువెలరీ గ్రూప్ జోస్ ఆలుక్కాస్ నిజామాబాద్‌లో ఈ నెల 22వ తేదీ కొత్త షోరూమ్‌ను ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్ రోడ్, ద్వారకా నగర్‌లో ఏర్పాటుకానున్న ఈ షోరూమ్‌లో అత్యాధునిక ప్లాటినం, బంగారం, వెండి, వజ్రాభరణాల కలెక్షన్లు అందుబాటులో ఉంటాయని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన పేర్కొంది.షోరూమ్ ఏర్పాటును పురస్కరించుకుని కొనుగోళ్లపై భారీ ఆఫర్లను సైతం ఇస్తున్నట్లు తెలిపింది.

నగల అమ్మకాలు జిగేల్!

- ధనత్రయోదశి, దీపావళిపై భారీ ఆశలు
- దసరా సందర్భంగా 30 శాతం అధిక అమ్మకాలు
- కలిసొచ్చిన బంగారం ధరల క్షీణత



న్యూఢిల్లీ: ధనత్రయోదశి, దీపావళి సందర్భంగా బంగారం ఆభరణాల విక్రయాలు జోరుగా సాగుతాయని జ్యుయలరీ పరిశ్రమ అంచనాలతో ఉంది. ముఖ్యంగా దసరా సందర్భంగా ఆభరణాల విక్రయాలు 30 శాతం అధికంగా నమోదు కావడం, పరిశ్రమలో సానుకూల అంచనాలకు మద్దతునిస్తోంది. ఇదే ధోరణి దీపావళి పండుగ వరకు కొనసాగొచ్చని భావిస్తోంది. తదుపరి వివాహ శుభ ముహూర్తాలు కూడా ఉండడంతో అమ్మకాలపై బలమైన అంచనాలతో కంపెనీలు ఉన్నాయి. బంగారం ధరలు దిగిరావడానికి తోడు, ఆర్థిక కార్యకలాపాలు పూర్తి స్థాయిలో అనుమతించడం అనుకూలిస్తున్నట్టు పరిశ్రమ అంటోంది. ఆభరణాలకు వినియోగించే 22 క్యారట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.50వేల దిగువకు రావడం గమనార్హం. దసరా సమయంలో రూ.49,000 స్థాయిలో ఉన్న ధర ప్రస్తుతం ఇంకా తగ్గి రూ.46వేలకు దిగొచ్చింది. దీంతో దీపావళికి విక్రయాలు అంచనాలను మించుతాయని ఆభరణాల వర్తకులు భావిస్తున్నారు.

దసరా నుంచి సానుకూలత

దసరా నుంచి కొనుగోళ్లు సానుకూలంగా ఉన్నట్టు పీఎన్‌జీ జ్యువలర్స్ సీఎండీ సౌరభ్ గాడ్గిల్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే కస్టమర్లు రెట్టింపు విలువ మేరకు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. కస్టమర్లు ముందుగా బుక్ చేసుకుని, స్టోర్లకు వచ్చి తీసుకెళుతున్నట్టు తెలిపారు. టెంపుల్ జ్యువలరీ, ఆధునికతను జోడించుకున్న సంప్రదాయ డిజైన్లకు మద్దతు ఉన్నట్టు వివరించారు. మొత్తం మీద గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పండుగల సీజన్‌లో విక్రయాలు సమారు 30 శాతం అధికంగా ఉన్నట్టు తెలిపారు.

ద్రవ్యోల్బణ ప్రభావం పెద్దగా లేదు

ద్రవ్యోల్బణ ప్రభావం కస్టమర్ల కొనుగోళ్లను పెద్దగా ప్రభావితం చేయలేదని ఇండియా బులియన్ అండ్ జ్యుయలర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా పేర్కొన్నారు. దసరా విక్రయాల్లో ఇదే కనిపించిందని, ఆర్థిక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో అనుమతించడం కలిసొచ్చినట్టు చెప్పారు. దసరా నవరాత్రుల్లో విక్రయాలు బలంగా నమోదు కావడం, తదుపరి దీపావళి విక్రయాలకు మద్దతుగా నిలుస్తుందని పరిశ్రమ అంచనాతో ఉంది. ''దీపావళి సందర్భంగా విక్రయాలు మరింత అధికంగా ఉంటాయని అంచనా వేస్తున్నాం. గతేడాది దీపావళి విక్రయాలతో పోలిస్తే ఈ ఏడాది 40 శాతం అధికంగా ఉండొచ్చు. ఈ పండుగల సీజన్ పట్ల మేము ఎంతో ఆశావహంగా ఉన్నాం''అని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. ''దసరా సీజన్ బలంగా ఉంది. దీంతో దీపావళి, ధనత్రయోదశి విక్రయాలపై ఆశలతో ఉన్నాం. గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఈ సీజన్ గొప్పగా ఉంటుంది''అని సి. కృష్ణయ్య చెట్టి గ్రూప్ ఆఫ్ జ్యువలర్స్ ఎండీ సి. వినోద్ హయగ్రీవ్ పేర్కొన్నారు. ''దసరా సమయంలో మా స్టోర్లలో 30 శాతం అధిక విక్రయాలు నమోదయ్యాయి. మార్కెట్లో ఎంతో పెంటప్ డిమాండ్ (గతంలో నిలిచిన డిమాండ్ ఇప్పుడు పుంజుకోవడం) ఉంది. వినియోగదారులు బంగారం కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. పెట్టుబడుల కోణంలో కస్టమర్లు కాయిన్లను సైతం కొనుగోలు చేస్తున్నారు''అని జోయాలుక్కాస్ జ్యువలరీ సీఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

మిధానితో బోయింగ్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏరోస్పేస్ రంగంలో వినియోగించే పరికరాలకు అవసరమైన ముడి వస్తువులను దేశీయంగానే అభివృద్ధి చేసే అంశంపై మిశ్ర ధాతు నిగమ్ (మిధాని)తో కలిసి పనిచేసే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు బోయింగ్ ఇండియా వెల్లడించింది. ఏరోస్పేస్, రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రత్యేకమైన మెటీరియల్స్, మిశ్రమ లోహాల లభ్యత కీలకమని పేర్కొంది.



భారత్‌లోని తమ సరఫరా వ్యవస్థలో ప్రభుత్వ రంగ సంస్థలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలిల్ గుప్తే తెలిపారు. అధునాతన టెక్నాలజీ ఉత్పత్తులను దేశీయంగానే తయారు చేసే సామర్థ్యాలను పెంచుకునేందుకు బహుళ జాతి సంస్థలతో కలిసి పనిచేయాలన్న తమ లక్ష్యానికి అనుగుణంగా ఈ భాగస్వామ్యం ఉండగలదని మిధాని సీఎండీ సంజయ్ కుమార్ ఝా తెలిపారు.

పన్నులపై సూచనలు ఇవ్వండి

రానున్న బడ్జెట్‌పై పరిశ్రమను కోరిన ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2023–24) బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభించిన కేంద్ర ఆర్థిక శాఖ.. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విషయంలో తగు సూచనలు చేయాలంటూ పరిశ్రమ వర్గాలు, ట్రేడ్ అసోసియేషన్లను కోరింది. డిమాండ్లతో పాటు వాటి వెనుక గల హేతుబద్ధతను కూడా వివరిస్తూ తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించింది. సుంకాల స్వరూపం, పన్నుల రేట్లు మొదలైన వాటిల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన సిఫార్సులను పంపేందుకు నవంబర్ 5 ఆఖరు తేదీ. ప్రత్యక్ష పన్నుల రేట్లను క్రమబద్ధీకరించడంతో పాటు పన్ను ప్రోత్సాహకాలు, డిడక్షన్లు, మినహాయింపులు మొదలైనవి దశలవారీగా తొలగించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో తాజా బడ్జెట్‌పై ఆసక్తి నెలకొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-10-2022	
విశాఖ	450–00
చిత్తూరు	453–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	444–00
విజయవాడ	444–00
రిటైల్ ధర (డజను)	66.00
18-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

భారత్‌కు నిస్సాన్ గ్లోబల్ మోడల్స్

ఎక్స్–ట్రయల్, కష్కాయ్‌కి పరీక్షలు



న్యూఢిల్లీ: వాహన తయారీలో ఉన్న జపాన్ సంస్థ నిస్సాన్.. అంతర్జాతీయంగా విక్రయిస్తున్న స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్స్‌ను (ఎస్‌యూవీ) భారత మార్కెట్లో పరిచయం చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం దేశంలో మాగ్నైట్, కిక్స్ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. ఎక్స్–ట్రయల్, జూక్, కష్కాయ్ మోడళ్లు రంగ ప్రవేశం చేయనున్నాయి. ఎక్స్–ట్రయల్, కష్కాయ్ వాహనాలను ఇక్కడి మార్కెట్లో విడుదల చేయడంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. భారత రోడ్లపై ఈ రెండు మోడళ్ల పరీక్ష మొదలైందని వెల్లడించింది. భారతీయ రోడ్లు, విభిన్న భూభాగాలకు ఈ వాహనాలు అనుకూలమా కాదా అన్న అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. వినియోగదారుల అవసరాలను తీర్చగల సామర్థ్యాన్ని ఈ పరీక్షలు అంచనా వేస్తాయని కంపెనీ తెలిపింది. పరీక్షలు పూర్తి అయ్యాక సానుకూల ఫలితాలు వస్తే తొలుత ఎక్స్–ట్రయల్ ఎంట్రీ ఇవ్వనుంది. ఆ తర్వాత కష్కాయ్ కూడా రోడ్డెక్కనుంది.

ఉద్గారాలను బట్టి పన్ను..: వాహనాల పొడవు, ఇంజన్ పరిమాణం కంటే ఉద్గారాల ఆధారంగా ప్రయాణికుల వాహనాలపై పన్ను విధించడాన్ని భారతదేశం పరిగణించాలని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ రాకేష్ శ్రీవాస్తవ అన్నారు. 'ఆటోమొబైల్స్ ద్వారా వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి హైబ్రిడ్‌ల వంటి బహుళ సాంకేతికతలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఉద్గారాల స్థాయిని బట్టి వేర్వేరు పన్ను స్లాబ్‌లు ఉండాలి. ప్రభుత్వం ఇప్పటికే నాలుగు మీటర్ల లోపు, నాలుగు మీటర్ల కంటే పొడవు, ఇంధనం పరంగా భిన్నమైన పన్ను నిర్మాణాన్ని కలిగి ఉంది. జీఎస్టీ విధానం ప్రకారం కార్లపై 28 శాతం పన్నుతోపాటు సెస్ విధిస్తున్నారు. 4 మీటర్ల కంటే పొడవు ఉండే కార్లు, ఎస్‌యూవీలకు 50 శాతం, హైబ్రిడ్ వాహనాలకు 43 శాతం, ఎలక్ట్రిక్ వెహికిల్స్‌కు 5 శాతం జీఎస్టీ ఉంది.

యాక్సిస్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ: ప్రైవేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్ఆర్)ను అన్ని కాలపరిమితులపై 25 బేసిస్ పాయింట్లు పెంచింది. తక్షణం ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని పేర్కొంది. బ్యాంక్ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం మెజారిటీ ఖాతాలకు అనుసంధానంగా ఉండే ఏడాది కాల వ్యవధి రుణ రేటు 25 బేసిస్ పాయింట్లు పెరిగి, 8.35 శాతానికి చేరింది. ఏడాది, మూడు, ఆరు నెలల కాలపరిమితులకు రుణ రేట్లు పావుశాతం పెంపుతో 8.15 శాతం–8.30 శాతం శ్రేణికి చేరాయి. రెండు సంవత్సరాల ఎంసీఎల్ఆర్ 8.45 శాతంగా ఉంది. మూడేళ్ల రేటు 8.50 శాతానికి ఎగసింది. తదుపరి సమీక్ష వరకూ ఈ రేట్లు అమల్లో ఉంటాయని బ్యాంక్ ప్రకటన వివరించింది.



కొనసాగిన లాభాలు

- మూడోరోజూ మార్కెట్ ముందుకే
- సెన్సెక్స్ లాభం 550 పాయింట్లు
- 175 పాయింట్లు ఎగసిన నిఫ్టీ
- అన్ని రంగాల షేర్లకు డిమాండ్



ముంబై: జాతీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాలు కలిసిరావడంతో దేశీయ స్టాక్ సూచీలు మూడోరోజూ లాభపడ్డాయి. విస్తృత స్థాయిలో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మంగళవారం సెన్సెక్స్ 550 పాయింట్లు బలపడి 58,961 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 59 వేల స్థాయిని, నిఫ్టీ 17,500 స్థాయిని అందుకున్నప్పటికీ.., లాభాల స్వీకరణతో వెనక్కి వచ్చాయి. సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లలో ఐదు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 175 పాయింట్లు పెరిగి 17,487 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొనడంతో బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.71% ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.153 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,085 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి, యూరప్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ రాణించాయి.

మార్కెట్లో మరిన్ని విశేషాలు

- బ్లాక్ డీల్ ద్వారా 53 మిలియన్ల షేర్లు చేతులు మారిన నేపథ్యంలో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు మూడుశాతం లాభపడి రూ.271 వద్ద స్థిరపడింది.
- క్యూ2లో ఆదాయ వృద్ధి క్షీణించడంతో టాటా ఎలాక్సీ షేరు ఏడుశాతానికి పైగా నష్టపోయి రూ.7,203 వద్ద నిలిచింది.
- ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్ల ర్యాలీలో భాగంగా ఎస్‌బీఐ షేరు మూడున్నర శాతం లాభపడి రూ.562 వద్ద నిలిచింది. సెన్సెక్స్ 30 షేర్లలో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.

జాబ్ పాయింట్

ఎస్‌బీఐలో 1422 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులు

ప్రభుత్వ రంగ బ్యాంక్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌బీఐ సర్కిళ్లలో 1422 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్ సర్కిల్‌లో 176 ఖాళీలు ఉన్నాయి. ఎంపికైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సర్కిల్/రాష్ట్రంలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

» పోస్టు: సర్కిల్ బేస్డ్ ఆఫీసర్లు
» మొత్తం పోస్టుల సంఖ్య: 1422
» ఎస్‌బీఐ సర్కిళ్లు: భోపాల్, భువనేశ్వర్, హైదరాబాద్, జైపూర్, కోల్‌కతా, మహారాష్ట్ర, నార్త్ ఈస్టర్న్.
» అర్హతలు:గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి.
» వయసు: 30.09.2022 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు ప్రారంభ బేసిక్ పే రూ.36,000 లు ఉంటుంది. రూ.36,000 -రూ.63,840 శ్రేణిలో వేతనం లభిస్తుంది.
» ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: 18.10.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:7.11.2022
» హాల్‌టికెట్ డౌన్‌లోడ్: నవంబర్/డిసెంబర్ 2022
» ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: 04.12.2022
» వెబ్‌సైట్: https://bank.sbi/web/careers

ఏపీ వైద్యశాఖలో 400 వైద్య పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, ఇతర గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేందుకు వివిధ వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 400(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్–300 పోస్టులు; ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్–100 పోస్టులు)
» విభాగాలు: రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్, పాథాలజీ, కార్డియాలజీ, యూరాలజీ, న్యూరోసర్జరీ, పెడియాట్రిక్ సర్జరీ, జనరల్ మెడిసిన్.
» అర్హతలు: ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా/డీఎన్‌బీ ఉత్తీర్ణత ఉండాలి.
» వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» వేతనాలు: నెలకు రూ. 61,960 నుంచి రూ.1,60,000 వరకూ అందుతుంది.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
» ఇంటర్వ్యూ తేదీలు: అక్టోబర్ 19, 20, 21.
» ఇంటర్వ్యూ వేదిక: ఆఫీస్ ఆఫ్ ద డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఓల్డ్ జీజీహెచ్ క్యాంపస్, హనుమాన్ పేట్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్–520003.
» వెబ్‌సైట్: https://dme.ap.nic.in

ఎగ్జిమ్ బ్యాంక్‌లో 41 మేనేజ్‌మెంట్ ట్రైనీ, మేనేజర్ పోస్టులు

ముంబైలోని ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు షెడ్యూల్ కులాలు/షెడ్యూల్డ్ తెగలు/ఇతర వెనుకబడిన తరగతుల కోసం స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 45
» పోస్టుల వివరాలు: మేనేజర్(లా)–2, మేనేజర్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)–2, మేనేజ్‌మెంట్ ట్రైనీ (కార్పొరేట్ లోన్‌లు–అడ్వాన్స్‌లు/ప్రాజెక్ట్ ఫైనాన్స్/క్రెడిట్ లైన్స్/ఇంటర్నల్ క్రెడిట్ ఆడిట్/రిస్క్ మేనేజ్‌మెంట్/కంప్లయన్స్/ట్రెజరీ అండ్ అకౌంట్స్/రికవరీ తదితరాలు)–41.
» అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ(లా), బీఈ, బీటెక్, ఎంబీఏ, పీజీడీబీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:04.11.2022
» ఆన్‌లైన్ పరీక్ష తేది:నవంబర్–డిసెంబర్ 2022
» ఇంటర్వ్యూ తేదీలు: జనవరి–ఫిబ్రవరి 2023.
» వెబ్‌సైట్: www.eximbankindia.in

ఐఐటీ, హైదరాబాద్‌లో టెక్నికల్ సూపరింటెండెంట్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా కందిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ టెక్నికల్ సూపరింటెండెంట్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01
» అర్హత: బీఈ, బీటెక్, ఎంసీఏ,ఎంఎస్సీ లేదా ఎంఈ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 40 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:31.10.2022
» వెబ్‌సైట్: https://iith.ac.in

సైబర్ సెక్యూరిటీ.. జాబ్ గ్యారెంటీ!

» సరిపడ నైపుణ్యాలుంటే అద్భుత ఆఫర్స్
» డిజిటలైజేషన్‌తో పెరుగుతున్న డిమాండ్
» నిపుణుల కోసం అన్వేషిస్తున్న సంస్థలు



నేడు డిజిటల్ యుగం. ఇంటర్నెట్ ఆధారితంగా ఆన్‌లైన్ కార్యకలాపాలు! చిన్న తరహా సంస్థల నుంచి బహుళ జాతి కంపెనీల వరకూ.. అంతా ఆన్‌లైన్‌మయం! స్మార్ట్ ఫోన్ మొదలుస్పేస్ రీసెర్చ్ దాకా.. అన్నింటా డిజిటల్ అడుగులు!! ఇలాంటి పరిస్థితుల్లో ఎదురవుతున్న ప్రధాన సమస్య.. హ్యాకింగ్, ఫిషింగ్! వ్యక్తుల నుంచి మొదలు వ్యవస్థల వరకూ అందరినీ ఆందోళనకు గురి చేస్తున్న అంశం.. సైబర్ అటాక్స్! ఈ సైబర్ దాడులను అడ్డుకునే వారే.. సైబర్ సెక్యూరిటీ నిపుణులు!! ఈ విభాగంలో నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. ఉజ్వల అవకాశాలు అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. సైబర్ సెక్యూరిటీలో కెరీర్ అవకాశాలు, అవసరమవుతున్న అర్హతలు, టెక్ స్కిల్స్, నైపుణ్యాలు అందుకునేందుకు మార్గాలు తదితర అంశాలపై విశ్లేషణ..

'మీ ఫోన్‌లో అవాంఛిత యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేయొద్దు. అలా చేస్తే హ్యాకర్ల బారిన పడి.. మీ వ్యక్తిగత డేటా చౌర్యానికి గురయ్యే ప్రమాదం ఉంది'–ఇటీవల కాలంలో తరచూ వస్తున్న మెసేజ్‌లు!! మరోవైపు హ్యాకింగ్ బారిన పడి కోట్లు కోల్పోయిన సంస్థలు, లక్షలు పోగొట్టుకుంటున్న వ్యక్తుల గురించి రోజూ వార్తల్లో వింటూనే ఉన్నాం. అందుకే సంస్థలు ప్రస్తుతం సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయి.

ఐటీ టు ఎడ్‌టెక్

ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ సెక్యూరిటీ అనేది ఐటీ నుంచి సర్వీస్ సెక్టార్ వరకూ.. అన్ని రంగాల్లోనూ తప్పనిసరిగా మారింది. ఐటీ, క్లౌడ్ సర్వీసెస్, ఈ–కామర్స్, రిటైల్ సెక్టార్, హెల్త్‌కేర్, ఎడ్‌టెక్, ఫిన్‌టెక్, బీఎఫ్ఎస్ఐలలో సైబర్ భద్రత అత్యంత కీలకం. కారణం.. ఈ రంగాల్లోని సంస్థలు ఆన్‌లైన్ విధానంలో ఎంతో విలువైన సేవలు అందిస్తుండటమే.

'ఆన్‌లైన్' భద్రతే.. సైబర్ సెక్యూరిటీ

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరికరాలను వినియోగించి.. ఆన్‌లైన్ కార్యకలాపాల భద్రతను కాపాడటాన్ని సైబర్ సెక్యూరిటీగా పేర్కొనొచ్చు. కంప్యూటర్లు, నెట్‌వర్క్ సిస్టమ్స్,సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్,డేటా.. చోరీ (హ్యాకింగ్)కి గురికాకుండా... సైబర్ సెక్యూరిటీ రక్షణగా నిలుస్తుంది. దీంతో ఆన్‌లైన్ విధానంలో కార్యకలాపాలు నిర్వహించే చిన్నపాటి సంస్థల నుంచి బహుళ జాతి కంపెనీలు, ప్రభుత్వ శాఖల్లో సైబర్ సెక్యూరిటీ నిపుణుల అవసరం పెరిగింది.

భారీగా నియామకాలు

• పలు రిక్రూటింగ్, స్టాఫింగ్ సంస్థల అంచనాల ప్రకారం– ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో 30 లక్షల మంది సైబర్ నిపుణుల కొరత నెలకొంది. • రానున్న మూడేళ్లలో మన దేశంలో 15 లక్షల మంది సైబర్ సెక్యూరిటీ నిపుణుల అవసరం ఉంటుందని అంచనా. • గత ఏడాది కాలంలోనే ఈ విభాగంలో నియామకాలు దాదాపు 40 శాతం మేర వృద్ధి చెందాయి. • డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం–2022 చివరికి దాదాపు పది లక్షల మంది సైబర్ సెక్యూరిటీ నిపుణుల అవసరం ఉంటుంది. • టీమ్‌లీజ్ సంస్థ అంచనా ప్రకారం –ఈ రంగంలో డిమాండ్–సప్లయ్ మధ్య వ్యత్యాసం 70 శాతంగా ఉంది.

నిపుణుల కొరత

ఈ రంగంలో భారీగా నియామకాలు జరుగుతున్నప్పటికీ.. సంస్థలు నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇటీవల ఐఎస్ఏసీఏ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం–సైబర్ సెక్యూరిటీ విభాగంలో నిపుణుల పోస్టులను భర్తీ చేయలేకపోతున్నామని 49 శాతం సంస్థలు చెప్పడమే ఇందుకు నిదర్శనం. అదే విధంగా సోఫోస్ సర్వే ప్రకారం–60 శాతం సంస్థలు సైబర్ సెక్యూరిటీ నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నాయి.

ఎవరైనా నేర్చుకోవచ్చు

సైబర్ సెక్యూరిటీ పేరు వినగానే కంప్యూటర్ సైన్స్/ఐటీ కోర్సుల విద్యార్థులే సరితూగుతారు అనే అభిప్రాయం కలగడం సహజం. వాస్తవానికి అన్ని నేపథ్యాల విద్యార్థులు ఈ విభాగంలో కొలువుదీరే అవకాశం ఉంది. అయితే టెక్నికల్ గ్రాడ్యుయేట్స్‌కు కొంత ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఐటీ అప్లికేషన్స్‌కు సంబంధించిన బేసిక్స్‌పై టెక్నికల్ గ్రాడ్యుయేట్స్‌కు అవగాహన ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. సంప్రదాయ డిగ్రీ విద్యార్థులు సైతం సైబర్ సెక్యూరిటీ సంబంధిత కోర్సుల్లో అడుగు పెట్టి..ఇంటర్నెట్, డేటా మేనేజ్‌మెంట్/ఇన్ఫర్మేషన్,ఎథికల్ హ్యాకింగ్ తదితర అంశాల్లో పట్టు సాధిస్తే.. కెరీర్ అవకాశాలు దక్కించుకోవచ్చు.

ప్రధాన విభాగాలు ఇవే

సైబర్ సెక్యూరిటీలో ప్రధానమైనవి.. • డేటా సెక్యూరిటీ • అప్లికేషన్ సెక్యూరిటీ • ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ అండ్ సెక్యూరిటీ మానిటరింగ్ • క్లౌడ్ సెక్యూరిటీ.

డేటా సెక్యూరిటీ

సైబర్ సెక్యూరిటీ కోణంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన విభాగంగా దీన్ని పేర్కొనొచ్చు. ఆన్‌లైన్ సేవలు అందించే క్రమంలో సంస్థలు డేటా మేనేజ్‌మెంట్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తాయి. ఆయా సంస్థల క్లయింట్ కంపెనీలు, వారి యూజర్లకు సంబంధించిన వివరాలు, అదే విధంగా తాము వారికి అందిస్తున్న సర్వీసులకు సంబంధించిన ప్రాథమిక సమాచారం భద్రంగా నిక్షిప్తం చేసుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం కూడా తప్పనిసరే. ఇలా డేటా నిక్షిప్తం, అప్‌డేట్ సమయంలో చిన్నపాటి తప్పిదం జరిగినా.. ఎంతో విలువైన సమాచారం హ్యాకర్ల చేతికి చిక్కే ఆస్కారముంది. ఇలాంటి పరిస్థితుల్లో డేటా పటిష్ట నిర్వహణ, ఏ స్థాయిలోనూ డేటా ఇతరులకు చిక్కే వీలు లేకుండా చూసే విభాగమే.. డేటా సెక్యూరిటీ.

ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్,సెక్యూరిటీ మానిటరింగ్

ఇది పూర్తిగా కోర్ డొమైన్స్‌కు సంబంధించిన విభాగం. సంస్థలు సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చిన సమాచారంలో మార్పుచేర్పులు, భద్రత విషయంలో తీసుకోవాల్సిన చర్యలను సదరు ప్రోగ్రామర్స్/సంస్థలకు సూచించే నైపుణ్యాలు ఈ విభాగంలో ఉంటాయి.

అప్లికేషన్ సెక్యూరిటీ

ఒక ప్రోగ్రామ్‌ను రూపొందించే క్రమంలో అప్లికేషన్ సమయంలోనే పటిష్టమైన భద్రత విధానాలు సిద్ధం చేసే విభాగం.. అప్లికేషన్ సెక్యూరిటీ.

ఐటీ సెక్యూరిటీ

ఆన్‌లైన్ మోసాలను అరికట్టడం, సురక్షిత అప్లికేషన్స్‌ను రూపొందించడం వంటి కార్యకలాపాలను ఐటీ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్ నిర్వహిస్తారు. హ్యాకింగ్ చేసిన డొమైన్ /ఐపీ వివరాలు; ఎక్కడ నుంచి హ్యాక్ చేశారు అనే విషయాలు గుర్తించడం; హ్యాకింగ్ క్రమంలో సదరు సంస్థ వెబ్‌సైట్‌లో హ్యాకర్లు అప్‌లోడ్ చేసిన ఫేక్ అంశాలను గుర్తించి తొలగించడం వంటివి చేస్తారు. అంతేకాకుండా లాన్(లోకల్ ఏరియా నెట్‌వర్క్) సెక్యూరిటీ; సర్వర్ సెక్యూరిటీ; రూటర్ సెక్యూరిటీ; డిజిటల్ సెక్యూరిటీ విభాగాల్లోనూ ఐటీ సెక్యూరిటీ నిపుణుల అవసరం పెరుగుతోంది.

సర్కారీ కొలువులు కూడా

సైబర్ సెక్యూరిటీ నిపుణులకు సర్కారీ కొలువులు కూడా లభిస్తున్నాయి. ప్రభుత్వ విభాగాలు సైతం డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తుండటమే ఇందుకు కారణం. ప్రభుత్వాలు అమలు చేస్తున్న డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పథకాలు, బ్లాక్ చైన్ టెక్నాలజీ వినియోగం తదితరాల కారణంగా.. ప్రభుత్వ విభాగాల్లో కూడా సైబర్ సెక్యూరిటీ నిపుణుల అవసరం ఏర్పడింది.

అకడమిక్ మార్గాలు

సైబర్ సెక్యూరిటీ నిపుణులకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ప్రస్తుత పలు యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు అకడమిక్ స్థాయిలోనే సదరు సైబర్ స్కిల్స్ నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీ/ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ప్రోగ్రామ్‌లను రూపొందిస్తున్నాయి.

సర్టిఫికేషన్లు తప్పనిసరి

సైబర్ సెక్యూరిటీ విభాగంలో ప్రవేశించడానికి జనరల్ డిగ్రీ మొదలు, ఐటీ ప్రొఫెషనల్స్ వరకు అందరూ అర్హులే. ఈ విభాగంలో ప్రత్యేకంగా శిక్షణనిచ్చే సర్టిఫికేషన్లు ఉన్నాయి.వాటిలో ముఖ్యమైనవి..

- సిస్కో సంస్థ అందించే.. సీసీఎన్ఏ సెక్యూరిటీ; సీసీఎన్‌పీ సెక్యూరిటీ; సీసీఐఈ సెక్యూరిటీ: వెబ్‌సైట్: www.cisco.com
- EC కౌన్సిల్ నిర్వహించే.. సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్: వెబ్‌సైట్: www.eccouncil.org
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ కోర్సులు: వెబ్‌సైట్: www.iisecurity.in
- డేటా సెక్యూరిటీ కౌన్సిల్ అందించే సర్టిఫికేషన్ కోర్సులు; వెబ్‌సైట్: www.dsci.in

పీజీలో ప్రత్యేక స్పెషలైజేషన్‌గా

- పీజీ స్థాయిలో ఎంటెక్, ఎంసీఏలలో ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని అందిస్తున్న కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు.. జేఎన్‌టీయూ–హైదరాబాద్: వెబ్‌సైట్: www.jntuh.ac.in
- ఐఐఐటీ–అలహాబాద్: వెబ్‌సైట్: www.clis.iiita.ac.in
- సీడాక్: వెబ్‌సైట్: www.cdac.in
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ: వెబ్‌సైట్: www.imt.edu

ఐఐటీలు, ఎన్ఐటీలు కూడా ఎంటెక్ స్థాయిలో సైబర్ సెక్యూరిటీ/ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ పేరుతో స్పెషలైజేషన్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. గేట్ స్కోర్ ఆధారంగా వీటిలో ప్రవేశం పొందొచ్చు.

సైబర్ సెక్యూరిటీ.. ముఖ్యాంశాలు

• ఈ ఏడాది చివరి నాటికి పది లక్షల మంది సైబర్ నిపుణుల అవసరం. •కన్సల్టింగ్ సంస్థ మైకేల్ పేజ్ అంచనా ప్రకారం–2025 చివరికి భారత్‌లో 15 లక్షల మంది సైబర్ నిపుణుల కొరత. •పలు రిక్రూటింగ్, కన్సల్టింగ్ సంస్థల అంచనా ప్రకారం–గతేడాది కాలంలో ఈ రంగంలో 40శాతం మేర నియామకాల సంఖ్య పెరిగింది. •మానవ వనరుల డిమాండ్–సప్లయ్ మధ్య వ్యత్యాసం 70శాతంగా నమోదు. • పీజీ స్థాయిలో స్పెషలైజేషన్‌గా సైబర్ సెక్యూరిటీ. • పలు సంస్థల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సర్టిఫికేషన్స్.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

- కొనసాగుతున్న భక్తుల రద్దీ
- గ్రహణాలున్నందున ఈ నెల 25, నవంబర్ 8న ఆలయ తలుపుల మూత
- గ్రహణాలు ముగిసిన తర్వాత సర్వదర్శనం భక్తులకే అనుమతి



తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 31 క్యూ కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,067 మంది వేంకటేశ్వరస్వామిని దర్శించుకోగా.. 33,092 మంది తలనీలాలు ఇచ్చారు. భక్తులు కానుకల రూపంలో రూ.4.61 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శనానికి 12 గంటలు.. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

24న దీపావళి ఆస్థానం

తిరుమల ఆలయంలో టీటీడీ ఈనెల 24న 'దీపావళి ఆస్థానాన్ని' నిర్వహించనుంది. ఉదయం 7 గంటల నుంచి ఉదయం 9 వరకు బంగారు వాకిలి ముందున్న ఘంటా మండపంలో దీనిని నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి 7 వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని.. ఆలయ మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షిస్తారు. దీపావళి ఆస్థానం నిర్వహిస్తున్నందున 24న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

25న ఆలయ తలుపుల మూత..

ఈనెల 25న సూర్యగ్రహణం, నవంబర్ 8న చంద్రగ్రహణం కారణంగా ఆయా రోజుల్లో 12 గంటల పాటు తిరుమల ఆలయ తలుపులను మూసివేయనున్నారు. ఆర్జిత సేవలను కూడా టీటీడీ రద్దు చేసింది. సర్వదర్శనం భక్తులను మాత్రమే అనుమతించనుంది. 25వ తేదీ సాయంత్రం 5.11 గంటల నుంచి 6.27 వరకు సూర్యగ్రహణం కనుక.. ఉదయం 8.11 నుంచి రాత్రి 7.30 వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. అనంతరం సర్వదర్శనం భక్తులను అనుమతిస్తారు. నవంబర్ 8వ తేదీ మధ్యాహ్నం 2.39 నుంచి సాయంత్రం 6.27 వరకు చంద్రగ్రహణం కనుక.. ఉదయం 8.40 నుంచి రాత్రి 7.20 వరకు ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. ఆరోజు కూడా సర్వదర్శనం భక్తులనే అనుమతిస్తారు.

కృష్ణా జలాలపై విచారణ డిసెంబర్ 6కు వాయిదా

ఉత్తర్వులు జారీ చేసిన సుప్రీం కోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల వివాదంపై దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు డిసెంబరు 6కు వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పార్డీవాలాలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2013లో సవరించిన తీర్పునే అమలు చేయాలని కోరుతూ కర్ణాటక దాఖలు చేసిన పిటిషన్‌ను, ఇతర వ్యాజ్యాలను ధర్మాసనం మంగళవారం విచారించింది. కర్ణాటక తరఫు న్యాయవాది మోహన్ కటార్కి, 177 టీఎంసీల అదనపు మిగులు జలాలను ట్రిబ్యునల్ కర్ణాటకకు కేటాయించిందని వివరించారు. ఎన్నిసార్లు కోరినా నీటి వినియోగ వివరాలు కర్ణాటక ఇవ్వడంలేదని తెలంగాణ తరఫు న్యాయవాది వైద్యనాథన్ తెలిపారు. ట్రిబ్యునల్ తుది అవార్డు ప్రకారం నీటి లభ్యత 75శాతం పరిగణనలోకి తీసుకుంటారన్నారు. నీటి కేటాయింపులో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మహారాష్ట్ర న్యాయ వాది దీపక్ నార్‌గోల్కర్ వాదనలు వినిపిస్తూ కావేరి తదితర నదీ జలాలపై ట్రిబ్యునళ్ల తీర్పులు గెజిట్‌లో పొందుపరిచారని, కృష్ణాజలాల వివాదం పై ట్రిబ్యునల్ తీర్పు గెజిట్‌లో ఎందుకు ప్రచురించడంలేదో అర్థం కావడంలేదన్నారు. దీంతో అన్ని వ్యాజ్యాలను డిసెంబరు 6న విచారిస్తామని కోర్టు తెలిపింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా


బుధవారం । 19 । అక్టోబర్ । 2022



తిరుపతమ్మ సేవలో..
పెనుగంచిప్రోలు: తమిళనాడుకు చెందిన కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు మురుగన్, రవిచంద్రన్ మంగళవారం తిరుపతమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ చెన్నకేశవరావు వారిని సత్కరించారు.



జాబ్ మేళాలో 390 మంది ఎంపిక
విజయవాడలోని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 390 మంది ఎంపికయ్యారు. -IIలో▸



పులిచింతల నీటినిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.6840 టీఎంసీలు. ఎగువ నుంచి 3,16,750 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 3,03,046 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

నేడు వణుకూరుకు కేరళ మంత్రి
పెనమలూరు/పెదపారుపూడి: వణుకూరు గ్రామంలో కేరళ పశుసంవర్ధక, పాడి అభివృద్ధి శాఖ మంత్రి జె.చించురాణి బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ఆమె వణుకూరుకు వస్తారు. గ్రామంలో రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, సచివాలయాన్ని సందర్శించి, అందుతున్న సేవలు పరిశీలిస్తారు. ఆ తరువాత డాక్టర్ వైఎస్సార్ సంచార ఆరోగ్యసేవ వాహనాలు పరిశీలించి సిబ్బందితో మాట్లాడతారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. అనంతరం పెదపారుపూడి మండలంలోని యలమర్రు గ్రామానికి ఆమె రానున్నట్లు పశువైద్యుడు డాక్టర్ జయంత్ తెలిపారు. గ్రామానికి చెందిన వల్లభనేని భాను వద్ద ఉన్న లోకల్ ఆవుల జాతిని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థి ఎంపిక



నాగాయలంక(అవనిగడ్డ): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆకునూరు హేమచంద్ర సాయి జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అన్నపరెడ్డి రామారావు మంగళవారం తెలిపారు. గత నెల 30వ తేదీన ఆన్‌లైన్‌లో జరిగిన రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌లో హేమచంద్ర ప్రదర్శించిన ఎకో ఫ్రెండ్లీ లార్విసైడ్ ప్రాజెక్ట్ పలువురి ప్రశంసలు పొంది, విజేతగా నిలిచినట్లు సోమవారం సర్టిఫికెట్ పంపారని విద్యార్థికి తర్ఫీదు ఇచ్చిన గైడ్‌టీచర్ కొమ్మినేని ఉదయ కుమార్ వివరించారు.

నేడు బీఎస్ఎన్ఎల్ మెగా మేళా
మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఉమ్మడి కృష్ణాజిల్లాలో బుధవారం బీఎస్ఎన్ఎల్ మెగా మేళా నిర్వహించనున్నట్లు విజయవాడ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ వై. రవీంద్రనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెగా మేళాలో బీఎస్ఎన్ఎల్ కొత్త ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్, ఎఫ్‌టీటీహెచ్, బీఎస్ఎన్ఎల్ ఫ్రీ మొబైల్ సిమ్‌కార్డులు లభిస్తాయన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు ఉచితంగా బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు ఇవ్వటంతో పాటు ఆకర్షణీయమైన రీచార్జి పథకాలను అందిస్తారని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలలో సంప్రదించవచ్చన్నారు.

21న జాబ్‌మేళా
మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 21వ తేదీన నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్ కుమార్ తెలిపారు. సుమారు 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వారి సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేస్తారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, బీ-టెక్, ఫార్మసీ అర్హత కలిగిన వారు ఈ మేళాకు హాజరు కావచ్చన్నారు. అర్హతలు, ఆసక్తి ఉన్న వారు శుక్రవారం ఉదయం 10 గంటల లోగా ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 77996 69907, 90326 33548లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

బిలియర్డ్స్‌లో చాంపియన్‌గా రైల్వే ఉద్యోగి దుర్గాప్రసాద్



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ముంబైలో జరుగుతున్న ఆల్ ఇండియా బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ రైల్వే డివిజన్ ఉద్యోగి ఎల్.దుర్గాప్రసాద్ బంగారు పతకం సాధించి రెండోసారి చాంపియన్‌గా నిలిచాడు. దక్షిణ మధ్య రైల్వే బిలియర్డ్స్ టీంకు ప్రాతినిధ్యం వహిస్తున్న దుర్గాప్రసాద్ విజయవాడ డివిజన్ రాజమండ్రిలో మెకానికల్ విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం ముంబైలో జరిగిన ఆల్ ఇండియా రైల్వే క్యూ స్పోర్ట్స్‌లో బిలియర్డ్స్, స్నూకర్స్, 8 బాల్, 9 బాల్, 9 రెడ్ వంటి వ్యక్తిగత ఈవెంట్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి బంగారు పతకం సాధించాడు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి డివిజన్‌కు గుర్తింపు తీసుకువచ్చిన దుర్గాప్రసాద్‌ను డీఆర్ఎం శివేంద్రమోహన్‌తో పాటుగా ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బి.టి, సీనియర్ డీఎంఈ రవి కిరణ్ ప్రత్యేకంగా అభినందించారు.

స్పాట్ గుట్టు రట్టు!

- స్పా, సెలూన్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- విజయవాడలో వారం రోజులుగా కొనసాగుతున్న పోలీసుల దాడులు
- ఇప్పటికే 60 స్పా సెంటర్లలో తనిఖీలు
- 46 సెంటర్లకు తాళాలు
- ఏడుగురు నిర్వాహకులు అరెస్టు



విజయవాడలోని ఓ స్పా సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: స్పా, సెలూన్లు, వెల్‌నెస్ సెంటర్లు, బ్యూటీ పార్లర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై విజయవాడ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. గత వారం రోజులుగా వీటిపైన పోలీసులు విస్తృతంగా దాడులు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు డీసీపీ విశాల్ గున్నీ నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 18 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొంటున్నాయి.

'స్పా'ట్ పెట్టారు..

నగరంలో మాచవరం, మొగల్రాజపురం, బెంజిసర్కిల్ తదితర ప్రాంతాల్లో 190కి పైగా స్పా సెంటర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిలో ఇప్పటికే 60 స్పాలపై దాడులు చేసి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 46 స్పాలను సీజ్ చేశారు. పోలీసులు దాడులు చేస్తుండటంతో కొన్ని స్పాలను నిర్వాహకులు మూసివేశారు. అలాంటి వాటిపైనా పోలీసులు దృష్టి సారించి వివరాలు సేకరిస్తున్నారు. విజయవాడ నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

వీటిపై దృష్టి..

ప్రధానంగా వీరి తనిఖీల్లో నిబంధనల ప్రకారం వ్యాపార నిర్వహణ కోసం లైసెన్సు తీసుకొన్నారా లేదా? ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించారా లేదా? వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. చాలా వాటికి ఇలాంటి అనుమతులు లేకుండానే అనధికారికంగా నడుపుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కొన్ని సెంటర్లలో స్పా, మసాజ్‌ల పేరుతో ఏకంగా క్రాస్ మసాజ్ జరుగుతున్నట్లు గుర్తించారు. ఇలా ఇప్పటి వరకు దివ్య యూనిసెక్స్ అండ్ బ్యూటీ సెలూన్, గోల్డెన్ ఓక్స్, హనీ బ్యూటీస్పా, ఫర్ యూ ఫ్యామిలీ సెలూన్ సెంటర్లలో క్రాస్ మసాజ్ జరుగుతున్నట్లు గుర్తించి, అందుకు తగిన ఆధారాలు లభించడంతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ఏడుగురు స్పా నిర్వాహకులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. 18 మంది విటులను అదుపులోకి తీసుకున్నారు. 28 మంది యువతులను ఈ మురికి కూపం నుంచి కాపాడి, వారిని తాత్కాలికంగా హోమ్స్‌లో ఉంచి వారి సొంత ఊళ్లకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు.

పేరు మాత్రమే ఫ్యామిలీ..

చాలా సెంటర్లు ఫ్యామిలీ స్పాలంటూ పేర్లు పెట్టి గుట్టుచప్పుడు కాకుండా క్రాస్ మసాజ్ చేయిస్తున్నారు. ఇందుకోసం ఢిల్లీ, హరియాణా, ఈశాన్య రాష్ట్రాలు, థాయ్‌ల్యాండ్ చెందిన యువతులను తెచ్చి వీరితో క్రాస్ మసాజ్‌తో పాటు వ్యభిచారం కూడా చేయిస్తున్నట్లు తెలుస్తోంది. యువతుల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని, డబ్బు ఆశ చూపి, ఇక్కడికి వచ్చాక బలవంతంగా ఈ మురికికూపంలో దించుతున్నట్లు సమాచారం. ఈ తరహా స్పాల్లోకి వెళ్లేందుకు నిర్వాహకులు హై సెక్యూరిటీ సిస్టం ఏర్పాటు చేసుకున్నారు. ఫింగర్ ప్రింట్ పెడితేనే లోపలికి అనుమతి ఉంటుంది. మొదట సాధారణ మసాజ్ సెంటర్‌లాగే నిర్వహించి.. ఆ తర్వాత నెమ్మదిగా కస్టమర్లను తమ మార్గంలోకి మలచుకుంటున్నట్లు తెలుస్తోంది. స్పాలోకి వెళ్లే విటుల నుంచి కూడా పెద్ద మొత్తంలో గుంజుతున్నట్లు సమాచారం.

గట్టి నిఘా..

విజయవాడలో ఈ విష సంస్కృతి ప్రబలకుండా, వీటిపైన పోలీసులు గట్టి నిఘా పెట్టారు. ఆయా స్పా నిర్వాహకులకు పెద్ద తలకాయలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? ఈ స్పాల నిర్వహణలో పోలీసుల సహకారం ఏమైనా ఉందా? అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. రాష్ట్ర నిఘా వర్గాలు ఈ వ్యవహారంపైన సమాచారం సేకరిస్తున్నాయి.

ఉపేక్షించేది లేదు..



స్పా సెంటర్లలో తనిఖీలు కొనసాగుతున్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ఇటీవల మూసి వేసిన స్పాల గురించి కూడా ఆరా తీస్తున్నాం. ఆయా స్పాలను ఎప్పుడు మూసివేశారు? దాని నిర్వాహకులు ఎవరూ? గతంలో ఎన్నిరోజుల పాటు నిర్వహించారు? వంటి అంశాలను పరిశీలిస్తున్నాం. నగరంలోని ఏ ప్రాంతాలలోనైనా ఇలాంటివి జరిగితే.. 7328909090 (వాట్సాప్)కుగానీ, డయల్100గానీ సమాచారం ఇవ్వవచ్చు. వీటితో పాటు ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా కూడా తెలుపవచ్చు. సమాచారం ఇచ్చే వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతాం. నిర్భయంగా సమాచారం ఇవ్వవచ్చు.

– విశాల్ గున్నీ, డీసీపీ, ఎన్టీఆర్ జిల్లా

సభావేదికను పరిశీలిస్తున్న మంత్రి జోగి, కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్సీ తలశిల, ఎస్పీ జాషువా



పండుగలా నిర్వహిద్దాం

- ముఖ్యమంత్రి అవనిగడ్డ పర్యటనపై మంత్రి జోగి రమేష్ సమీక్ష
- ఎమ్మెల్సీ తలశిల, జిల్లా అధికారులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

అవనిగడ్డ: నిషేధిత జాబితాలో భూములు కలిగిన రైతు కుటుంబాల ఏడేళ్ల నిరీక్షణకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తెరదించారని.. ఈనెల 20 తేదీన అవనిగడ్డలో జరిగే సీఎం బహిరంగ సభను పండుగలా చేసుకుందామని మంత్రి జోగి రమేష్ పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలసి మంత్రి జోగి రమేష్ సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక డిగ్రీ కళాశాల మనటీవీ భవనంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం బహిరంగసభ పెడనలో విజయవంతం అయ్యిందని, అంతకంటే గొప్పగా అవనిగడ్డ సభ జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వేలాది మంది రైతులు, ప్రజలు తరలి రానున్న ఈ సభలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ సభకు వచ్చేవారు స్పందన అర్జీలు తీసుకోవడానికి ప్రత్యేక కౌంటర్‌ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతి అర్జీ రికార్డు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలుత వేకనూరులోని సీఎం హెలిప్యాడ్ ప్రాంతాన్ని వారు పరిశీలించారు. జిల్లా ఎస్పీ జాషువా, ఎమ్మెల్యే సింహాద్రి, జేసీ మహేష్‌కుమార్ రావిరాల, డీపీవో వెంకటేశ్వర్లు, డీఈవో తాహెరా సుల్తానా, ఆర్డీవో కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారమే పనులు

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



పనులను పరిశీలిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): మాస్టర్ ప్లాన్ ప్రకారమే దుర్గగుడి అభివృద్ధి పనులు చేపట్టాలని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నూతనంగా నిర్మించనున్న ప్రసాదాల పోటు, అన్నదాన భవనం, కనకదుర్గనగర్‌లో అభివృద్ధి పనులపై మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. దుర్గగుడి అభివృద్ధి నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించిన రూ. 70 కోట్లకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సూచించారు. తొలుత కనకదుర్గానగర్‌కు చేరుకున్న మంత్రి కొట్టు సత్యనారాయణ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన అంశాల గురించి దేవదాయ శాఖ అధికారులతో చర్చించారు. భవిష్యత్తులో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులెవరైనా సరే కనకదుర్గానగర్, మహామండపం మీదగానే ఆలయానికి చేరుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా అన్నదాన భవనం, ప్రసాదాల పోటు భవనానికి సంబంధించి స్థల కొలతను సేకరించి భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా నిర్మించాలని సూచించారు. మంత్రి వెంట దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ ఎస్. శ్రీనివాస్, స్థపతి పరమేశ్వరప్ప, దుర్గగుడి ఈవో భ్రమరాంబ, దుర్గగుడి ఈఈలు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీకి ఆడిట్ సర్టిఫికెట్



హేమచంద్రారెడ్డి చేతుల మీదిగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న వర్సిటీ వీసీ చంద్రశేఖర్

మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీకి అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ ఆడిట్ సర్టిఫికెట్ సొంతమైంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి చేతులమీదుగా మంగళవారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కేబీ చంద్రశేఖర్ సర్టిఫికెట్ అందుకున్నారు. వర్సిటీ విద్యా కార్యకలాపాలు, పాలనా విభాగంపై హైమ్ ఇంటర్నేషనల్ ప్రైవేటు లిమిటెడ్(ఐఎస్‌వో) ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించారు. వర్సిటీ కార్యకలాపాలపై సంతృప్తి చెందిన సదరు సంస్థ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ ఆడిట్ సర్టిఫికెట్‌తో పాటు గ్రీన్ అవార్డును ప్రకటించారు. రాష్ట్రంలో కృష్ణా వర్సిటీ ఇటువంటి ధ్రువీకరణ పత్రం మొదటిగా అందుకోవటంపై ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి వర్సిటీ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టర్ ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు, ఐఎస్‌వో ప్రతినిధులు పాల్గొన్నారు. వర్సిటీ అధ్యాపకులు, పాలనావిభాగాధిపతుల కృషి ఫలితంగానే ఇటువంటి ఘనత సొంతమైందని వైస్ చాన్స్‌లర్ కేబీ చంద్రశేఖర్ అన్నారు.

జగ్గయ్యపేటలో కొత్త పీజీ సెంటర్‌కు ఆమోదం

కృష్ణా యూనివర్సిటీ పరిధిలో జగ్గయ్యపేటలో నూతనంగా పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) సెంటర్ నెలకొల్పేందుకు వర్సిటీ పాలక మండలి ఆమోదం తెలిపిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కేబీ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. నూజివీడులోని పీజీ సెంటర్‌ను జగ్గయ్యపేటకు తరలిస్తున్నట్లు కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వర్సిటీ పరిధిలో నూజివీడు పీజీ కేంద్రంతో పాటు విద్యార్థుల సౌలభ్యం కోసం జగ్గయ్యపేటలో కూడా అదనంగా మరో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనేది ఆలోచన అన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ఆ ప్రాంత ప్రజా ప్రతినిధుల అభిప్రాయాల మేరకు వర్సిటీ పాలక మండలిలో దీనిపై ఆమోదం తెలిపామన్నారు. జగ్గయ్యపేటలో నూతన పీజీ సెంటర్ మంజూరు కోసం పాలక మండలి ఆమోద నివేదికను ఉన్నత విద్యామండలి ద్వారా ప్రభుత్వానికి పంపిస్తామని వెల్లడించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి రక్షణ పొందే విధంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆస్రా (అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్) స్వచ్ఛంద సంస్థ సహకారంతో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించే ప్రచార రథాన్ని మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోదారుల రక్షణ చట్టం-2019పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారులకు మెరుగైన రక్షణ కల్పించేందుకు ఈ చట్టంలో కొత్తగా ఈ- కామర్స్, డైరెక్ట్ సెల్లింగ్, టెలి షాపింగ్, మల్టీ లెవెల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ లావాదేవీలు, సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఏర్పాటు వంటి వివాదాల పరిష్కారానికి ఎక్కువ సౌలభ్యం ఉండేలా పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ కోమలి పద్మ, ఆస్రా స్వచ్ఛంద సంస్థ చీఫ్ పాట్రన్ హబీబ్ సుల్తాన్ అలీ, స్టేట్ ఈసీ మెంబర్ కోనేరు మధు, జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ కాకాని తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం టు ఇచ్ఛాపురం సంక్షేమ యాత్ర

ఏపీ నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యానాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న యానాదయ్య

భవానీపురం(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు త్వరలో నాయీబ్రాహ్మణ సంక్షేమ యాత్ర నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో మంగళవారం సంఘం మొదటి కార్యవర్గ సమావేశం జరిగింది.

సీఎంకు కృతజ్ఞతలు..

కుల వివక్షపై ప్రభుత్వం జీఓ 50 విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయీబ్రాహ్మణులకు అమలు చేస్తున్న జగనన్న చేదోడు, 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై హర్షం వ్యక్తం చేస్తూ తీర్మానం చేశారు. దేవాలయాల్లో పనిచేస్తున్న క్షురకులు, వాయిద్య కళాకారుల సమస్యలు, 26 జిల్లాల్లో సంఘ నిర్మాణంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన యానాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కుప్పం నియోజకవర్గం నుంచి ఇచ్ఛాపురం వరకు అన్ని జిల్లాల్లో నాయీబ్రాహ్మణ సంక్షేమ యాత్ర నిర్వహించనున్నామని చెప్పారు. చివరిలో రాజకీయాలకు అతీతంగా విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి సీఎంను ఆహ్వానించనున్నామని చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.సుబ్బారాయుడు (కర్నూలు), వల్లూరి కోటేశ్వర రావు (ప్రకాశం), నూకరాజు (విశాఖ), కోశాధికారి ధనవిజయుడు (కర్నూలు), మహిళా అధ్యక్షురాలు కావవరపు శ్రీదేవి (కాకినాడ), దేవాలయాల జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు, యువజన విభాగం అధ్యక్షుడు ఆవుల విశ్వనాథ్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కిడ్నీ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని ఎ.కొండూరు, రెడ్డిగూడెం, తిరువూరు మండలాల్లోని తండాల్లో కిడ్నీ వ్యాధిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గ పరిధిలోని ఎ.కొండూరు మండలం చైతన్యనగర్, చీమలపాడు, మాన్ సింగ్ తండా, రేపూడి, కంభంపాడు, లక్ష్మీపురం తండాలతో పాటు గంపలగూడెం, విస్సన్నపేట మండలాల్లోని కొన్ని గ్రామాలలో ప్రజలు కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారన్నారు. వ్యాధి నివారణకు తగిన కారణాలను తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా నీటిలో ఫ్లోరైడ్‌తో కూడిన సిలికాన్ శాతం, ఆహార అలవాట్లపై ఆరా తీయాలన్నారు. ఎ.కొండూరు, విస్సన్నపేట తదితర ప్రాంతాల ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కృష్ణానదీ జలాలు ప్రస్తుతం మైలవరం నియోజకవర్గం వరకు సరఫరా అవుతున్నాయని, మైలవరం నుంచి ఎ.కొండూరు వరకు పైపు లైన్ పొడిగించి నదీ జలాలను సరఫరా చేసేందుకు రూ.38 కోట్లకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు. త్వరలో అనుమతులు మంజూరు కానున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. 5 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యాధి తీవ్రత, ప్రభావం ఎక్కువగా ఉన్న 15 తండాలలో ప్రతి ఒక్కరికీ యూరిన్, రక్త పరీక్ష, స్కానింగ్ పరీక్షల ద్వారా గుర్తించి చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, హెల్త్ విజిటర్లు టీమ్‌లుగా ఏర్పడి ఒక్కో గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి డేటాను సేకరించాలన్నారు. కిడ్నీ వ్యాధి ప్రభావిత తండాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిలో వ్యాధి లక్షణాలు లేకపోవడం గుర్తించామని కలెక్టర్ అన్నారు. ఐసీఎంఆర్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ ఎం.సుహాసిని, కిడ్నీ వైద్య నిపుణుడు డాక్టర్ అమ్మన్న, వాసవ్య మహిళా మండలి కార్యదర్శి జి.రశ్మి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో నాన్‌స్టాప్ సేవలు

- ఎన్టీఆర్ జిల్లాలో 257 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు మ్యాపింగ్ పూర్తి
- వైద్యుల ఖాళీలను భర్తీ చేసిన ప్రభుత్వం
- అదనంగా నలుగురు వైద్యుల కేటాయింపు
- ఒక్క రోజు కూడా సేవలు ఆగకుండా పక్కాగా ఏర్పాట్లు
- 'సాక్షి'తో డీఎంహెచ్‌వో డాక్టర్ మాచర్ల సుహాసిని



సాక్షి ఇంటర్వ్యూ

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. సేవలు ప్రారంభించేందుకు ముందు ఒకరోజు ప్రయోగాత్మకంగా ట్రయల్ నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. ఒకప్పుడు ఉన్నత వర్గాల వారు మాత్రమే ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకునే వారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సామాన్యులకు సైతం అలాంటి సేవలను అందుబాటులోకి తెచ్చేలా నిర్ణయం తీసుకోవడంతో ఎన్టీఆర్ జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లపై డీఎంహెచ్‌వో 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

పక్కాగా మ్యాపింగ్..

జిల్లాలో 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ) ఉండగా, వాటి పరిధిలో 257 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ ఉన్నాయి. ఆయా హెల్త్ క్లినిక్స్ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బందికి మ్యాపింగ్ పూర్తి చేశాం. ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించేందుకు గాను వైద్యులు, మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ), ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో పాటు, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్(మేల్)లు టీమ్‌గా సేవలు అందిస్తారు. ఇప్పటికే వైద్యులు సందర్శించిన గ్రామాలకు సంబంధించి పక్కాగా మ్యాపింగ్ పూర్తి చేశాం. అంతేకాకుండా సిబ్బందిని సైతం సర్దుబాటు చేసి గ్రామాలకు మ్యాప్ చేశాం.

ఒక్కరోజు కూడా సేవలు ఆగకుండా..

ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఒక్కరోజు కూడా ఆగకుండా పక్కాగా ఏర్పాటు చేశాం. అందులో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకున్నాం. మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కొక్కరే వైద్యులు ఉండగా, ఆ ఖాళీలను సైతం ప్రభుత్వం భర్తీ చేసింది. అంతేకాకుండా అదనంగా నలుగురు వైద్యులను డీఎంహెచ్ఓ కార్యాలయానికి అటాచ్ చేసింది. ఎవరైనా వైద్యులు దీర్ఘకాలిక(మెటర్నిటీ, మెడికల్) సెలవులో వెళ్తే వారి స్థానంలో అదనంగా కేటాయించిన వారు వెళ్లి విధులు నిర్వర్తిస్తారు. వైద్యులు ఒకటి, రెండు రోజులు సెలవులో వెళ్తే సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) వైద్యుడు వెళ్లి సేవలు అందించేలా ప్రణాళిక చేశాం.

సేవలు ఇలా..

- మ్యాపింగ్ చేసిన గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ డాక్టర్, సిబ్బంది సేవలు అందిస్తారు.
- జనరల్ ఓపీతో పాటు, నాన్ కమ్యూనికల్, కమ్యూనికల్ డిసీజ్‌లకు పరీక్షలు చేసి మందులు అందిస్తారు.
- ఇక్కడ 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయి.
- ఆరోగ్యశ్రీలో చికిత్స పొంది డిశ్చార్జి అయిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేస్తారు. ఆస్పత్రిలో వైద్యం ఎలా అందించారు? సేవలు సంతృప్తికరంగా ఉన్నాయా? అనే అంశాలపై ఆరా తీస్తారు.
- నడవలేని స్థితిలో మంచంపైనే ఉన్న రోగులను కూడా ఇళ్లకే వెళ్లి పరీక్షిస్తారు.

క్లుప్తంగా

బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): బకింగ్‌హామ్ కెనాల్‌లో దుగ్గిరాల లాకుల వద్ద పోలీసులు మంగళవారం గుర్తుతెలియని మృతదేహాన్ని వెలికితీశారు. ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుగ్గిరాల లాకుల వద్ద కుళ్లిపోయిన స్థితిలో 45–50 ఏళ్ల మధ్య వయసు ఉన్న ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని వీఆర్వో విజయ్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువలో ఉన్న మృతదేహాన్ని వెలికితీసి చూడగా గ్రేకలర్ ప్యాంటు, పింక్‌కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లేవు. ఎవరైనా మిస్సింగ్ అయితే దుగ్గిరాల పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ చెప్పారు.

ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిరూరల్: ప్రేమించి మోసం చేశాడనే బాధతో విజయవాడలోని ఓ ప్రైవేట్ కాలేజీలో నర్సింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలోని సీతానగరం అయ్యప్పస్వామి గుడి వద్ద రిటైనింగ్ వాల్‌పై నుంచి కృష్ణా నదిలోకి దూకి మంగళవారం ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. అది గమనించిన పోలీసులు ఆమెను కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన సుజన ఓ ప్రైవేట్ కాలేజీలో నర్సింగ్ చదువుతోంది. వారి ఇంటి వద్దే ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. వీరిద్దరూ వివాహం చేసుకునేందుకు పెద్దలు అంగీకారం తెలుపగా, ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకోనని చెప్పడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు.

ఘంటసాల శతజయంతి వేడుకలు ప్రారంభం


సినీ గీతాలను పాడుతున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు చైతన్యవేదిక, తెలుగు కళావాహిని, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో 60 రోజుల పాటు రాష్ట్రంలోని 23 జిల్లాల్లో నిర్వహించే శత జయంతి వేడుకలు గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఘంటసాల అభిమాన సంఘాలు ఒకే వేదికమీద నిర్వహించాల్సిన అవసరముందని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ ఘంటసాల సంగీత సాధన చేసిన విజయనగరంలోనూ, ఆయన జన్మస్థలం అయిన గుడివాడ సమీపంలోని చౌటపల్లిలోనూ డిసెంబరు 4 వ తేదీన పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, చీదెళ్ళ నాగేశ్వరరావు, డాక్టర్ భాగ్యశ్రీ పాల్గొన్నారు. గుంటూరుకు చెందిన యువ గాయని పావని ఘంటసాల శత జయంతి వేడుకల సందర్భంగా వంద యుగళ గీతాలను, సోలో గీతాలను ఆలపించారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం


కుటుంబరావు (ఫైల్)

గుడివాడరూరల్: వేగంగా వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం పాలైన ఘటన మంగళవారం జరిగింది. గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మేడేపల్లి దేవ కుటుంబరావు(58) విధులు ముగించుకుని గుడివాడ వస్తుండగా పట్టణంలోని కోతిబొమ్మ సెంటర్ సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బలంగా బైక్‌ను ఢీకొట్టింది. కుటుంబరావు తీవ్ర గాయాలకు గురవడంతో వెంటనే స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన వైద్యులు కుటుంబరావు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. గుడివాడ టూటౌన్ ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగల వ్యాపారి హత్య కేసులో నిందితుడు అరెస్టు


హత్య కేసులో నిందితుడిని విలేకరుల ముందు హాజరుపర్చిన ఏసీపీ నాగేశ్వరరెడ్డి, పక్కన సీఐ, ఎస్‌ఐ

కంచికచర్ల: పట్టణంలో సంచలనం కలిగించిన నగల వ్యాపారి హత్యకేసులో నిందితుడిని మంగళవారం పోలీసులు విలేకరుల ఎదుట హాజరుపరిచారు. నందిగామ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈనెల 16వ తేదీ రాత్రి సమయంలో కంచికచర్ల హనుమాన్‌పేటలో నివసిస్తున్న బంగారు నగల వ్యాపారి చల్లకుంట నాగరాజు(35)ను మండలంలోని గొట్టుముక్కల గ్రామానికి చెందిన వసంత కాలనీలో నివాసముంటున్న డేరంగుల జోజప్ప అలియాస్ జోజి అనే వ్యక్తి హత్య చేశాడని తెలిపారు. హత్యకు ముందుగా నాగరాజును ఇంటి బయటకు పిలిచి పది నిముషాల పాటు మాట్లాడుకున్న అనంతరం జోజి కోడికత్తితో నాగరాజు ఎడమ ఛాతీపై పొడిచి హత్య చేశాడని చెప్పారు. తన అన్న భార్యతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ, వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న కారణంతో నాగరాజును హత్య చేసినట్లు నిందితుడు విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. జోజి హత్యకు వాడిన కత్తితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ ఐవీ నాగేంద్రకుమార్, ఎస్‌ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ డీవీఆర్, శ్యాంబాబు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో వృద్ధునికి 10 ఏళ్ల జైలుశిక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మహిళ హత్య కేసులో వృద్ధునికి పదేళ్ల జైలుశిక్ష , రూ.10 వేల జరిమానా విధిస్తూ నందిగామ 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ మంగళవారం తీర్పిచ్చినట్లు ఎస్‌ఐ చిన్నబాబు తెలిపారు. మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన గడ్డం అనసూయమ్మకు మతిస్థిమితం లేదు. 2016 ఏప్రిల్ ఏడవ తేదీన గ్రామంలోని బొడ్డురాయి సెంటర్‌లో ఆమె కూర్చుని ఉండగా మోహన్ అనే వృద్ధుడు ఆమెతో ఘర్షణ పడి టవల్‌తో ఆమె గొంతు నులిమాడు. గమనించిన ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారన్నారు. కేసుకు సంబంధించిన 11 మందిని మంగళవారం న్యాయమూర్తి విచారించగా నేరం రుజువు కావటంతో పై విధంగా తీర్పు ఇచ్చినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మెగా జాబ్ మేళాలో 390 మంది ఎంపిక


మెగా జాబ్ మేళా ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యాశాఖ కమిషనరు డాక్టర్ పోలా భాస్కర్


విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద పేర్లు నమోదు చేసుకుంటున్న నిరుద్యోగులు


మెగా జాబ్ మేళాకు చంటిబిడ్డతో పాల్గొన్న మహిళ

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 390 మంది ఎంపికయ్యారు. జాబ్‌మేళాలో 12 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 900 మంది హాజరు కాగా 487 మందిని రెండోదశకు షార్ట్‌లిస్ట్ చేశారు. అనంతరం నిర్వహించిన తుది దశ ఇంటర్వ్యూలలో 390 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ సలహాదారు వి.సుబ్బారావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఎస్.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ఏజీఓ డాక్టర్ తులసి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన

మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మెగా మేళాకు వచ్చిన 12 కంపెనీలలో తమకు నచ్చిన వాటిలో ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

నిరుద్యోగులకు వరం



ఆరుగురు స్నేహితులతో కలిసి మేళాకు వచ్చాం. ఇక్కడ ఫస్ట్ లెవెల్‌ను విజయవంతంగా పూర్తిచేశా. సెకండ్ లెవెల్‌లో కూడా విజయం సాధించి ఉద్యోగం సాధిస్తాను. ఉద్యోగాల కోసం ఎక్కడకు తిరగకుండా కంపెనీలన్నింటినీ ఒక్కచోటకు చేర్చి మేళా నిర్వహించటం నిరుద్యోగులకు వరం

–జైద్ ఖాన్., కడప

అన్ని కంపెనీలు ఒక్కచోటే...



కడప నుంచి మొత్తం 14 మంది ఇక్కడ మెగా జాబ్ మేళాకు వచ్చాం. ఉద్యోగాల కోసం వెతుక్కునే పని లేకుండా అన్ని కంపెనీలను ఒక్కచోట చేర్చి నచ్చిన ఉద్యోగం అందించేందుకు ఉన్నత విద్యాశాఖ చేస్తున్న కృషి మరువలేనిది.

–ఎస్.తిరుమల నాయుడు, కడప

ఉద్యోగం వస్తుందనే నమ్మకం కలిగింది



నేను ఇక్కడ నిర్వహించిన ఇంటర్వ్యూలో మొదటి దశ పూర్తిచేసుకున్నా. రెండో లెవెల్ కూడా పూర్తిచేసి ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది. ఉద్యోగాల కోసం అన్ని కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మేళా ఉపయోగపడుతుంది.

–కె అన్నపూర్ణ, గన్నవరం

అనంతపురం నుంచి 13 మందిమి వచ్చాం



అనంతపురం నుంచి 13 మంది ఫ్రెండ్స్ ఇక్కడకు వచ్చాం. ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి. డిగ్రీ పూర్తయ్యిన తరువాత అక్కడితో వదలివేయకుండా ఉపాధి కల్పించేందుకు మేళా ఏర్పాటు చేయటం ఆనందంగా ఉంది.

–ఇర్ఫాన్, అనంతపురం

వైఎస్ ఇచ్చిన అవకాశాన్ని కాపాడండి

బీసీ కమిషన్ ఛైర్మన్‌కు ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ వినతి

సాక్షి, అమరావతి/భవానీపురం(విజయవాడ పశ్చిమ): ముదిరాజ్(ముత్తరాసి) కులానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన రిజర్వేషన్ అవకాశాన్ని కాపాడి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ముదిరాజ్ సంక్షేమ, అభివృద్ధి సంస్థ(కార్పొరేషన్) ఛైర్మన్ కొర్ని వెంకట నారాయణ ముదిరాజ్ కోరారు. ఈ విషయమై విజయవాడలో బీసీ కమిషన్ ఛైర్మన్ అంబటి శంకర్‌నారాయణను మంగళవారం కలిసి ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ రాష్ట్రంలోని ముదిరాజ్ కులాన్ని బీసీ–డి నుంచి బీసీ ఏ గ్రూపులోకి తీసుకొస్తూ 2009 ఫిబ్రవరి 19న జీవో నంబర్ 15 జారీ చేశారని గుర్తుచేశారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు కోటి మంది ఉన్న ముదిరాజ్ కులస్తులకు ఎంతో మేలు జరిగిందన్నారు. 2009 నవంబర్‌లో బీసీకి చెందిన మరో కులం న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ రిజర్వేషన్ అమలును నిలిపివేశారన్నారు. ముదిరాజ్‌కు బీసీ ఏ రిజర్వేషన్ కొనసాగింపుపై అప్పట్లో కాసాని జ్ఞానేశ్వర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారన్నారు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఆ కేసు విచారణ జరుగుతున్నందున అవసరమైన న్యాయ ప్రక్రియను చేపట్టి ముదిరాజ్ రిజర్వేషన్‌ను కొనసాగించేలా చర్యలు చేపట్టాలని నారాయణ ముదిరాజ్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

గుడ్లవల్లేరు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ వి.ఏసేబు చెప్పిన వివరాల మేరకు మంగళవారం గుడ్లవల్లేరు ప్రధాన ఎంఎన్‌కే రహదారిలోని జోడు వంతెనల సమీపాన బైక్‌పై వెళ్తున్న విద్యార్థులను కారు ఢీకొట్టింది. గుడివాడ విద్యాలయకు చెందిన ఫణికుమార్, రాము, రేవంత్ ప్రాజెక్ట్ వర్క్‌పై గుడ్లవల్లేరు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): తేనెటీగల దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడి, ఒకరు చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. ఈ సంఘటనపై దుగ్గిరాల ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కథనం మేరకు.. దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన పాలపోలు రమేష్, రవికుమార్ (40) అన్నదమ్ములు. రవికుమార్ కుమారుడు చరణ్‌రాజు. వీరు ముగ్గురూ ఈ నెల 15వ తేదీ వడ్లమూడి వెళ్లి తిరిగి వస్తుండగా చిలువూరు శివారులో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. తెనాలిలో చికిత్స పొందుతుండగా రవికుమార్ ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. దీంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ రవికుమార్ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు.

పార్టీ నాయకుడి పాడె మోసిన ఎమ్మెల్యేలు


రాంజీరావు పాడెను మోస్తున్న ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్, రక్షణనిధి

తోట్లవల్లూరు (పామర్రు): కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మేరుగు రాంజీరావు(47) అకాలమరణం చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందారు. ఆయనకు భార్య సుమలత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వల్లూరుపాలెంలోని స్వగృహానికి తీసుకొచ్చిన రాంజీరావు మృతదేహాన్ని తిరువూరు, పామర్రు ఎమ్మెల్యేలు కొక్కిలిగడ్డ రక్షణనిధి, కైలే అనిల్‌కుమార్ మంగళవారం సందర్శించి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. అంతేకాకుండా రాంజీరావు అంతిమ యాత్రలో పాల్గొని పాడెను మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ కూడా రాంజీరావు మృతదేహానికి నివాళి అర్పించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి తదితరులు రాంజీరావు కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

పోటీ చేస్తావో.. చెంచాగిరీ చేస్తావో తేల్చుకో

పవన్‌కల్యాణ్‌కు మంత్రి జోగి రమేష్ సూచన


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: జనసేన పార్టీ అన్ని స్థానాల్లో పోటీలో ఉంటుందా? లేక చంద్రబాబుకు చెంచాగిరీ చేస్తుందా అన్నది తేల్చుకోవాలని పవన్‌కల్యాణ్‌కు మంత్రి జోగి రమేష్ సూచించారు. అవనిగడ్డలో ఈ నెల 20వ తేదీన జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగసభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాతో కలసి మంత్రి జోగి రమేష్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయలేని జనసేన, 60 స్థానాల్లో అభ్యర్థులు లేరని చెప్పిన లోకేష్ ముసుగులు తీసి బయటకు రావాలని సవాల్ విసిరారు. మంగళగిరిలో ఉంటారో లేక మాయాబజార్‌లో ఉంటారో పవన్‌కల్యాణ్ ఇష్టమని, వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ 175 స్థానాల్లో పోటీ చేస్తుందా? లేక చంద్రబాబుకు అమ్ముడుపోతుందా అన్నది ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'వికేంద్రీకరణకు మద్దతుగా లక్ష మందితో విశాఖలో ర్యాలీ చేస్తే ఓర్చుకోలేని జనసేన కార్యకర్తలు సైకోల్లా ప్రవర్తించి మంత్రులపై దాడిచేస్తే వెనకేసుకొస్తావా? ఇదేనా చట్టంపై నీకున్న గౌరవం' అని పవన్‌కల్యాణ్‌ను మంత్రి జోగి రమేష్ సూటిగా ప్రశ్నించారు. మంత్రులపై దాడులకు పాల్పడితే కేసులు నమోదుచేయక సన్మానం చేయాలా అని నిలదీశారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను కించపరిచేలా జనసేన బ్యాచ్ వ్యవహరించిందని దుయ్యబట్టారు. పవన్‌కల్యాణ్‌ను చంద్రబాబు కలిసి సానుభూతి ప్రకటించడం ఊహించిందేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో అరాచకాలు సృష్టించే పార్టీలుగా టీడీపీ, జనసేన ముద్రపడ్డాయని, రెచ్చగొట్టే రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


జగ్గయ్యపేట పట్టణంలోని 14వ వార్డు పద్మావతి నగర్‌లో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను


విజయవాడ భవానీపురం 40వ డివిజన్‌లో 124 వ నంబరు సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్

సంక్షేమ పథకాలపై ప్రజల సంతృప్తి

- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్
- మూడో డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

గుణదల (విజయవాడ తూర్పు): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. మూడో డివిజన్ పరిధిలోని గుణదల ప్రాంతంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సుపరిపాలన మొదలైందన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందించడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న పాలనలో రాజన్న రాజ్యం సాకారమైందని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. సీఎం జగన్ పాలనకు రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.


మూడో డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

కొండ ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం..

నియోజకవర్గంలోని కొండ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని దేవినేని అవినాష్ తెలిపారు. దాదాపు మూడు దశాబ్దాలుగా కొండల మీద పేద ప్రజలు నివసిస్తున్నారని పేర్కొన్నారు. వీరికి కావలసిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని చెప్పారు. కొండ ప్రాంతాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కాలిబాటలు, మెట్ల మార్గాలు, అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆయా ప్రాంతాల్లో వాటర్ సంప్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి సుబ్బారావు, మాతంగి రాజేష్, యాకుబ్, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సొరంగం వద్ద జారిపడిన కొండరాళ్లు


కొండరాళ్లు జారిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిట్టినగర్ సొరంగం వద్ద కొండ రాళ్లు జారిపడ్డాయి. ఆ ప్రాంతాన్ని మంగళవారం 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పక్కా ఇళ్లు కేటాయిస్తే వెళ్లిపోతామని స్థానికులు వారికి తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌తో పాటు కలెక్టర్‌కు సమస్య వివరించి సమస్య పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వో వేణుగోపాల్ కృష్ణ, సచివాలయ సెక్రటరీ సాయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

23న లక్ష్మీకుబేర వ్రతం

పటమట(విజయవాడ తూర్పు): పటమట గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో జయలక్ష్మి మాతృమండలి ఆధ్వర్యాన ఈ నెల 23వ తేదీ లక్ష్మీ కుబేర వ్రతం నిర్వహిస్తున్నామని మండలి కన్వీనర్ స్రవంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక కల్యాణార్థం, భక్తుల సమస్త పీడలు, బాధలు తొలగిపోవడానికి వారి సంపద వృద్ధి చెందేందుకు ఈ వ్రతాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 23వ తేదీ ఉదయం 9.30 గంటలకు వ్రతం ప్రారంభమవుతుందని, వివరాలకు 94916 36317 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

పలువురికి జరిమానాలు

పటమట(విజయవాడ తూర్పు): వీఎంసీ సర్కిల్–3 ప్రాంతంలో మున్సిపల్ మేజిస్ట్రేట్ రామమోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం 31 ఎస్టీసీ కేసులు నమోదు చేసి వారి నుంచి రూ. 12,380 అపరాధ రుసుం వసూలు చేశారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా వ్యవహరించిన ట్రేడ్ లైసెన్స్ లేనివారు, పశువులు, ఆవులు రోడ్ల పైన కట్టిన, రోడ్ల పై చెత్త వేసిన వారికి జరిమానాలు విధించారు. ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చడానికి శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు రోజూ ఆయా డివిజన్లలో ప్లాస్టిక్ అమ్మే షాపులను తనిఖీ చేసి నిషేధాన్ని అమలుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

28న ఫిర్యాదుల స్వీకరణ

కృష్ణలంక(విజయవాడ తూర్పు): తపాల కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర ప్రజా ఫిర్యాదులను ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు నగరంలోని సర్కిల్ కార్యాలయంలో స్వీకరిస్తారని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ అభినవ్ వాలియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కె.సు. ధీర్‌బాబు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్(ఫిర్యాదులు అండ్ సంక్షేమం), చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్ కార్యాలయానికి పోస్ట్ ద్వారా ఈ నెల 24వ తేదీ లోగా పంపాలని కోరారు. పోస్ట్ కవర్‌పై డాక్ అదాలత్ అని పెద్ద అక్షరాలతో రాసి పంపాలని తెలిపారు. డాక్ అదాలత్‌లో ఫిర్యాదును పరిశీలించిన తర్వాత ఫిర్యాదుదారునికి పరిష్కారం లెటర్ ద్వారా గానీ, ఈ మెయిల్ ద్వారా గానీ తెలుపుతామని పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయపడిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామలింగేశ్వరనగర్‌లోని ఈనాడు కాలనీలో నివసిస్తున్న దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఠా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హనుమాన్‌పేటలో పని ముగించుకుని తన సైకిల్‌పై కృష్ణలంకలోని జాతీయ రహదారి మీదుగా ఇంటికి బయలుదేరాడు. స్క్రూబ్రిడ్జి సమీపంలో వారధి వైపు నుంచి బెంజిసర్కిల్ వైపు వేగంగా వెళ్తున్న కారు అతన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. అతను కిందపడిపోవడంతో గాయపడి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. మంగళవారం వైద్యులు ఇచ్చిన సమాచారంపై పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): అత్తింటి వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి గ్రామానికి చెందిన లక్ష్మీ పుష్పకు 2018లో హనుమాన్‌జంక్షన్ బావుల పాడుకు చెందిన లీలా గౌతమ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ. 2 లక్షలు కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కొంత కాలం తర్వాత లీలాగౌతమ్ వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ భార్యను వేధిస్తున్నాడు. పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్త కృష్ణకుమారి, ఆడపడుచు సాయిజ్యోతి ఆమెను వేధిస్తుండటంతో బాధితురాలు పుట్టింటికి వచ్చింది. అత్తింటి వేధింపులపై ఆమె కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీసీల కులగణన చేసేలా చూడాలని వినతి



లబ్బీపేట (విజయవాడ తూర్పు): దేశంలో ఓబీసీల కుల గణన జరిగేలా కేంద్రంపై వత్తిడి తేవాలని కోరుతూ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. విజయవాడలో జరుగుతున్న సీపీఐ సమావేశాల్లో పాల్గొన్న డి.రాజాను బీసీ సంక్షేమ సంఘం నేతలు కలిసి తమ సమస్యలను వివరించారు. సీపీఐ నేతలను కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, గుంటుపల్లి ఉమామహేశ్వరావు, ముప్పాల వెంకటేశ్వరరావు, మేకా వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యతో ఉత్తమ భవిష్యత్తు

పటమట(విజయవాడ తూర్పు): విద్యార్థులకు చదువుతోనే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని గ్రామవార్డు డైరెక్టర్ సాగిలి శాన్‌మోహన్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పటమట పంటకాల్వ రోడ్డులోని స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో యూ–జీనియస్ నేషనల్ క్విజ్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి శాన్‌మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తి ఉన్న సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. జీవితంలో పట్టుదలతో లక్ష్యసాధన చేయాలన్నారు. బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ నవ్‌నీత్ కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 18 జిల్లాల నుంచి 400 పాఠశాలలకు చెందిన 850 మంది విద్యార్థులు క్విజ్‌లో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. డిప్యూటీ జోనల్ హెడ్ పీవీజీఎస్ మూర్తి, డీజీఎం వేగ రమేష్, రీజనల్ హెడ్ రజనీకాంత్, చీఫ్ మేనేజర్ కరణం జయశ్యామ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సాగిలి శాన్‌మోహన్

విద్యుత్ టవర్ లైన్ల పరిశీలన

విజయవాడరూరల్: గొల్లపూడి నుంచి అవుటపల్లి వరకు నిర్మించే జాతీయరహదారి బైపాస్ రోడ్డు ఎత్తులోనే విద్యుత్‌టవర్ లైన్లు ఉండటంతో వాటిని మార్పు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా విజయవాడ సబ్‌కలెక్టర్ అదితి సింగ్ మంగళవారం విద్యుత్‌టవర్లను పరిశీలించారు. బైపాస్‌రోడ్డులో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో విద్యుత్‌టవర్ లైన్లకున్న తీగలు తగిలి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున వాటిని మార్పు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గొల్లపూడి, జక్కంపూడి, అంబాపురం, నున్నలోని విద్యుత్‌టవర్లను జరపాల్సివస్తోందని అధికారులు తెలిపారు. రైతులు సర్వీసురోడ్డు నిర్మించాలని కోరారు. సబ్‌కలెక్టర్‌తో పాటు రూరల్ తహసీల్దారు బి.సాయిశ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇది సినిమా కాదు.. రాజకీయాలు

- పవన్ కల్యాణ్.. విజ్ఞతతో మాట్లాడు
- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇది సినిమా కాదు.. రాజకీయాలని.. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విజ్ఞతతో మాట్లాడాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెహబూబ్ షేక్ హితవు పలికారు. పార్టీ కార్యకర్తల సమావేశంలో పవన్ కల్యాణ్ వైఎస్సార్ సీపీ నేతలను తోలు వలుస్తా.. అంటూ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించాను. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం డాక్టర్ మెహబూబ్ షేక్ విలేకరులతో మాట్లాడారు. సినిమాల్లో మాట్లాడినట్లు, రాజకీయాల్లో మాట్లాడితే చెల్లదని, నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్యకర్తలను రెచ్చగొట్టేలా ప్రసంగించి రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. నీవు చేసిన వ్యాఖ్యలు అన్నీ, పోటీ చేసిన రెండు చోట్ల ఓడిపోయిన నీకే వర్తిస్తాయన్నారు. చంద్రబాబుతో ఉన్న ముసుగు బంధం నోవాటెల్ హోటల్లో కలయికతో తేటతెల్లమైందని ఆయన పేర్కొన్నారు. యువతను రెచ్చగొట్టి, అల్లర్లు చేయించి, కేసుల్లో ఇరికించి వారి బంగారు భవిష్యత్తు నాశనం చేయవద్దని హితవు పలికారు.

మెగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన





నగరంలోని మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి 900 మందిపైగా విద్యార్థులు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చారు. మెగా జాబ్‌మేళాలో 12 ప్రైవేటు కంపెనీ ప్రతినిధులు విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థులు వారి విద్యార్హత పత్రాలతో జాబ్‌మేళాకు వచ్చారు. వారు అక్కడ ఏర్పాటుచేసిన కౌంటర్లలో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వచ్చినవారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ






సీసీ రోడ్డు పనుల పర్యవేక్షణ

సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): స్థానిక ఎస్ఎస్‌పురంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి తెలిపారు. డివిజన్‌లో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సచివాలయ సిబ్బందితో కలసి పర్యవేక్షించారు. శర్వాణిమూర్తి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ముందుచూపు లేకుండా కేవలం బిల్లుల కోసం యూజీడీ, స్ట్రాం వాటర్ డ్రెయిన్లు లేకుండానే సీసీ రోడ్డు నిర్మాణాలు చేశారని ఆరోపించారు. దీంతో పొత్తూరువారి వీధి, పాపరాజువారి వీధి, శివరావు వీధి, ఓగిరాలవారి వీధుల్లో చిన్నపాటి వర్షాలు కురిసినా, సమీపంలోని యూజీడీ లైన్లు నిలిచిన ప్రతిసారి ఆ రోడ్లతో పాటు సమీప నివాసాల్లోకి మురుగునీరు చేరుతోందని తెలిపారు. డివిజన్ పర్యటనలో స్థానికులు వారి ఇబ్బందులను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో ఆయా వీధుల్లో రూ. 16.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు యూజీడీ లైన్ నిర్మాణాలకు మరో రూ.2.18 లక్షలతో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టామన్నారు. డివిజన్‌లో సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి పెట్టామని, త్వరలో అన్ని వీధుల్లోను సీసీ రోడ్లు నిర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ సెక్రటరీ హేమంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు



రామవరప్పాడు : ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిర్మూలించేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించి, సహకరించాలని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు కోరారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు వాడకాన్ని నిషేధిస్తూ ఆయా గ్రామాల్లోని దుకాణాలు, వ్యాపారసంస్థలకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. చెత్తను రహదారులపై డంప్ చేయకుండా డస్ట్‌బిన్‌లను వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగించిన, రోడ్లపై చెత్త వేసినా జరిమానా విధిస్తామన్నారు.

ఔషధ మొక్కలపై అవగాహన

రామవరప్పాడు : విజయవాడరూరల్ మండలం గూడవల్లి ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఔషధ మొక్కలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు ఆయుర్వేద మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిప్పతీగ, నేల ఉసిరి, గుంటగలగర ఆకు, వాము, కలబంద, తులసి, తమలపాకు, గలిజేరు, మొక్కల ఔషధగుణాలను వైద్యురాలు సునీత వివరించారు.

• చైనావాల్‌పై పిచ్చిమొక్కల తొలగింపు


ఇంద్రకీలాద్రి వద్ద దుర్గాఘాట్ సమీపంలో ఉన్న చైన్‌వాల్‌పై పిచ్చిమొక్కలు పెరిగాయి. వాటిని సంబంధిత సిబ్బంది తొలగింపు పనులు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రగ్బీలో సత్తా చాటిన ఎస్టీవీఆర్ విద్యార్థులు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): గన్నవరంలోని మల్లికార్జున ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన సబ్ జూనియర్స్ బాల బాలికల రగ్బీ ఉమ్మడి కృష్ణా జిల్లా టీమ్ సెలెక్షన్స్‌లో దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ విద్యార్థులు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థులు సర్వజ్ఞ, దర్శన్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ప్రకాశం జిల్లా కంభంలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల రగ్బీ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకటరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సూర్యప్రభ , పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు డి. శ్రీనివాసరావు , గణిత ఉపాధ్యాయుడు పి.గోపాల్‌రావు అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



రామవరప్పాడు: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ శీలం రంగారావు తెలిపారు. గ్రామంలోని గూడపాటి వారి వీధిలో రూ.3లక్షల వ్యయంతో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న తాగునీటి బోరును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గ్రామంలో సురక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు అవలంబిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొప్పన కృష్ణ, గ్రామ పెద్దలు పరిమి విష్ణు, సింధూర, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ నాథ్ పాల్గొన్నారు.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సిందూరం, ఆకుపూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



కరీమ్ బెంజెమాకు 'గోల్డెన్ బాల్'

యూరోపియన్ అత్యుత్తమ ఫుట్‌బాల్ ప్లేయర్‌కు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక పురస్కారం 'గోల్డెన్ బాల్'ను ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు, రియల్ మాడ్రిడ్ క్లబ్ జట్టు సభ్యుడు కరీమ్ బెంజెమా సొంతం చేసుకున్నాడు. గత సీజన్‌లో చాంపియన్స్ లీగ్ టైటిల్‌ను, స్పానిష్ లీగ్ టైటిల్స్‌ను మాడ్రిడ్ క్లబ్ గెల్చుకోవడంలో 34 ఏళ్ల కరీమ్ కీలకపాత్ర పోషించాడు. 2009 నుంచి మాడ్రిడ్ జట్టుకు ఆడుతున్న కరీమ్ 223 గోల్స్ సాధించాడు. 24 ఏళ్ల తర్వాత (1998లో జిదాన్) ఫ్రాన్స్ ప్లేయర్‌కు 'గోల్డెన్ బాల్' అవార్డు లభించింది.

క్వార్టర్ ఫైనల్లో అర్జున్



ఎయిమ్‌చెస్ ఆన్‌లైన్ ర్యాపిడ్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, గుకేశ్, విదిత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరారు. 16 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 15 రౌండ్ల పాటు జరిగిన ప్రిలిమినరీ దశ తర్వాత 27 పాయింట్లతో గుకేశ్ రెండో స్థానంలో, అర్జున్ 27 పాయింట్లతో నాలుగో స్థానంలో, 21 పాయింట్లతో విదిత్ ఎనిమిదో స్థానంలో నిలిచారు. క్వార్టర్స్‌లో కార్ల్‌సన్ (నార్వే)తో అర్జున్; డూడా (పోలాండ్)తో విదిత్; రాపోర్ట్ (రొమేనియా)తో గుకేశ్ ఆడతారు.

ఇషా జట్టుకు స్వర్ణం



కైరో (ఈజిప్ట్): ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పసిడి వేట కొనసాగుతోంది. ఈ మెగా ఈవెంట్‌లో తాజాగా భారత్‌కు మరో మూడు స్వర్ణ పతకాలు లభించాయి. జూనియర్ మహిళల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్, వర్షా సింగ్, శిఖా నర్వాల్‌లతో కూడిన భారత జట్టు పసిడి పతకం గెలిచింది. ఫైనల్లో భారత్ 16–6తో చైనా జట్టును ఓడించింది. జూనియర్ మహిళల ఎయిర్ రైఫిల్ టీమ్ ఫైనల్లో తిలోత్తమా సేన్, నాన్సీ, రమితాలతో కూడిన భారత జట్టు 16–2తో చైనా జట్టుపై గెలిచి స్వర్ణం నెగ్గింది. జూనియర్ పురుషుల ఎయిర్ రైఫిల్ టీమ్ ఫైనల్లో శ్రీ కార్తీక్ శబరి రాజ్, దివ్యాంశ్ సింగ్ పన్వర్, విదిత్ జైన్‌లతో కూడిన భారత జట్టు 17–11తో చైనా జట్టుపై గెలిచి బంగారు పతకం సాధించింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 9 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 20 పతకాలతో రెండో స్థానంలో ఉంది.

శ్రీకాంత్ శుభారంభం



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మాజీ చాంపియన్ శ్రీకాంత్ 17–21, 21–14, 21–12తో ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)పై గెలుపొందాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం 21–15, 21–15తో అలెగ్జాండ్రా బోయె–అమాలియా మేజ్‌లుండ్ (డెన్మార్క్) జోడీపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

బిన్నీ చేతికి బోర్డు పగ్గాలు

'దాదా' వారసుడిగా ఏకగ్రీవ ఎన్నిక

పోటీలేని కొత్త కార్యవర్గం



దేవ్‌జిత్ సైకియా, జై షా, రోజర్ బిన్నీ , రాజీవ్ శుక్లా, ఆశిష్ షెలార్, అరుణ్ ధుమాల్ (ఎడమ నుంచి)

ముంబై: మరోసారి మరో మాజీ క్రికెటరే బోర్డు పాలకుడయ్యారు. తొలి వన్డే ప్రపంచకప్ (1983) గెలిచిన టీమిండియా సభ్యుడు, 67 ఏళ్ల రోజర్ బిన్నీ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తర్వాత మళ్లీ ఆటగాడే బోర్డు పగ్గాలు చేపట్టారు. మంగళవారం జరిగిన బోర్డు వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో పదవులన్నీ కూడా పోటీలేకుండానే నామినేషన్ వేసిన వాళ్లందరికీ దక్కాయి. అయితే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ అభ్యర్థిపై ఎలాంటి చర్చ లేకుండానే బోర్డు ఏజీఎం పదవుల పంపకంతోనే ముగిసింది. గుడ్డిలో మెల్ల అన్నట్లుగా మహిళల ఐపీఎల్‌ను ఆమోదించడం ఒక్కటే జరిగింది. 'ఐసీసీకి వెళ్లే బోర్డు ప్రతినిధిపై, ఐసీసీ చైర్మన్‌గిరిపై ఏ నిర్ణయం తీసుకోలేదు. కేవలం ఎజెండాలోని అంశాలే ఏజీఎంలో చర్చించారు' అని ఓ రాష్ట్ర సంఘం సభ్యుడొకరు తెలిపారు.

కొత్త కార్యవర్గం: రోజర్ బిన్నీ (అధ్యక్షుడు), జై షా (కార్యదర్శి), రాజీవ్ శుక్లా (ఉపాధ్యక్షుడు), దేవ్‌జిత్ సైకియా (సంయుక్త కార్యదర్శి), ఆశిష్ షెలార్ (కోశాధికారి).

ఐపీఎల్ చైర్మన్‌గా ధుమాల్

గంగూలీ నేతృత్వంలోని బోర్డులో ఇన్నాళ్లు కోశాధికారిగా పనిచేసిన అరుణ్ ధుమాల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కొత్త చైర్మన్‌గా ఎన్నికయ్యారు. బ్రిజేశ్ పటేల్ స్థానంలో ఆయన్ని నియమించారు. ఎమ్‌కేజే మజుందార్‌ను బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ ప్రతినిధిగా ఎన్నుకున్నారు.

అమ్మాయిల ఐపీఎల్‌కు జై

బోర్డు ఏజీఎంలో ఐపీఎల్ తరహా అమ్మాయిల లీగ్‌కు ఆమోదం లభించింది. వచ్చే ఏడాది మార్చిలో ఐదు జట్లతో మహిళల ఐపీఎల్ జరుగుతుంది. అయితే జట్లను ఎలా విక్రయించాలి, టోర్నీని ఏ విధంగా నిర్వహించాలనే అంశాలను కొత్త గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయిస్తుందని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు.

> క్రికెటర్ల గాయాలపై దృష్టి పెడతాం. ఆటగాళ్లు తరచూ గాయాలపాలయ్యే పరిస్థితుల్ని తగ్గిస్తాం. దీనికోసం అందుబాటులో ఉన్న అవకాశాల్ని పరిశీలించి, పరిస్థితిని మెరుగుపరుస్తాం. బెంగళూరు అకాడమీ (ఎన్సీఏ)లో డాక్టర్లు, ఫిజియోల బృందం ఈ పనిలో నిమగ్నమవుతాయి. దేశవాళీ పిచ్‌లను పోటీతత్వంతో ఉండేలా తీర్చిదిద్దుతాం. ఆస్ట్రేలియాలాంటి దేశాలకు దీటుగా పిచ్‌లను తయారు చేస్తాం. -రోజర్ బిన్నీ

ఏటా రూ. వేల కోట్లు పెరుగుదల

ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన క్రికెట్ బోర్డు (బీసీసీఐ) నగదు నిల్వలు ఏటికేడు వేల కోట్లు పెరిగిపోతున్నాయి. మూడేళ్ల క్రితం పరిపాలకుల కమిటీ (సీఓఏ) ఆధ్వర్యంలో ఉన్నపుడు రూ. 3,648 కోట్లుగా ఉన్న బోర్డు కోశాగారం ఇప్పుడు రూ. 9,629 కోట్లకు చేరింది. కేవలం మూడేళ్లలోనే రూ. 5,981 కోట్లు పెరిగాయి. దాదాపు 3 రెట్లు ఆదాయం పెరిగింది. అలాగే రాష్ట్ర సంఘాలకు వితరణ కూడా ఐదు రెట్లు పెంచారు. సీఓఏ జమానాలో రూ. 680 కోట్లు ఇస్తుండగా... ఇప్పుడది రూ.3,295 కోట్లకు పెరిగిందని కోశాధికారి పదవి నుంచి దిగిపోతున్న అరుణ్ ధుమాల్ ఏజీఎంలో ఖాతాపద్దులు వివరించారు.

పాక్‌లో ఆడేదిలేదు

వచ్చే ఏడాది పాకిస్తాన్ ఆతిథ్యమివ్వనున్న ఆసియా కప్ టోర్నీలో ఆడలేమని బోర్డు కార్యదర్శి జై షా స్పష్టం చేశారు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌కు ముందు వన్డే ఫార్మాట్‌లో ఆసియా ఈవెంట్ పాకిస్తాన్‌లో నిర్వహించనున్నారు. దీనిపై ఏజీఎంలో చర్చించిన నూతన కార్యవర్గం తటస్థ వేదికపైనే ఆడేందుకు మొగ్గు చూపింది. అనంతరం ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడైన జై షా బోర్డు నిర్ణయాన్ని వెలువరించారు. తటస్థ వేదికపై అయితేనే ఆసియా కప్ ఆడతామన్నారు. ఈ ఏడాది టి20 ఫార్మాట్‌లో శ్రీలంకలో జరగాల్సిన ఆసియా ఈవెంట్ సింహళ దేశం దివాళా కారణంగా యూఏఈలో నిర్వహించారు. పాక్‌లో జరిగే ఆసియాకప్‌లో టీమిండియా ఆడకపోతే... వచ్చే ఏడాది భారత్ ఆతిథ్యమిచ్చే వన్డే వరల్డ్‌కప్‌లో పాకిస్తాన్ కూడా ఆడబోదని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. ఇక కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని అన్నారు.

గెలిచి నిలిచిన శ్రీలంక



నిసాంక

గిలాంగ్: టి20 ప్రపంచకప్‌లో 'సూపర్ 12' దశకు అర్హత సాధించే అవకాశాలు సజీవంగా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో శ్రీలంక అదరగొట్టింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక 79 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 152 పరుగులు సాధించింది. ఓపెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నిసాంక (60 బంతుల్లో 74; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) పట్టుదలతో నిలబడటంతో శ్రీలంక స్కోరు 150 దాటింది. 15వ ఓవర్లో యూఏఈ లెగ్ స్పిన్నర్ కార్తీక్ మెయ్యప్పన్ మూడు వరుస బంతుల్లో లంక బ్యాటర్లు రాజపక్స, అసలంక, షనకలను అవుట్ చేసి 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. దాంతో ఒకదశలో 2 వికెట్లకు 117 పరుగులతో పటిష్టంగా కనిపించిన లంక అదే స్కోరు వద్ద మూడు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే నిసాంక చివరి ఓవర్ వరకు ఆడటంతో శ్రీలంక గౌరవప్రద స్కోరు సాధించింది. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 17.1 ఓవర్లలో 73 పరుగులకే ఆలౌటైంది. చమీరా (3/15), హసరంగ (3/8), తీక్షణ (2/15) యూఏఈ జట్టును దెబ్బ తీశారు.

యూఏఈ స్పిన్నర్ కార్తీక్ 'హ్యాట్రిక్'



నెదర్లాండ్స్ రెండో విజయం

గ్రూప్ 'ఎ'లో భాగంగా నమీబియాతో జరిగిన మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ ఐదు వికెట్ల తేడాతో గెలిచి 'సూపర్ 12' దశకు చేరువైంది. తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా 6 వికెట్లకు 121 పరుగులు సాధించింది. ఫ్రయ్‌లింక్ (43; 1 ఫోర్, 1 సిక్స్) టాప్ స్కోరర్. అనంతరం నెదర్లాండ్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 122 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. మాక్స్ ఒడౌడ్ (35; 1 ఫోర్, 1 సిక్స్), విక్రమ్‌జిత్ సింగ్ (39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), బస్ డి లీడీ (30 నాటౌట్; 2 ఫోర్లు) రాణించారు. గురువారం జరిగే తదుపరి మ్యాచ్‌ల్లో నెదర్లాండ్స్‌తో శ్రీలంక; యూఏఈతో నమీబియా తలపడతాయి. శ్రీలంక, నమీబియా గెలిస్తే నెదర్లాండ్స్‌తో కలిసి మూడు జట్లు నాలుగు పాయింట్లతో సమంగా నిలుస్తాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్న రెండు జట్లు 'సూపర్ 12' దశకు అర్హత సాధిస్తాయి.

ప్రియాంక... ఇక వెళ్లు!



చెన్నై: ఆంధ్రప్రదేశ్ మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) నూతక్కి ప్రియాంక ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఊహించని పరిణామంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆరో రౌండ్ గేమ్ సందర్భంగా ఆమె ధరించిన బ్లేజర్ జేబులో ఇయర్ బడ్స్ ఉండటంతో అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) వేటు వేసింది. 20 ఏళ్ల ప్రియాంకను మిగతా రౌండ్లు ఆడకుండా టోర్నీ నుంచి పంపించింది. అధునాతన సాంకేతిక పరికరాలతో మోసపూరిత ఆట ఆడే అవకాశం ఉండటంతో స్మార్ట్ పరికరాలకు అనుమతి లేదు. 'ఆమె గేమ్‌లో చీటింగ్‌కు పాల్పడలేదు. కానీ నిషేధిత పరికరాలతో హాల్‌లోకి ప్రవేశించరాదని కఠిన నిబంధనలున్నాయి. వీటిని ఉల్లంఘించడంవల్లే ప్రియాంక‌పై వేటు వేశాం' అని 'ఫిడే' తెలిపింది.


మెరిసిన కరణ్: ఆంధ్ర విజయం




ఇండోర్: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. బిహార్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో ఆంధ్ర రెండు వికెట్ల తేడాతో గెలిచింది. 182 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర 19.4 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 186 పరుగులు చేసి నెగ్గింది. కరణ్ షిండే (38 బంతుల్లో 75; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడి ఆంధ్ర విజయంలో కీలకపాత్ర పోషించాడు. అంతకుముందు బిహార్ 20 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించింది. జైపూర్‌లో ఢిల్లీ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' ఐదో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 46 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఢిల్లీ 6 వికెట్లకు 196 పరుగులు చేయగా... హైదరాబాద్ 19.1 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది.

సినిమా

ట్రైయాలజీ







రణ్‌వీర్ సింగ్



రితేష్ దేశ్‌ముఖ్

ఫ్రాంచైజీ, రీమేక్స్, బయోపిక్స్ ట్రెండ్‌ల తర్వాత బాలీవుడ్ ప్రస్తుతం ట్రయాలజీ (ఒకే కథను మూడు భాగాలుగా) ట్రై చేస్తోంది. అరడజను ట్రయాలజీ ఫిలింస్ వెండితెరపైకి రానున్నాయి. ఆ 'ట్రైయాలజీ' చిత్రాల వివరాల్లోకి వెళితే...

బ్రహ్మాస్త్రం



రాజమౌళి

ఐదేళ్లుగా సినీ లవర్స్ 'బ్రహ్మాస్త్ర' ట్రయాలజీ గురించి వింటూనే ఉన్నారు. రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ జంటగా, అమితాబ్ బచ్చన్, నాగార్జున, మౌనీరాయ్ కీలక పాత్రల్లో 'బ్రహ్మాస్త్ర' ట్రయాలజీలోని తొలి భాగం 'బ్రహ్మాస్త్ర: శివ' రూపొందింది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించిన ఈ సినిమా దక్షిణాది వెర్షన్స్‌కు రాజమౌళి సమర్పకులుగా ఉండటం విశేషం. ఈ ఏడాది సెప్టెంబరు 9న ఈ చిత్రం విడుదలైంది. ఇప్పుడు 'బ్రహ్మాస్త్ర' రెండో, మూడో భాగాలపై ఫోకస్ పెట్టారు మేకర్స్. రెండో భాగంలోని ప్రధాన పాత్రల కోసం హృతిక్ రోషన్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్‌ల పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే.

ఇతిహాసాల ఆధారంగా...!

ట్రయాలజీ ఫిలింస్ తీసేంత స్కోప్ రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు ఉంది. ఆల్రెడీ బాలీవుడ్ ప్రముఖ దర్శకులు నితీష్ తివారి, రవి ఉడయార్‌లు కలిసి రామాయణం ఆధారంగా ఓ ట్రయాలజీని ప్లాన్ చేశారు. అల్లు అరవింద్, మధు మంతెన, నమిత్ మల్హోత్రా వంటి అగ్ర నిర్మాతలు ఈ భారీ చిత్రాన్ని నిర్మించనున్నారు. దాదాపు ఏడాదిన్నరగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఇక ఈ ప్రాజెక్ట్‌లో ప్రధాన పాత్రధారులుగా మహేశ్‌బాబు, రామ్‌చరణ్, హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ వంటి స్టార్ల తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే మహాభారతంలోని అశ్వత్థామ పాత్ర ఆధారంగా హిందీలో ఓ ట్రయాలజీ రూపుదిద్దుకోనుంది. 'ది ఇమ్మోర్టల్ అశ్వత్థామ' అనే టైటిల్‌ను కూడా ప్రకటించారు. విక్కీ కౌశల్ టైటిల్ రోల్ చేయనున్న ఈ చిత్రానికి అదిత్య ధార్ దర్శకత్వం వహిస్తారు. అలాగే 'మహాభారతం' ఆధారంగా సింగపూర్‌కు చెందిన కృష్ణ ఉదయశంకర్ రాసిన 'ది ఆర్యావతార క్రానికల్స్' (గోవింద, కౌరవ, కురుక్షేత్ర) పుస్తకం హక్కులను సోనమ్ కపూర్ దక్కించు కున్నారు. 'ది ఆర్యావతార క్రానికల్స్'ను ట్రయాలజీగా నిర్మించే ఆలోచనలో ఉన్నట్లు సోనమ్ పేర్కొన్నారు. ఇంకా 'మహాభారతం' ఆధారంగా ఓ సినిమా చేయాలన్నది తన డ్రీమ్ అని దర్శకుడు రాజమౌళి పలు సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ కూడా ట్రయాలజీనే అనే వార్తలు వినిపిస్తున్నాయి.

కొత్త నాగిని

వెండితెరపై నాగిని అనగానే హిందీలో శ్రీదేవి, రీనా రాయ్, రేఖ గుర్తుకు వస్తారు. ఈ జాబితాలో హీరోయిన్ శ్రద్ధా కపూర్ పేరు చేరనుంది. 'నాగిన్' ట్రయాలజీలో నటించేందుకు శ్రద్ధా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విశాల్ పురియా దర్శకత్వంలో ఈ ట్రయాలజీని నిఖిల్ ద్వివేది నిర్మించనున్నారు.



శ్రద్ధా కపూర్

ఛత్రపతి

మహావీరుడు ఛత్రపతి శివాజీ జీవితంతో ఓ ట్రయాలజీని నిర్మించనున్నట్లు నటుడు, నిర్మాత రితేష్ దేశ్‌ముఖ్ రెండేళ్ల క్రితం ప్రకటించారు. ఈ ట్రయాలజీని తెరకెక్కించేందుకు మరాఠీ దర్శకులు 'సైరట్' ఫేమ్ నాగరాజ్ మంజులే, రవీంద్ర జాదవ్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి.

శక్తిమాన్

ఇక బుల్లితెర, వెండితెర సూపర్ హీరోస్‌లలో శక్తిమాన్‌కు ఆడియన్స్‌లో సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ సూపర్ హీరో క్రేజ్‌ను క్యాష్ చేసుకునే దిశలో ఇప్పటికే పలువురు నిర్మాతలు సినిమాలు తీశారు. తాజాగా అగ్ర నిర్మాణ సంస్థ సోనీ పిక్చర్స్ ఇంటర్‌నేషనల్ 'శక్తిమాన్' టైటిల్‌తో ఓ సినిమాను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించింది. ట్రయాలజీగా రూపొందించేందుకు ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని, టైటిల్ రోల్‌లో రణ్‌వీర్ సింగ్ కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇవే కాదు.. మూడు భాగాల చిత్రాలు మరికొన్ని తెరపైకి వచ్చే చాన్స్ ఉంది.

మాకు సినిమాయే జీవితం

- విజయ్ దేవరకొండ

''మాకు సినిమాయే జీవితం.. ఎంత ప్రేమించి చేస్తామో మాకు తెలుసు. అలాంటిది ఓ రోజు ఓ సినిమా వేదికపై శివ కార్తికేయన్‌గారు ఏడుస్తూ మాట్లాడటంతో నాకు చాలా బాధేసింది. అప్పటి నుంచి ఆయన నాకు ఓ బ్రదర్ అనే ఫీలింగ్ కలిగింది'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. శివ కార్తికేయన్, మారియా ర్యాబోషప్క జంటగా అనుదీప్ కేవీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రిన్స్'. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, డి.సురేష్ బాబు, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''శివ కార్తికేయన్ అన్నని ఈ రోజే తొలిసారి కలిశాను. ఆయన ప్రయాణం నాకు నచ్చింది. ఎప్పుడైనా ఆయనకి నేను తోడుంటే బాగుంటుందనిపించింది.. ఆ అవకాశం ఇంత త్వరగా 'ప్రిన్స్' రూపంలో వచ్చింది. సురేశ్ ప్రొడక్షన్స్ (పెళ్లి చూపులు), ఏషియన్ సినిమాస్ (అర్జున్ రెడ్డి) నా కెరీర్‌లో చాలా ముఖ్యమైన పాత్ర పోషించాయి. 'ప్రిన్స్' ట్రైలర్ చూసి చాలా ఎంజాయ్ చేశాను. అందర్నీ నవ్వించే అనుదీప్‌కి ఈ సినిమా బిగ్ బ్లాక్‌బస్టర్ ఇవ్వాలి'' అన్నారు. డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ– ''మధ్యతరగతి జీవితాలను అనుదీప్ క్షుణ్ణంగా చదివాడని 'జాతిరత్నాలు' చూసిన తర్వాత నాకు అనిపించింది. ముళ్లపూడి వెంకటరమణ, జంధ్యాల, బాపుగార్లు.. మిడిల్ క్లాస్ లైఫ్‌లను బాగా అర్థం చేసుకుని వినోదాన్ని పండించారు. అనుదీప్ కూడా సీరియస్‌గా ఉంటూ నవ్వులు పంచుతాడు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ కావాలి'' అన్నారు. ''ఈ కథ శివ కార్తికేయన్‌గారి కోసమే రాశా.. ఇప్పుడున్న పరిస్థితుల్లో అందరూ చూడాల్సిన సినిమా ఇది'' అన్నారు అనుదీప్. కెమెరామేన్ మనోజ్ పరమహంస, సంగీత దర్శకుడు తమన్ తదితరులు పాల్గొన్నారు.



• సునీల్ నారంగ్, విజయ్ దేవరకొండ, మారియా, శివకార్తికేయన్, అనుదీప్, హరీష్ శంకర్, జాన్వీ

ఓరి దేవుడా ఎంటర్‌టైన్ చేస్తుంది

- మిథిలా పాల్కర్, ఆశాభట్



''ఓరి దేవుడా' చిత్రకథ, కథనాలు ప్రేక్షకుల మనసులకు దగ్గరగా ఉంటాయి. ఫ్యామిలీ, యూత్.. ఇలా అన్ని వర్గాల ఆడియన్స్‌ని మా చిత్రం ఎంటర్‌టైన్ చేస్తుంది'' అని హీరోయిన్లు మిథిలా పాల్కర్, ఆశా భట్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా వెంకటేష్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఓరి దేవుడా'. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించారు. మిథిలా పాల్కర్, ఆశా భట్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి వంశీ కాక ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. పీవీపీ, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై పెరల్ వి. పొట్లూరి, పరమ్ వి. పొట్లూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మిథిలా పాల్కర్, ఆశా భట్ విలేకరులతో మాట్లాడుతూ– ''ఓ మై కడవులే' చిత్రం తమిళంలో ఘనవిజయం సాధించింది. తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా చాలా మార్పులు చేసి, ఆ చిత్రాన్ని 'ఓరి దేవుడా'గా రీమేక్ చేయడం జరిగింది. ఇందులోని ట్విస్టులు ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తాయి. అశ్వత్ అద్భుతంగా తెరకెక్కించారు. వెంకటేశ్ సార్ లాంటి లెజెండ్‌తో నటించడం మా అదృష్టం. ఆయన నటించడం మా సినిమాకి చాలా ప్లస్ అవుతుంది. విశ్వక్ సేన్ అంకిత భావంతో పనిచేస్తారు. ఆయనతో నటించడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మించారు. దీపావళికి కుటుంబమంతా కలిసి మా సినిమాను థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు.

> నేను నటించిన 'లిటిల్ థింగ్స్' వెబ్ సిరీస్‌ని రామ్ చరణ్‌లాంటి స్టార్ హీరో, ఆయన సతీమణి ఉపాసన గారు చూడటం ఆనందంగా ఉంది. నా నటనకి ఫ్యాన్ అంటూ 'ఓరి దేవుడా' ప్రీ రిలీజ్ వేడుకలో రామ్‌చరణ్ గారు మాట్లాడటంతో నా ఆనందానికి అవధుల్లేవు.
> - మిథిలా పాల్కర్

గోదావరి ప్రేమ కథ



• కోమలి

'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'శశివదనే'. కోమలీ ప్రసాద్ హీరోయిన్. సాయిమోహన్ ఉబ్బన దర్శకుడు. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా అహితేజ బెల్లంకొండ మాట్లాడుతూ– ''గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ చాలా అందంగా తెరకెక్కించాడు. కోనసీమ, అమలాపురంలోని అందమైన లొకేషన్లలో 50 రోజుల పాటు చిత్రీకరించాం. మూడు రోజుల ప్యాచ్ వర్క్ మాత్రమే మిగిలి ఉంది. మా చిత్రంలోని ఐదు పాటలు అద్భుతంగా వచ్చాయి. త్వరలో రిలీజ్ కానున్న మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. సంగీత దర్శకుడు రఘు కుంచె, ప్రవీణ్ యండమూరి, కన్నడ నటుడు దీపక్ ప్రిన్స్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సాయికుమార్ దార, సంగీతం: శరవణ వాసుదేవన్, సీఈవో: ఆశిష్ పెరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: శ్రీపాల్ చొల్లేటి.

యువత అంతరంగం



• సునీల్ కుమార్ రెడ్డి, మనోజ్

మనోజ్ నందం, సోనీ రెడ్డి, మనీషా, కృష్ణ తేజ, ఫణి చక్రవర్తి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వెల్కమ్ టు తిహార్ కాలేజ్'. పి. సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో డాక్టర్ ఎల్ఎస్ రావు, యక్కలి రవీంద్రబాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ర్యాంకుల పోటీలో పడి నలిగిపోతున్న యువత అంతరంగాన్ని వినోదభరితంగా, ఆలోచింపజేసే విధంగా ఈ చిత్రాన్ని నిర్మించామంటూ, మంగళవారం ట్రైలర్‌ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. ఈ సందర్భంగా పి. సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ – ''జీవించడానికి ధైర్యం ఇవ్వాల్సిన చదువే చావడానికి ఓ కారణం అవుతున్న ఈ పరిస్థితులు దురదృష్టకరం. గతంలో నేను ఫిజిక్స్ అండ్ మ్యాథ్స్ టీచర్‌గా చేసినప్పుడు స్టూడెంట్స్ మైండ్ సెట్‌ని అర్థం చేసుకున్నాను కాబట్టి నేను అనుకున్న కథ అనుకున్నట్టుగా తీయగలిగాను'' అన్నారు. ''కొందరు విద్యార్థుల అనుభవాలనే ఈ సినిమాలో చూపించాం'' అన్నారు మనోజ్ నందం.